అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శనివారం 30-12-2023
సంపుటి : 9 | సంచిక : 312 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

మత ఉద్రిక్తత సృష్టించేందుకే
రాజకీయ ప్రాజెక్టుగా రామ మందిర ప్రారంభోత్సవం

- ప్రధాని మోడీ, యూపీ సీఎం యోగి తీరుపై ఏచూరి
- కేంద్రం తీరు రాజ్యాంగానికి, లౌకికవాద స్ఫూర్తికి, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని వ్యాఖ్య



తిరువనంతపురం : యూపీలోని అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తప్పుబట్టారు. మత ఉద్రిక్తతను సృష్టించేందుకే రామ మందిర ప్రారంభోత్సవాన్ని ప్రధాని మోడీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లు రాజకీయ కార్యక్రమంగా మార్చారని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని మొత్తం మోహరించటం ద్వారా కేంద్రం రాజ్యాంగానికి, లౌకికవాద స్ఫూర్తికి, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని తెలిపారు. "మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే, రామమందిర ప్రారంభోత్సవాన్ని ప్రధాని, యూపీ ముఖ్యమంత్రి చేయాలనుకుంటే, ఇందుకు మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగిస్తే.. దానర్థం రాష్ట్రాన్ని ఒక నిర్దిష్ట మతంతో గుర్తిస్తున్నారు. అది భారత రాజ్యాంగానికి, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం" అని ఆయన అన్నారు.

కేరళలోని కాసర్‌గోడ్‌లో గల చెంగాల గ్రామ పంచాయతీలో సీపీఐ(ఎం) అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలస్తీనా సంఘీభావ సభను ప్రారంభించిన అనంతరం ఏచూరి మాట్లాడారు. వచ్చే ఏడాది ...3లో

ఖర్చుకు సాగుకు

పొంతనలేదు..
97 వేల ఎకరాల ఆయకట్టుకు రూ.లక్ష కోట్లు

వివరాలు 3లో..

- మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన మంత్రుల బృందం

"కమీషన్ల కోసం ప్రాణహిత చేవెళ్లకు పాతరేశారు. తిరిగి ఆ ప్రాజెక్టును తుమ్మిడి హట్టి వద్ద నిర్మిస్తాం. నిపుణుల కమిటీ అభిప్రాయాలను తీసుకుంటాం. గత ప్రభుత్వం నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసింది. అధికారులూ తప్పులు చేశారు. ఎంతటి వారినైనా వదిలిపెట్టబోం. క్యాబినెట్‌లో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటాం"
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



మేడిగడ్డ ఓ మేడిపండు..
అన్నారం సుందిళ్లదీ అదే దారి

- రాష్ట్రానికి మోయలేని భారంగా మారిన వైనం
- కాళేశ్వరం ప్రాజెక్టులో 50 వేల కోట్ల అవినీతి

వివరాలు 3లో..

బొగ్గు బ్లాకుల వేలంపై ఏం చేశారు?
బయ్యారం స్టీల్‌ప్లాంట్ ఏమైంది...



- నైనీబ్లాక్ ఉత్పత్తి ఆలస్యం ఎందుకు? : మంత్రి 'భట్టి' ప్రశ్నలకు సింగరేణి అధికారులు ఉక్కిరిబిక్కిరి
- సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియను నిలుపుదల చేయడానికి ఏం చర్యలు తీసుకున్నారు? రాష్ట్ర విభజన చట్టంలోని బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాల్ని గుర్తించారా? సింగరేణికి కేటాయించిన ఒడిస్సా నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తిని ఎందుకు ఆలస్యం చేస్తున్నారు? అంటూ వరుస ప్రశ్నలతో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి అధికారులను ఉక్కిరి బిక్కిరి చేశారు. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు స్పష్టంగా, సూటిగా చెప్పాలనీ, తప్పించుకునే పద్ధతి వద్దని హితవు పలికారు. సింగరేణి వ్యవహారాలపై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయనీ, వాటన్నింటినీ నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని స్పష్టం చేశారు. శుక్రవారంనాడాయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సింగరేణి కాలరీస్‌లోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో పూర్తిస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌పై ...11లో




మార్గదర్శకాలు రూపొందించండి

- రాష్ట్రపతి పరిశీలనకు బిల్లులు పంపడంపై సుప్రీంను కోరిన కేరళ

న్యూఢిల్లీ : రాష్ట్ర శాసన సభ ఆమోదించి పంపించిన బిల్లులను గవర్నర్ ఎంతకాలంలో ఆమోదించాలనే అంశానికి సంబంధించి మార్గదర్శకాలను రూపొందించాల్సిందిగా కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. గవర్నర్ ఎంతకాలం తన వద్ద బిల్లులను రిజర్వ్ చేయవచ్చునో, రాష్ట్రపతి పరిశీలనకు ఎంతకాలంలో పంపించాలో, ఎంతకాలంలో అసెంబ్లీకి తిప్పి పంపాలి అనే అంశాలపై స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరింది. అత్యున్నత న్యాయస్థానంలో గతంలో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌కు సవరణ చేయడం ద్వారా ఈ అంశాలను తాజాగా కేరళ ప్రభుత్వం లేవనెత్తింది. రాజ్యాంగంలోని 200వ అధికరణంలోని ...11లో

శ్వేతపత్రాలు, న్యాయ విచారణలు
స్వాగతిస్తున్నాం
హామీలు అమలు చేయలేకనే
కాంగ్రెస్ ప్రభుత్వ డ్రామాలు : బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శ్వేతపత్రాలు, న్యాయ విచారణలను స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణంలో గల బీఆర్ఎస్ఎల్పీలో మీడియా సమావేశం నిర్వహించారు. అందులో ఆయనతో పాటు ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ..ఇచ్చిన హామీలకు నిధులు సమీకరించలేక కాంగ్రెస్ నేతలు డ్రామాలాడుతున్నారని ...3లో



నేడు 80 బస్సులకు పచ్చజెండా
మార్చి నాటికి 1,050 కొత్త బస్సులు

- టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)లో రూ.400 కోట్ల వ్యయంతో 1,050 కొత్త డీజిల్ బస్సుల్ని ప్రవేశపెట్టనున్నట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వీటిలో 400 ఎక్స్‌ప్రెస్, 512 పల్లె వెలుగు, 92 లహరీ స్లీపర్ కమ్ సీటర్, 56 ఏసీ రాజధాని బస్సులు ఉన్నాయని వివరించారు. వాటితో పాటు హైదరాబాద్ నగరంలో 540, జిల్లాలకు 500 ఎలక్ట్రిక్ బస్సులను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 'మహాలక్ష్మి' మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకంలో భాగంగా రద్దీ పెరిగిందనీ, కొత్త బస్సుల రాకతో దాన్ని నియంత్రించగలుగుతామని అభిప్రాయపడ్డారు. దీనిలో భాగంగానే శనివారం ఉదయం 10 గంటలకు 80 డీజిల్ కొత్త బస్సుల్ని ప్రవేశపెడుతున్నామనీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నెక్లెస్‌రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వీటిని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ బస్సుల్లో 30 ఎక్స్‌ప్రెస్, 30 రాజధాని ఏసీ, 20 లహరీ స్లీపర్ కమ్ సీటర్(నాన్ ఏసీ) బస్సులు ఉన్నాయని వివరించారు.

హైదరాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి ఐదో ర్యాంకు 11లో..
7.85 లక్షల మందికిపైగా పాస్ పోర్టులు

సబ్సిడీలకు తూట్లు...
కేటాయింపుల్లో కత్తెరింపులు దశాబ్దపు కనిష్టానికి వ్యయాలు

- మూలధన పెట్టుబడులకు ప్రాధాన్యత
- బీజేపీ పాలనలో సామాన్యులకు ఎగనామం

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమానికి తూట్లు పొడుస్తోంది. సంక్షేమ పథకాలకు కేటాయింపులు, వ్యయాలను భారీగా తగ్గిస్తూ వస్తోంది. మరోవైపు ఇతర మూలధన పెట్టుబడులకు మాత్రం విపరీత ప్రాధాన్యతను ఇస్తోంది. గత 20 ఏండ్ల బడ్జెట్‌ను విశ్లేషిస్తే.. మోడీ ప్రభుత్వ హయాంలోని 10 సంవత్సరాల కాలంలో మొత్తం ప్రభుత్వ వ్యయంలో వాస్తవ మూలధన వ్యయం యొక్క వాటా చరిత్రాత్మక గరిష్ట స్థాయికి చేరుకుంది. మరోవైపు సబ్సిడీల వాటా దశాబ్దపు కనిష్టానికి పడిపోయింది. వ్యయాల్లో యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ), బీజేపీ ప్రభుత్వాల వ్యయాల్లో స్పష్టమైన తేడా కనబడుతోంది. మోడీ ప్రభుత్వ హయాంలో సబ్సిడీల వ్యయాలు పదేండ్ల కనిష్టానికి పడిపోగా.. మూలధన వ్యయాలు నూతన గరిష్ట స్థాయిలకు చేరాయని యూనియన్ బడ్జెట్ డాక్యుమెంట్ల ఆధారంగా ది ప్రింట్ ఓ కథనం ప్రచురించింది. ప్రభుత్వ వ్యయంలో మూలధన వ్యయం అనేది భవనాలు, రోడ్లు, వంతెనలు మొదలైన స్థిర ఆస్తులను సృష్టించటం, స్వాధీనం చేసుకోవటంపై ప్రభుత్వం చేసే ఖర్చు. మౌలిక వసతులు, ఇన్నోవేషన్, భవనాలు, రోడ్ ట్రాన్స్‌పోర్ట్, జాతీయ రహదారులు, రైల్వేలు, రక్షణ తదితర ఎంపిక చేసిన మంత్రిత్వ శాఖలకు మూలధన వ్యయాలను అమాంతం పెంచింది.



మరోవైపు సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసింది. గ్యాస్, పెట్రోల్, విద్యుత్, ఎరువులపై ఇచ్చే సబ్సిడీలకు మంగళం పాడగా.. అనేక సంక్షేమ కార్యక్రమాలకు కోతలు పెట్టింది. అదే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సబ్సిడీలు, సంక్షేమానికి రెట్టింపు కేటాయింపులు జరిగాయి.

యూపీఏతో పోల్చితే అంతా రివర్స్..

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనను నిందిస్తూ ఎప్పుడూ ...11లో



ఇంటర్ పరీక్షల ఫీజు గడువు 3 వరకు పొడిగింపు

- రూ.2,500 ఆలస్య రుసుంతో చెల్లింపునకు అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు హాజరయ్యేందుకు ఫీజు చెల్లింపు గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.2,500 ఆలస్య రుసుంతో వచ్చేనెల మూడో తేదీ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశముందని తెలిపారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె ...11లో

డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై ఉక్కుపాదం...
ఈ ఏడాది పండుగలు, ఎన్నికల నిర్వహణ ప్రశాంతం

- గతేడాదితో పోలిస్తే 9 శాతం పెరిగిన నేరాలు
- 18 శాతం పెరిగిన సైబర్ నేరాలు
- మహిళలపై నేరాల్లో 5.19 శాతం పెరుగుదల : 2023 వార్షిక నేర నివేదిక విడుదల చేసిన డీజీపీ రవిగుప్తా

వివరాలు 10లో..



కోవిడ్‌లో రూ. 40 వేల కోట్ల స్కామ్
యడ్యూరప్పపై బీజేపీ ఎమ్మెల్యే ఆరోపణలు



బెంగళూరు : కోవిడ్ మహమ్మారి సమయంలో వైరస్‌ను ఎదుర్కొనే పేరుతో అప్పటి ముఖ్యమంత్రి బిఎస్ యడ్యూరప్ప రూ. 40 వేల కోట్ల స్కామ్‌కు పాల్పడ్డారని బీజేపీకే చెందిన ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ తాజాగా ఆరోపించారు. ' కోవిడ్ సమయంలో ఎన్ని వేల కోట్ల రూపాయల దోపిడీ జరిగిందో మీకు తెలుసా.? కోవిడ్ పేరు చెప్పి రూ 40 వేల కోట్లు కొల్లగొట్టారు' అని యత్నాల్ శుక్రవారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. 'రూ. 45 ఖరీదు ఉండే మాస్కును కోవిడ్ సమయంలో రూ.485 ఖరీదుతో అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసింది' అని విజయపుర నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున ఎన్నికైన యత్నాల్ ఆరోపించారు. అలాగే, 'బెంగళూరులో 10 వేల పడకలతో ఆస్పత్రి ఏర్పాటు చేశామని అప్పటి బీజేపీ ప్రభుత్వం ...11లో

పెట్టుబడి సాయానికి నిరీక్షణ

కరీంనగర్ జిల్లాలో 32శాతం మంది ఖాతాల్లోనే 'రైతుబంధు'

రూ.177.98 కోట్లకు.. విడుదలైంది రూ.13.39 కోట్లు

- అసలు సాయం అందుతుందా? లేదా? అన్న ఆందోళన



యాసంగి పెట్టుబడి సాయం కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు ఈ సీజన్‌లో పాతసాయాన్ని యథావిధిగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పినా రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది ఖాతాల్లో పడలేదు. రైతులు ఎదురుచూస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో 32శాతం మంది రైతుల ఖాతాల్లోనే రైతుబంధు సాయం పడింది. జిల్లాకు రూ.177.28 కోట్లకుగాను 13.39కోట్లు విడుదలయ్యాయి. దీంతో పెట్టుబడి సాయం పడుతుందా? లేదా? అన్న గందరగోళంలో రైతులు ఉన్నారు. అధికారులు మాత్రం పడుతుందని రైతులకు సర్దిచెబుతున్నట్టు తెలిసింది.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ముందుగా సన్నకారు రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం నిధులు జమ చేస్తామన్న ప్రభుత్వ ప్రకటన చిన్న రైతుల్లో ఆశలు పెంచింది. అర్హులైన వారిలో 35శాతానికి మించి రైతుల ఖాతాల్లో నిధులు జమ కాలేదు. సాయం సమాచారం కోసం వ్యవసాయ అధికారుల కార్యాలయాలకు ప్రతిరోజూ వెళ్తున్నారు రైతులు. కొందరు ప్రయివేటు వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికే నాట్లు వేసిన వరికి, మొలక దశలో ఉన్న మొక్కజొన్నకు ఎరువులు వేయాల్సి ఉందని తెలిపారు.

కరీంనగర్ జిల్లాలో రైతుబంధుకు అర్హులైన వారు 2,03,096 మంది ఉన్నారు. వీరందరికి ఒక్కో పంట కాలానికి ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.182 కోట్లు అవసరం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ యాసంగి సీజన్‌కుగాను లక్షా88వేల 518 మంది రైతుల వివరాల పరిశీలన పూర్తి చేయగా.. సర్కారు నుంచి రూ.177.98 కోట్లు విడుదల కావాల్సి ఉంది.

అయితే, మొదటి దశలో జిల్లాకు 76వేల 963 మంది రైతులకు సంబంధించి రూ.20.30కోట్లు విడుదల చేస్తున్నట్టు ఆన్‌లైన్ పోర్టల్‌లో చూపించారు. కానీ ఇంతవరకు 61వేల 800 మంది రైతుల ఖాతాల్లో మాత్రమే రూ.13.39కోట్లు జమ అయింది.

రైతుబంధు వస్తేనే నాటు వేస్తా..!



'రైతుబంధు వస్తేనే నాటు వేస్తా సారూ..!' అంటూ గంగాధర మండలం మంగపేటకు చెందిన దళిత రైతు నర్సయ్య మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్ కుమార్ తో గోడు వెళ్లబోసుకున్నాడు. గురువారం ఓ శుభకార్యానికి వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో గంగాధర మండల సమీపంలో ఆగారు.. ఆ సమయం లో ఆయన దగ్గరికి వెళ్లిన నర్సయ్య రైతుబంధు సాయం ఆలస్యంపై ఆవేదన వ్యక్తం చేశాడు. 'మొన్న అమ్మిన వడ్ల పైసలతోనే మళ్లీ సాగుకు పెట్టుబడి పెట్టిన. రైతుబంధు సాయంపై ఆందోళనగా ఉంది..'' అని చెప్పుకొచ్చిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయింది.

మాజీ ఎంపీ వినోద్ కుమార్‌తో రైతు గోడు

ఎన్ని ఎకరాలనే సమాచారం లేదు

రైతుబంధు నిధులు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారమే విడుదల అవుతున్నాయి. రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. అయితే ఎన్ని ఎకరాలున్న రైతులకు వేస్తున్నారో తెలియదు. జిల్లాలో అర్హుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ఎన్ని ఎకరాలకు, ఎంత మంది రైతులకు సాయం అందిస్తున్నారనే సమాచారం మాకు లేదు.

వాసిరెడ్డి శ్రీధర్, కరీంనగర్ జిల్లా వ్యవసాయాధికారి

బిజినెస్


సుకన్య సమృద్ధిపై స్వల్పంగా వడ్డీ పెంపు



న్యూఢిల్లీ : బాలికలకు చెందిన పొదుపు పథకం సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకంపై కేంద్రం ఎట్టకేలకు స్వల్పంగా వడ్డీ రేట్లను పెంచింది. చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను ఆర్థిక శాఖ సవరించింది. ప్రతీ త్రైమాసికానికి ఓ సారి వడ్డీ రేట్లను సమీక్షించే విషయం తెలిసిందే. సుకన్య సమృద్ధి యోజన, మూడేండ్ల కాలవ్యవధి కలిగిన పోస్టాఫీసు టైమ్ డిపాజిట్‌లపై మాత్రమే వడ్డీ రేట్లను పెంచింది.

ఎస్ఎస్‌వైపై ప్రస్తుతం ఉన్న 8 శాతం వడ్డీ రేటును 20 బేసిస్ పాయింట్లు పెంచి 8.2 శాతానికి చేర్చింది. పోస్టాఫీసు మూడేండ్ల టైమ్ డిపాజిట్‌పై 7 శాతంగా ఉన్న వడ్డీని 7.1 శాతానికి చేర్చింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి మార్చి 31 వరకు ఈ వడ్డీ రేట్లు వర్తించనున్నాయి. మిగిలిన పథకాలపై వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. అదే విధంగా పీపీఎఫ్‌పై 7.1 శాతం, సీనియర్ సిటిజన్ స్కీమ్ 8.2 శాతం, మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ 7.4 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ 7.7 శాతం, కిసాన్ వికాస్ పత్ర వడ్డీ రేట్లు 7.5 శాతం చొప్పున వడ్డీ రేట్లు ఇంతక్రితం స్థాయిల్లోనే అమల్లో ఉండనున్నాయి.

క్లియర్ ప్రీమియం చేతికి కెల్జాయ్ వోల్కానిక్..!



హైదరాబాద్ : కెల్జాయ్ వోల్కానిక్ వాటర్‌లో మెజారిటీ వాటాను తీసుకుంటున్నట్టు క్లియర్ ప్రీమియం వాటర్ ప్రకటించింది. అగ్ని పర్వాతాల బుగ్గల నుంచి సేకరించిన విలక్షణ సహజ ఖనిజ జలాలకు కెల్జాయ్ వోల్కానిక్ వాటర్ ప్రసిద్ధి చెందింది. ఈ కొనుగోలు తమ సంస్థకు ముఖ్యమైన మైలు రాయిని అని క్లియర్ ప్రీమియం పేర్కొంది. ఇది తమ ఉత్పత్తి పోర్ట్ ఫోలియోను విస్తరించడానికి, బాటిల్డ్ వాటర్ పరిశ్రమలో ఆవిష్కరణకు మార్గదర్శకంగా నిలువనుందని తెలిపింది. దీంతో తమ మార్కెట్ ఉనికి పెరగనుందని క్లియర్ ప్రీమియం వాటర్ వ్యవస్థాపకుడు, సీఈఓ నయన్ షా పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో సిగ్నిటీ ఓడీసీ విస్తరణ



హైదరాబాద్ : ప్రపంచంలోని ప్రముఖ ఏఐ, ఐపీ ఆధారిత డిజిటల్ అస్యూరెన్స్, డిజిటల్ ఇంజినీరింగ్ సేవల సంస్థ అయిన సిగ్నిటీ టెక్నాలజీస్ హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ టెక్ పార్క్‌లో కొత్త ఆఫ్‌షోర్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఓడీసీ)ని ప్రారంభించింది. దీన్ని సిగ్నిటీ ఛైర్మెన్ సివి సుబ్రమణ్యం, సీఈఓ శ్రీకాంత్ చక్కిలం లాంచనంగా ప్రారంభించారు. ప్రస్తుత 2 లక్షల చదరపు అడుగులకు అదనంగా, దాదాపు 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్తగా ప్రారంభించబడిన ఈ ఆఫీస్ స్పేస్‌లో 400 మంది నిపుణులు సౌకర్యవంతంగా పని చేయవచ్చని ఆ సంస్థ తెలిపింది. ఈ విస్తరణ మా సామర్థ్యాలను పెంపొందించడమే కాకుండా మా ఉద్యోగులకు ప్రపంచ స్థాయి పని వాతావరణాన్ని అందించడంలో మా నిబద్ధతను కూడా నొక్కి చెబుతుందని శ్రీకాంత్ చక్కిలం పేర్కొన్నారు.

తొమ్మిదేండ్లు..ఎవ్వరికీ పట్టనోడు

ఉద్యోగం కోసం అలుపెరుగని పోరాటం

- ఇందిరా పార్కు వద్ద కొండయ్య రిలే నిరాహారదీక్ష
- మల్లేపల్లి ఐటీఐ కళాశాలలో ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకోలు
- కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందనే ఆశ ఉంది : కొండయ్య



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తొమ్మిదేండ్ల పోరాటం.. సర్కారు బడ్జెట్ అలాట్‌మెంట్‌తో పోస్టును గుర్తించినా అందని వేతనం.. పట్టించుకోని అధికారగణం..అతన్ని ఉద్యోగంలోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినా విధుల్లోకి తీసుకోకుండా ప్రిన్సిపాల్ వేధింపుల పర్వం....తానెక్కడా తప్పుచేయలేదు..న్యాయం తనకే దక్కుతుందనే తొమ్మిదేండ్ల పోరాట ప్రస్థానం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో దక్కని న్యాయం ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కారు హయాంలోనే దక్కుతుందనే చిన్న ఆశతో అలుపెరుగని పోరాటం చేస్తున్నాడు మల్లేపల్లి ఐటీఐ కళాశాలకు చెందిన కాంట్రాక్టు అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్(ఏటీఓ) నూకతోటి పెద కొండయ్య. 'ప్రాణం పోయినా సరే..న్యాయం దక్కాల్సిందే. ఉద్యోగం ఇవ్వాల్సిందే.' అనే ఒక్క డిమాండ్‌తో తన పోరాట పంథా కొనసాగిస్తున్నాడు. తన వ్యథ సమాజంలోని అందరికీ తెలియజెప్పాలనే యత్నంలో భాగంగా వేర్వేరు ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు చేస్తూ చర్చనీయాంశమవుతున్నాడు. అందులో భాగంగానే శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద దీక్షకు కూర్చున్నాడు. మీడియాకు, అటుగా వెళ్లేవాళ్లకూ తన గోడును మొరపెట్టుకున్నాడు. తనకు తొమ్మిదున్నరేండ్లుగా తనకు జరుగుతున్న అన్యాయంపై కన్నీటి పర్యంతమయ్యాడు. మీడియాతో కొండయ్య మాట్లాడుతూ.. 2008 నుంచి మల్లేపల్లి ఐటీఐలో పనిచేస్తున్నానని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 320 మంది ఏటీఓలందర్నీ కొనసాగించాలని ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. కానీ, మల్లేపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్, ప్రస్తుత డిప్యూటీ డైరెక్టర్ మాత్రం లోకల్ ఏటీఓలకు మాత్రమే రిజిస్టర్‌లో సంతకాలు చేసే అవకాశం కల్పించారని వాపోయారు. విద్యార్థులకు చదువులు చెబుతున్నా జీతాలివ్వకపోవడాన్ని ప్రశ్నిస్తూ ఎస్సీ, ఎస్టీ కమిషన్, హైకోర్టుకు వెళ్లడమే పాపమైందన్నారు. కమిషన్, హైకోర్టు విధుల్లోకి తీసుకోవాలని తీర్పు చెప్పినా ప్రిన్సిపాల్ తనపై కక్షగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పు ప్రకారం ముగ్గురు నాన్‌లోకల్ ఏటీఓలను విధుల్లోకి తీసుకున్నారని చెప్పారు. కోర్టుకెళ్తావా? జీవితాంతం ఐటీఐలో ఉద్యోగం లేకుండా చేస్తానని ప్రిన్సిపాల్ బెదిరించాడని వాపోయారు. 2015 అక్టోబర్ నుంచి క్లాసులు కూడా చెప్పనీయటం లేదన్నారు. 2014 నుంచి 2023 వరకు కాంట్రాక్టు ఏటీఓల లిస్టులో తన పేరుతో బడ్జెట్ అలాట్‌మెంట్ కూడా జరుగుతున్నదని చెప్పారు. అప్పటి నుంచి న్యాయపోరాటం చేస్తున్నా, వినతిపత్రాలు ఇస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తనకు న్యాయం చేయాలనీ, తిరిగి ఉద్యోగం ఇప్పించాలని వేడుకున్నారు.

సీఈసీ, ఈసీ నియామక బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఈసీలు) నియామకం, సర్వీసు నిబంధనలను నియంత్రించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు.

ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పార్లమెంటు ఉభయ సభలు గతంలో ఆమోదించిన బిల్లు ప్రకారం సీఈసీ, ఎన్నికల కమిషనర్లను (ఈసీలు) నియమించే ఎంపిక కమిటీకి ప్రధానమంత్రి, కేంద్ర క్యాబినెట్ మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అధ్యక్షత వహిస్తారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కమిటీ నుంచి తొలగించారు.

ఈతకు వెళ్ళి ఇద్దరు మృతి



నవతెలంగాణ–మొగుళ్ళపల్లి

ఈతకు వెళ్ళిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాటిపాముల రవికుమార్ తన తండ్రి సంవత్సరీకం కార్యక్రమానికి తన చెల్లెలు కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం కనగర్తి గ్రామానికి చెందిన సిరిమల్లె స్వరూప, బావ రమేష్, వాళ్ల కుమారుడు శ్రీకాంత్(17) హాజరయ్యారు. కాగా రమకుమార్ కుమారులు పవన్(28), సాయి చరణ్, మేనల్లుడు సిరిమల్లె శ్రీకాంత్ సరదాగా స్నానం చేద్దామని గ్రామ శివారులోని పెద్దవాగుకు వెళ్లారు. కాగా, సాయి చరణ్ బహిర్భూమికి వెళ్లగా.. పవన్, శ్రీకాంత్.. వాగులోకి దిగారు. కానీ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగు కోతకుగురై నీటి ప్రవాహంలో లోతు తెలియకపోవడంతో ఇద్దరు స్నానం చేసే క్రమంలో మునిగిపోయారు. సాయిచరణ్ తిరిగి వచ్చే సరికి తన అన్నా పవన్, బావ శ్రీకాంత్ ఇద్దరూ కనిపించలేదు. పరిసర ప్రాంతంలో గాలించగా.. పవన్ మృతదేహం కనిపించడంతో రోదిస్తూ కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చాడు. వారు పోలీసులకు తెలపగా చిట్యాల సీఐ వేణు చందర్ మొగుళ్లపల్లి ఎస్ఐ జాడి శ్రీధర్, పోలీస్ సిబ్బందిని ఘటనాస్థలికి చేరుకొని వాగులో గాలించారు. గల్లంతైన శ్రీకాంత్ మృతదేహం లభ్యమైంది. దాంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహలను పోస్ట్‌మార్టం నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. రవి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

హైకోర్టును బుద్వేల్‌కు తరలించొద్దు: న్యాయవాదులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైకోర్టును రంగారెడ్డి జిల్లా బుద్వేల్‌కు తరలించాలన్న నిర్ణయాన్ని ప్రధాన న్యాయమూర్తి వెనక్కి తీసుకోవాలని పలువురు హైకోర్టు న్యాయవాదులు కోరారు. తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ సీనియర్, జూనియర్ న్యాయవాదులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'హైకోర్టు నగరం నడిబొడ్డున ఉండాలి. ఫ్యామిలీ కోర్ట్, సివిల్ కోర్ట్, హైకోర్టుకు కేసుల నిమిత్తం నడుస్తూ కూడా న్యాయవాదులు ఆ కోర్టులకు సకాలంలో చేరుకుని తమ క్లయింట్స్‌కు న్యాయం చేయవచ్చు. అలాగే నాంపల్లి క్రిమినల్ కోర్ట్ చంచల్ గూడా జైలు కూడా చేరువలో ఉంది. ఇలా ఉంటే వాహనాలు లేని సామాన్య అడ్వకేట్స్‌కు తమ న్యాయవాద వృత్తికి ఇబ్బంది ఉండదు. అదే హైకోర్టు రంగారెడ్డి జిల్లా బుద్వేల్‌కు తరలిస్తే ఐదు శాతమున్న కార్పొరేట్ ఆఫీస్‌లకు లాభమే తప్ప 95 శాతమున్న సామాన్య న్యాయవాదులకు ఇబ్బంది ...'అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గుండ్రాతి శారదాగౌడ్, బర్ల మల్లేష్ యాదవ్, రామారావు. మామిడి వేణు మాధవ్, మల్లారెడ్డి, మణికంఠ, ప్రసాద్, సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

- ఉప ముఖ్యమంత్రికి పీఆర్టీయూ తెలంగాణ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని పీఆర్టీయూ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, అధ్యక్షులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, కోశాధికారి ఎన్ చంద్రశేఖర్‌రావు కలిసి వినతిపత్రం సమర్పించారు. జీపీఎఫ్, సరెండర్ లీవులు, మెడికల్ బిల్లులు, ఇతర ఆర్థిక చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను ఉద్యోగులకు వెంటనే చెల్లించాలని కోరారు. మూడు డీఏలను తక్షణమే మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. అంతకుముందు వారు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిశారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

3న టెక్నో పాప్8 స్మార్ట్‌ఫోన్ విడుదల

న్యూఢిల్లీ: టెక్నో తన స్మార్ట్‌ఫోన్ పోర్టుపోలియోను విస్తరిస్తోంది. జనవరి 3న టెక్నో పాప్8 స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేయనున్నట్టు ప్రకటించింది. ఇది మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తి అని తెలిపింది. 84జీబీ ర్యామ్, 64జీబీ ఇంటర్నల్ స్టోరేజీతో దీన్ని అందుబాటులోకి తెస్తోంది. 6.56 అంగుళాల పొండ స్క్రీన్ ప్రొటెక్షన్, 5000 ఎంఎహెచ్ బ్యాటరీతో దీన్ని విడుదల చేస్తుంది.

ప్రతి సమస్యనూ ప్రభుత్వం పరిష్కరిస్తుంది

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, వాటిని పరిష్కరించనున్నట్టు ప్రజావాణి నోడల్ అధికారి హరిచందన తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే ప్రజాభవన్ నందు నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జిదారులతో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా హరిచందన మాట్లాడారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. ప్రత్యేక కౌంటర్ల ద్వారా అర్జీదారుల నుంచి అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ ప్రజావాణి నిర్వహణను సమన్వయం చేశారు.

పాస్‌పోర్టుల జారీలో 5వ స్థానంలో హైదరాబాద్

- రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజా



నవతెలంగాణ–బేగంపేట్

పాస్ పోర్టుల జారీలో దేశంలోనే హైదరాబాద్ 5వ స్థానంలో ఉందని హైదరాబాద్ రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజా తెలిపారు. సికింద్రాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు అత్యధికంగా 7 లక్షల 85 వేలకుపైగా పాస్‌పోర్టులు జారీ చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల సహకారంతో పాస్ పోర్టుల జారీలో మంచి ఫలితాలను సాధిస్తు న్నట్టు చెప్పారు. సాధారణ పాస్ పోర్టులను ఏడు నుంచి 10 పని దినాలలో, తాత్కాలిక పాస్ పోర్టులను రెండు నుంచి మూడు పనిదినాలలో జారీ చేస్తున్నట్టు వెల్లడించారు. పాస్ పోర్టుల జారీలో పారదర్శకత పాటిస్తు న్నామని, బ్రోకర్లను ఆశ్రయించి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. బ్రోకర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.





ఖర్చుకు సాగుకు పొంతన లేదు

- 97 వేల ఎకరాల ఆయకట్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు
- కమీషన్ల కోసం ప్రాణహిత చేవెళ్లకు పాతరేశారు
- తిరిగి ఆ ప్రాజెక్టును తుమ్మిడి హట్టి వద్ద నిర్మిస్తాం
- నిపుణుల కమిటీ అభిప్రాయాలను తీసుకుంటాం
- గత ప్రభుత్వం నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసింది
- అధికారులూ తప్పులు చేశారు
- ఎంతటి వారినైనా వదిలిపెట్టబోం
- క్యాబినెట్‌లో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటాం : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన మంత్రుల బృందం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ప్రపంచం అబ్బురపడే రీతిలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని గత ప్రభుత్వం చేసిన ప్రచారం తప్పని తేలింది. రూ.38 వేల కోట్లతో 16 లక్షల ఎకరాలకు నీరందించే ప్రాణహిత ప్రాజెక్టును పక్కన పెట్టి రూ.లక్ష కోట్ల భారీ వ్యయంతో బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. తద్వారా 18 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందిస్తామంటూ డాంభికాలు పలికింది. కానీ కేవలం 97 వేల ఎకరాలకు మాత్రమే నీరందించగలిగింది...'అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన వాస్తవ విషయాలను ప్రజలకు తెలిపేందుకు ఉత్తమ్‌తోపాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కూడిన బృందం శుక్రవారం భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించింది.

హెలికాప్టర్ ద్వారా ప్రాజెక్టును విహంగ వీక్షణం చేసిన అనంతరం వారికి సాగునీటి పారుదల ఈఎన్‌సీ మురళీధర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ... ఇంత భారీ వ్యయం చేసి నిర్మించిన ప్రాజెక్టులో ఈ యేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ వద్ద ఏడో బ్లాక్‌లో 20వ పిల్లర్ కుంగి పోయిందని చెప్పారు. దీంతో దానికి ఇరువైపులా ఉన్న మరో రెండు పిల్లర్లకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ రకంగా పెద్ద ఎత్తున నష్టం జరిగినప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. బీఆర్ఎస్ సర్కార్ కమీషన్ల కోసం కక్కుర్తి పడి అడ్డగోలు నిర్మాణాలు చేపట్టిందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై నిపుణుల అభిప్రాయాలను తీసుకుని ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాత క్యాబినెట్‌లో తగు నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందులో అధికారుల తప్పిదాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. చట్ట ప్రకారం వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

ముంపు సమస్యను పరిష్కరించాలి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల ముంపునకు గురైన చెన్నూరు ప్రాంత ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు. ముంపు ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం కోసం కరకట్టలు నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రాన్ని అప్పులపాల్జేశారు : మంత్రి పొంగులేటి

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రాష్ట్రాన్ని అప్పులపాల్జేశారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టు నాణ్యత, రక్షణ చర్యలు, నిర్వహణ తదితరాంశాలను గత ప్రభుత్వం గాలికొదిలేసిందని అన్నారు. ఫలితంగా మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌లు సైతం ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యారేజీ అప్ స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్‌లను నాణ్యతగా కట్టి ఉంటే ప్రమాదం జరిగేది కాదని అభిప్రాయపడ్డారు. టెండర్లపై చూపిన ఆసక్తి నాణ్యతలోగానీ, మరమ్మతుల్లోగానీ ఎందుకు చూపలేదని ప్రశ్నించారు. వరదలు వచ్చినప్పుడు స్టాప్ లాక్ గేట్లు ఎందుకు పనిచేయలేదో చెప్పాలంటూ ఇంజినీర్లను మంత్రి నిలదీశారు. మేడిగడ్డ నుంచి 50 టీఎంసీల నీరు లిఫ్ట్ చేశారు..మూడో బ్యారేజ్ వద్ద 41 టీఎంసీలను లిఫ్ట్ చేశారు, అలాంటప్పుడు 9 టీఎంసీల నీడిని ఎక్కడ వాడారంటూ ప్రశ్నించారు.

అధికారులు అసలు విషయాలను దాస్తున్నారు : మంత్రి కోమటిరెడ్డి

ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను, అసలు విషయాలను అధికారులు దాస్తున్నారంటూ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సాంకేతికంగా తప్పుడు డిజైన్లు ఇస్తే వాటిని సరిదిద్దాల్సిన అధికారులు సర్కారుకు వంతపాడారంటూ విమర్శించారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్ట్ కట్టి ఉంటే తెలంగాణకు గ్రావిటీ ద్వారా సాగునీరు వచ్చి ఎంతో లాభం జరిగేదని చెప్పారు. పంపు హౌస్‌ల్లో నాణ్యత లేని మోటర్లను బిగించారని ఆయన ఆరోపించారు. పిల్లర్ కుంగిపోవటానికి సంబంధించి ప్రాజెక్టు పొంగడం, విద్రోహ చర్యల్లాంటి కబుర్లన్నీ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించటానికి చెబుతున్నవేనని ఎద్దేవా చేశారు. వీటిపై బీఆర్ఎస్ ప్రభుత్వం నాటకాలాడుతోందని విమర్శించారు. ఇప్పటికైనా కాళేశ్వరం వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు అధికారులపై కూడా ఉందని వ్యాఖ్యానించారు.

విచారణలో అన్నీ తేలతాయి : ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తప్పులు చేసిన అధికారులనే అడిగితే వాస్తవాలు ఎలా బయటకు వస్తాయని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన థర్డ్ పార్టీ ఏజెన్సీతో విచారణ జరిపిస్తే అప్పుడు అన్నీ తేలతాయని ఆయన చెప్పారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు సమయంలో ఖర్చు చేసిన రూ.11 వేల కోట్లలో ఎల్లంపల్లి ఎగువన ఎంత ఖర్చు చేశారని ఆయన ఈఎన్‌సీని ఈ సందర్భంగా నిలదీశారు. ఈ ప్రాజెక్టులో రూ.50 వేల కోట్ల భారీ అవినీతి జరిగిందనీ, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలంటూ మంత్రులను కోరారు.

తప్పుల తడక : పొన్నం

కాళేశ్వరం ప్రాజెక్టు డిజైనంతా తప్పుల తడకని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఎన్ని నీళ్లు ఇచ్చారు?.ఎన్ని ఎకరాలు పారింది?. ఎంత కరెంట్ బిల్లు వచ్చిందంటూ ఆయన అధికారులను ప్రశ్నించారు. ప్రాజెక్టు వల్ల ముంపునకు గురవుతున్న ప్రాంతాల ప్రజలకు నష్టపరిహారం అందించాలని ఈ సందర్భంగా ఆయన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరారు.

వ్యయానికి, సాగుకు భారీ వ్యత్యాసం : శ్రీధర్ బాబు

కాళేశ్వరం ఖరీదైన ప్రాజెక్టని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టు వ్యయానికి, సాగుకు, ఆయకట్టుకు భారీ వ్యత్యాసముందని అన్నారు. ఎకరా భూమిని సాగులోకి తెచ్చేందుకు రూ.46 వేలు ఖర్చవుతుండగా, ఆదాయం మాత్రం అందులో సగం కూడా రావటం లేదన్నారు. ప్రాజెక్టును పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలంటే 14,344 మెగావాట్ల విద్యుత్ అవసరమవుతుందని చెప్పారు. తెలంగాణ ఉత్పత్తి చేసే మొత్తం విద్యుత్తులో 90శాతం ఈ ప్రాజెక్టుకే వినియోగించాల్సి ఉంటుందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

స్టేషన్లలో రైళ్లను ఆపండి

ప్రయాణీకుల సౌకర్యాలు మెరుగుపర్చండి

రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ విజ్ఞప్తి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వివిధ స్టేషన్లలో రైళ్ల స్టాపుల సంఖ్యను పెంచాలని హైదరాబాద్ డివిజన్ 69వ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశం అధికారులకు విజ్ఞప్తి చేసింది. రైలు ప్రయాణీకుల సౌకర్యార్థం గతంలో పలు స్టేషన్లలో ఆగే రైళ్లను కోవిడ్ తర్వాత వేగవంతమైన ప్రయాణం పేరుతో నిలపకుండా తీసుకెళ్తున్నారనీ, దీనివల్ల ప్రయాణీకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. హైదరాబాద్‌లో ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లను తరచూ రద్దు చేయడం వల్ల రైలు ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారనీ, పలుమార్లు ఈ విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావట్లేదని ఆక్షేపించారు. శుక్రవారంనాడిక్కడి హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం హైదరాబాద్ భవన్ నుంచి వర్చువల్ మోడ్‌లో రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశం జరిగింది. దీనికి డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ అధ్యక్షత వహించారు. కమిటీలోని 19 మంది నామినేటెడ్ సభ్యుల్లో 13 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా రైల్వే ప్రయాణీకులకు సంబంధించిన పలు అంశాలను వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వివిధ రైళ్లకు అదనపు స్టాప్‌ల ఏర్పాటు, ప్రయాణీకుల సౌకర్యాలు, లిఫ్టులు, ఎస్కలేటర్ల ఏర్పాటు, రైళ్ల సమయపాలన, స్టేషన్లు, రైళ్లలో పరిశుభ్రత వంటి అంశాలను కమిటీ సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా లోకేష్ విష్ణోయ్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబర్ నెల వరకు డివిజన్ సాధించిన విజయాలను సభ్యులకు వివరించారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్) కింద ఎంపిక చేసిన స్టేషన్‌లలో పనుల పురోగతిని తెలిపారు. ప్రయాణీకుల సౌకర్యాలు, వివిధ ప్రాజెక్టుల అభివృద్ధి గురించి చెప్పారు. కమిటీ సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఆపరేషన్స్) ఎమ్ కోటేశ్వరరావు, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ఎమ్ఏ రెహమాన్, సెక్రటరీ అండ్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వై బాలాజీకిరణ్, సీనియర్ డిఈఎన్ (కో-ఆర్డినేషన్) కే ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్వేతపత్రాలు, న్యాయ విచారణలను స్వాగతిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. రూ.93 వేల కోట్ల వ్యయంతో కట్టిన ప్రాజెక్టులో లక్షల కోట్ల అవినీతి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టు కింద ఒక ఎకరం కూడా పారలేదని ఎన్నికల సమయంలో అసత్యప్రచారం చేశారని విమర్శించారు. ఇప్పుడు వారిచ్చిన నివేదికలోనే 90 వేల ఎకరాల ఆయకట్టు వచ్చిందని చెప్పారన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర తిరిగి ప్రాజెక్టు కడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటున్నారన్నారు. అక్కడ నీటి లభ్యత లేదని గతంలోనే జలవనరుల శాఖ లేఖ రాసిందని గుర్తుచేశారు. 152 మీటర్ల దగ్గర ప్రాజెక్టును ఒప్పుకునేదే లేదని ఆనాటి మహారాష్ట్ర సీఎం పృథ్వీరాజ్ చవాన్ స్పష్టం చేశారని తెలిపారు. ఈపీసీ పద్ధతిలో రూ.6వేల కోట్ల దాకా ఆనాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల కింద కాంట్రాక్టర్లకు చెల్లించారన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత 11 రకాల అనుమతులతోనే కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కట్టించారని తెలిపారు. 140 టీఎంసీల మేర సామర్థ్యమున్న రిజర్వాయర్లు కాళేశ్వరం కింద నిర్మించుకున్నాం గనుకనే వ్యయం పెరిగిందన్నారు. మేడిగడ్డ ఫిల్లర్లు కుంగిపోవడం దురదృష్టకరమన్నారు. న్యాయ విచారణను ప్రభావితం చేసేలా మంత్రుల వ్యాఖ్యలున్నాయని విమర్శించారు. కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వాలని కేసీఆర్ కేంద్రాన్ని అడగలేదని చెప్పడం శుద్ధ అబద్ధమన్నారు. కాళేశ్వరం కింద ఆయకట్టు పెరగకపోతే ఇన్ని కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి ఎలా సాధ్యమైందని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అబద్దాలు మాని అభయహస్తం హామీల గురించి ఆలోచించాలని సూచించారు. కేసీఆర్ ల్యాండ్ క్రూసర్ వాహనాలు ఏమైనా సొంతం కోసం కొన్నారా? ఆ వాహనాల్లో ఇప్పటి సీఎం, మంత్రులు, అధికారులు తిరుగరా? అని ప్రశ్నించారు. సచివాలయంలో లంకెబిందెలుంటాయా? డబ్బులుంటాయా? అని నిలదీశారు.

మత ఉద్రిక్తత సృష్టించేందుకే : ఏచూరి

(మొదటి పేజీ తరువాయి)



జనవరి 22న జరిగే అయోధ్య ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తమ ప్రతినిధులను పంపేది లేదని సీపీఐ(ఎం) ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. గత వారం అయోధ్య ఆలయ నిర్మాణ, నిర్వహణ బాధ్యతలను అప్పగించిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం న్యూఢిల్లీలోని సీపీఐ(ఎం) ప్రధాన కార్యాలయానికి వచ్చినట్టు ఏచూరి తెలిపారు. "నిర్మాణ కమిటీ అధినేత వెంట వీహెచ్‌పీ నేత ఉన్నారు. వారు నాకు ఆహ్వానం ఇచ్చారు. అప్పుడు నన్ను హాజరవుతారా.! అని అడిగారు. నేను లేదని చెప్పాను" అని ఏచూరి అనటంతో సభ చప్పట్లతో మార్మోగింది.ఆలయ ప్రారంభోత్సవాన్ని రాజకీయ ప్రాజెక్టుగా మార్చారని రామమందిరం ట్రస్టు నేతలకు చెప్పినట్టు ఆయన తెలిపారు.రాష్ట్రం ఏదైనా నిర్దిష్ట మతాన్ని ప్రకటించదు, పోషించదు అని ఏచూరి అన్నారు. హిందూత్వ పటిష్టత కోసం మత వర్గాల మధ్య వైషమ్యాలు పెంచే పరిస్థితి ఏర్పడుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏచూరి జియోనిజాన్ని హిందూత్వతో పోల్చారు. "తమ లక్ష్యాన్ని సాధించటానికి జియోనిజం, హిందుత్వ రెండూ చరిత్రను మళ్లీ రాస్తాయి. అవి మన చారిత్రక పరిణామాన్ని నాశనం చేస్తాయి. పాఠ్యపుస్తకాలు మారాయి. కొత్త చరిత్ర కనుగొనబడింది. అది మైనారిటీలపై ద్వేషాన్ని వ్యాప్తి చేయటంపై ఆధారపడింది" అని ఏచూరి చెప్పారు. జియోనిజం, హిందూత్వ మధ్య ఉన్న సైద్ధాంతిక సాన్నిహిత్యం అనేది అక్టోబర్ 7 దాడి తర్వాత ప్రధాని మోడీ ఇజ్రాయెల్‌కు తక్షణ మద్దతును అందించడానికి దారి తీసిందని తెలిపారు. పాలస్తీనా ఆందోళనకు భారత్ సాంప్రదాయిక మద్దతును పునరుద్ధాటించడానికి రెండు వారాల కంటే ఎక్కువ సమయం పట్టిందన్నారు. గత పదేండ్లుగా మోడీ ప్రభుత్వం తన స్వంత హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకెళ్లటానికి అమెరికా, ఇజ్రాయెల్, భారత్ మధ్య బంధాన్ని బలోపేతం చేస్తున్నదని ఆయన అన్నారు.

లోక్‌సభపోరుపై గులాబీ పార్టీ గురి

- జనవరి 3 నుంచి పార్లమెంట్ స్థానాల వారీగా సమావేశాలు
- తెలంగాణ భవన్ వేదికగా ముఖ్యనేతలతో వరుస భేటీలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల పోరుపై గులాబీ పార్టీ గురిపెట్టింది. పార్లమెంట్ ఎన్నికల కోసం సమాయత్తమవుతున్నది. జనవరి మూడో తేదీ నుంచి పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలను నిర్వహించనున్నది. బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ భవన్ వేదికగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, పార్టీ సెక్రటరీ జనరల్ కే కేశవరావు, మాజీ స్పీకర్ మధుసూధనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, నిరంజన్ రెడ్డి తదితర ముఖ్యనాయకులు ఈ సమావేశాలను నిర్వహించనున్నారు. రెండు విడతల్లో ఈ సమావేశాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా జనవరి 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు తెలంగాణ భవన్‌లో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమీక్షలు కొనసాగుతాయి. సంక్రాంతి పండుగ నేపథ్యంలో మధ్యలో మూడురోజుల విరామమిచ్చి, మిగిలిన నియోజకవర్గాల సన్నాహక సమావేశాలను సంక్రాంతి తర్వాత నిర్వహిస్తారు. ఈ సమావేశాలకు ఆయా పార్లమెంట్ స్థానాల పరిధిలోని ముఖ్యనేతలందర్నీ ఆహ్వానించనున్నారు. ఆయా నియోజకవర్గాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, జడ్పీ చైర్మెన్లు, మాజీ చైర్మెన్లు, మేయర్లు, మాజీ మేయర్లు, మున్సిపల్ తాజా, మాజీ చైర్మెన్లు, కార్పొరేషన్ల చైర్మెన్లు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, పార్టీ అధ్యక్షులు మొదలుకొని పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు సమావేశాలకు హాజరుకానున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపైనే అందులో ప్రధానంగా చర్చించబోతున్నారు. మీటింగ్ కు హాజరయ్యే ముఖ్యనేతల అభిప్రాయాలు తీసుకుని పటిష్ట కార్యాచరణను రూపొందించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం స్వల్ప ఓట్ల శాతం తేడాతోనే అనేక సీట్లు చేజారిన నేపథ్యంలో వాటిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా జరగబోతున్న ఈ సమీక్షల అనంతరం ప్రజాక్షేత్రంలో ప్రచారపర్వాన్ని బలంగా నిర్వహించేందుకు కూడా పార్టీ యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

జనవరి 3న ఆదిలాబాద్, నాలుగో తేదీన కరీంనగర్, ఐదో తేదీన చేవెళ్ల, ఆరోతేదీన పెద్దపల్లి, ఏడో తేదీన నిజామాబాద్, తొమ్మిదో తేదీన ఖమ్మం, 10న వరంగల్, 11న మహబూబాబాద్, 12న భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో మూడు రోజుల పాటు సమావేశాలకు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చారు. 16న నల్లగొండ, 17న నాగర్‌కర్నూల్, 18న మహబూబ్‌నగర్, 19న మెదక్, 20న మల్కాజిగిరి, 21న సికింద్రాబాద్, హైదరాబాద్ నియోజకవర్గాల సమావేశాలను నిర్వహించనున్నారు.

మేడిగడ్డ ఓ మేడిపండు..

- అన్నారం సుందిళ్లదీ అదే దారి
- రాష్ట్రానికి మోయలేని భారంగా మారిన వైనం
- కాళేశ్వరం ప్రాజెక్టులో 50 వేల కోట్ల అవినీతి

మేడిగడ్డ నుంచి ఊరగొండ మల్లేశం

కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత ప్రభుత్వం వేల కోట్లను దుర్వినియోగం చేసిందనే అపవాదును మూటగట్టుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తుమ్మడిహట్టి వద్ద చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కమీషన్ల కోసం కేసీఆర్ సర్కార్ పక్కన పెట్టిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 152 మీటర్ల ఎత్తుకు అభ్యంతరం చెప్పిన మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపడంలో గత ప్రభుత్వం విఫలమైందనే వాదనలూ ఉన్నాయి. సొంత ప్రయోజనాల కోసం తానే పెద్ద ఇంజినీర్‌గా అవతారమెత్తి కేసీఆర్ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర ప్రజలకు మోయలేని భారంగా మారిందంటూ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఆ ప్రాజెక్టుకు గుండెకాయ అయిన మేడిగడ్డ బ్యారేజీ కుంగింది. అన్నారం బ్యారేజీకి బుంగలు పడగా, సుందిళ్ల ప్రాజెక్టు భద్రతపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రకంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గోదావరిపై నిర్మించిన మూడు బ్యారేజీల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ప్రాజెక్టు వాస్తవ పరిస్థితిని తెలంగాణ సమాజానికి తెలియజేయాలని కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా శనివారం భూపాలపల్లి జిల్లా మేడిగడ్డను పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు, మీడియా ప్రతినిధుల బృందం సందర్శించింది. ఆ సందర్భంగా పరిశీలనకు వచ్చిన అంశాలు ఎన్నో కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

ప్రాజెక్టు భద్రతపై ఎన్‌డీఎస్‌ఏ ఆందోళన

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నివేదిక ప్రకారం మేడిగడ్డ ప్రాజెక్టును పూర్తిగా తొలగించి మళ్లీ నిర్మించాల్సి ఉంటుంది. అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు సైతం నాణ్యత లోపంతో ఉన్నాయని ఆ నివేదిక పేర్కొంది. ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ మెయింటెనెన్స్ వైఫల్యంతో బ్యారేజ్ కుంగిందని రిపోర్టులో పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ నిర్వహణపై వాస్తవాలను దాచిపెట్టిందని నివేదిక తెలిపింది. ఇన్‌స్ట్రుమెంటేషన్, వర్షాకాలం ముందు, ఆ తర్వాత తనిఖీ రిపోర్టులు, కంప్రెషన్, క్వాలిటీ, థర్డ్ మానిటరింగ్ రిపోర్టులతోపాటు భౌగోళిక సమాచారం అందించలేదని విశదీకరించింది.

'పునరుద్ధరణ'పై చేతులెత్తేసిన సీడీవో

మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ, రీడిజైన్‌పై తెలంగాణ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) చేతులెత్తేసింది. ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ సంస్థ అందుకోలేదనీ, మేడిగడ్డ పునరుద్ధరణ డిజైన్‌ను చేపట్టలేమని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతోగానీ, మరేదైనా ఇతర ప్రతిష్టాత్మక సంస్థతోగానీ డిజైన్ చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీడీవో సూచించింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారంతోపాటు రాష్ట్రంలోని పలు భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల డిజైన్లను రూపకల్పన చేసిన ఈ సంస్థ తాజాగా పునరుద్ధరణ తమతో కాదంటూ తెలపడం వివాదాస్పదంగా మారింది. ప్రాజెక్టుల డిజైన్ తర్వాత మోడల్ స్టడీస్ నిర్వహిస్తారు. దాని పూర్తి ఫలితాలు వచ్చిన తర్వాతే ఏ ప్రాజెక్టు నిర్మాణాన్ని అయినా చేపడతారు.

అయితే మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్ విషయాల్లో అలాంటి నిబంధనలు పాటించలేదని తెలిసింది. గత ప్రభుత్వం ఒత్తిడితో ప్రాజెక్టును తొందరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో మోడల్ స్టడీస్ పూర్తికాకుండానే డిజైన్లను తీసుకుని గుత్తేదారులతో సంబంధిత ఇంజినీర్లు పనులు చేయించారని తెలిసింది. ఫలితంగా నాణ్యత లోపించి బ్యారేజ్ కుంగడానికి కారణమైందని ఎన్‌డీఎస్ఏ నివేదికనిచ్చింది. దీంతో సీడీవో పునరుద్ధరణపై చేతులెత్తేసిందని సమాచారం.



నిర్మాణ బాధ్యత ఎవరిది..?

నాణ్యత లోపంతో ఈ యేడాది అక్టోబరు 23న కుంగిన మేడిగడ్డ బ్యారేజ్ పునర్నిర్మాణం ఇంకా ఓ కొలిక్కి రాలేదు. డిఫెక్ట్ లైయబులిటీ పీరియడ్ అనేది 29.06.2022న పూర్తయింది. అందువల్ల పునర్నిర్మాణ బాధ్యత తమది కాదంటూ ఎల్అండ్‌టి కంపెనీ చేతులెత్తేసింది. ప్రమాదం సంభవించిన ప్రాంతంలో సమాంతరంగా కాపర్ డ్యాం నిర్మాణానికి రూ.55 కోట్లు, పునర్నిర్మాణానికి రూ. 500 కోట్లు ఖర్చు అవుతాయని ఆ సంస్థ తెలిపింది. ఆ డబ్బును చెల్లిస్తే తాము పనులు చేపడతామంటూ తేల్చి చెప్పింది. దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సంబంధిత డీఈలు నిర్మాణ లోపాలపై గత ఏప్రిల్‌లో ఇచ్చిన నివేదికను బీఆర్ఎస్ ప్రభుత్వం తొక్కి పట్టిందనీ, అందువల్ల ఎల్అండ్‌టీ పనులు చేయాల్సిందేనంటూ హుకూం జారీ చేసింది. కాంట్రాక్టర్లు, ప్రభుత్వానికి మధ్య విభేదాలెలా ఉన్నా... రాబోయే జూన్ నాటికి పునరుద్ధరణ పనులు పూర్తి చేయకుంటే నీటి నిల్వ సాధ్యం కాదని నిపుణులు అభిప్రాయపడుతుండటం గమనార్హం.

కంట్రోల్ యూనిట్లు ఎందుకు మునిగాయి..?

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రధాన రిజర్వాయర్లయిన మేడిగడ్డ, అన్నారం కంట్రోల్ యూనిట్లు 2022లో వచ్చిన వరదల్లో మునిగిపోయాయి. ఫలితంగా ప్రాజెక్టు నిర్వహణపై తీవ్ర ప్రభావం పడడంతోపాటు ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. మేడిగడ్డ ప్రాజెక్టు కంట్రోల్ యూనిట్‌ను 126 మీటర్ల ఎత్తులో ఏర్పాటు చేయాలంటూ డిజైన్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వ 120 మీటర్ల ఎత్తులోనే ఏర్పాటు చేయటం గమనార్హం. అలాగే అన్నారం ప్రాజెక్టు కంట్రోల్ యూనిట్‌ను 131 మీటర్ల ఎత్తులో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను తోసిరాజని 125 మీటర్లలోనే దాన్ని ఏర్పాటు చేశారు. ఫలితంగా 2022లో కురిసిన భారీ వర్షాల వల్ల ప్రవాహం ఎక్కువై రెండు ప్రాజెక్టుల కంట్రోల్ యూనిట్లు నీట మునిగాయి. కాంట్రాక్టర్లకు లబ్ది చేకూర్చేందుకే గత బీఆర్ఎస్ సర్కార్ ఇలాంటి నిర్ణయాలు తీసుకుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మనుష్యుల్ని చూడండి! ఓటర్లను కాదు..

సంపాదకీయం

"ప్రజాపాలన"కు విశేష స్పందన లభిస్తోంది. తొలి రోజే 7,46,414 అర్జీలు రావడం ఆరు గ్యారెంటీల కోసం ప్రజలు ఎంత ఆశగా ఎదురుచూస్తున్నారో తెలియజేస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్ గెలుపులో ఈ వాగ్దానం ఎంతటి కీలకపాత్ర పోషించిందో కూడా రుజువు చేస్తోంది. ఎన్నికలనగానే రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలు ప్రకటించడం, వాటిలో అనేక హామీలివ్వడం సాధారణం. కానీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడమే ప్రజాతీర్పుకు నిజమైన గౌరవం. ఇది ఎన్నికైన కొత్త ప్రభుత్వం గుర్తించాలి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి తొలి సంతకాన్ని ఆరు గ్యారంటీల హామీపైనే చేయడం ఈ దిశగా వేసిన మొదటి అడుగని చెప్పుకోవచ్చు. తద్వారా ఆయన ఆరు గ్యారెంటీలే కాదు, వాటి అమలు కూడా గ్యారెంటీ అనే నమ్మకాన్ని ప్రజలకిచ్చారు. అంతేకాదు ఇచ్చిన హామీల్లో రెండు వచ్చిన వారంలోపే అమలు చేయడం ఈ నమ్మకాన్ని రెట్టింపు చేసింది.

> ఇప్పుడు ఈ హామీల అమలే ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు. ఎందుకంటే... ఒకవైపు ప్రజలు హామీల అమలు పట్ల ఆశగా, ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఇప్పుడిప్పుడే ఓటమిని అతికష్టంగా జీర్ణించుకుంటున్న విపక్షం అప్పుడే అధికారపక్షం ప్రజల విశ్వాసాన్ని కోల్పోవాలని ఆత్రుత పడుతోంది. ఆరు నెలల పాటు వేచి చూస్తా మన్న వాళ్లు, ప్రభుత్వం పడిపోవడం గురించి, వాగ్దానాలను నెరవేర్చకపోవడం గురించి తీవ్రంగానే మాట్లాడడం మొదలుపెట్టారు. ప్రభుత్వం ఇది గుర్తెరిగి నడుచుకోవాలి.

మరి ఈ నమ్మకాన్ని కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందా? అన్న అనుమానాలు కొన్ని అక్కడక్కడా లేకపోలేదు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వరుస సమీక్షలు, వెల్లడించిన శ్వేతపత్రాల నేపథ్యంలో... ఒక వైపు వెక్కిరిస్తున్న ఖాళీ ఖజానా, మరో వైపు హెచ్చరిస్తున్న అప్పుల భారాల మధ్య వీటి ఆచరణ సాధ్యమేనా? అన్న ఈ సందేహాలు మరికొంత బలపడ్డాయి. అసలీ ఆరు గ్యారెంటీలను అటకెక్కించడానికే ఈ సమీక్షలూ శ్వేతపత్రాలనే విపక్షాల విమర్శల సంగతి చెప్పక్కర్లేదు. అయితే... ఇదంతా ప్రజలకు నిజాలు తెలియాలనే తప్ప, ఇచ్చిన హామీల నుండి తప్పుకునే ఉద్దేశ్యం తమకు లేదనీ, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా హామీలు అమలు చేసి తీరుతామని ప్రభుత్వ పెద్దలు చెప్పడం, అందుకు తగ్గట్టుగానే "ప్రజాపాలన" ద్వారా ఆచరణకు పూనుకోవడం అభినందనీయం.



ఇదిలా ఉండగా, ఉచితాలన్నీ అనుచితమైనవేననీ, ఆర్థిక వ్యవస్థకు పెనుభారమనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ వాదనలేమీ కొత్తవి కాదుగానీ ఈ సందర్భంగా మరో సారి చర్చకొస్తున్నాయి. ఓట్ల కోసం ఒకవైపు పథకాల మీద పథకాలనేకం ప్రకటిస్తూనే మరో వైపు వీటిపై ఉచితాలంటూ అనుచిత వ్యాఖ్యలు చేసే "మహానుభావులు" మనకు కేంద్ర ప్రభుత్వంలోనే కావాల్సినంత మంది ఉండగా ఇలాంటి చర్చలేమీ ఆశ్చర్యం కలిగించవు. కానీ, పేదలకిచ్చే సంక్షేమ పథకాలను ఉచితాలుగా హేళన చేసే మన కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఈ పదేండ్లలో కార్పొరేట్ గద్దలకు రద్దు చేసిన బాకీలు అక్షరాల పద్నాలుగు లక్షల యాభయ్యారువేల కోట్లు. అంతేనా ఇచ్చిన రాయితీలు, అప్పనంగా అప్పగిస్తున్న ఆస్తులు అంతకు రెట్టింపు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అభివృద్ధి పేరుతో బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్న భూములు, ఇస్తున్న సబ్సిడీలు, కల్పిస్తున్న సదుపాయాలు తక్కువేమీ కావు? విచిత్రమేమిటంటే పై వాదనలు చేసే పెద్దమనుషులెవ్వరూ వీటి గురించి మాట్లాడరు. ఇవి ఆర్థిక వ్యవస్థకు భారమని గుర్తించరు. కానీ ప్రజలకిచ్చే ఈ కాస్త సంక్షేమాన్ని మాత్రం ఉచితాలంటూ తక్కువ చేసి మాట్లాడుతారు!!

నిజానికి కేవలం సంక్షేమ పథకాలే సమస్యలకు పరిష్కారం కాదుగానీ, ఈ అసమానతల సమాజంలో ప్రజలకు అవి అతిపెద్ద ఊరట. అందువల్ల ఏ ప్రభుత్వానికైనా ప్రజల సంక్షేమమే మొదటి ప్రాధాన్యత కావాలి. ఈ ప్రాధాన్యతను గుర్తించడం, పథకాలకు రూపకల్పన చేయడమే కాదు, వాటి ఆచరణకు, వనరుల సమీకరణకు సహేతుకమైన ప్రణాళికలు ఉండాలి. మన ప్రభుత్వాల ఆదాయ వ్యయాల్లో సమతూకం, అవినీతి అనవసర ఖర్చులపై నియంత్రణ, సంపద సృష్టికీ పంపిణీకీ తగిన ప్రజానుకూల విధానాలను అవలంబిస్తే ఇది కష్టమేమీకాదు. కానీ ఇదే భారమని భావిస్తే ఇక ఆ ప్రభుత్వాలు ఎందుకు? ప్రజా ప్రయోజనమే ప్రభుత్వాల ఏకైక లక్ష్యమై ఉండాలి. అదే సమయంలో ఏ పథకానికైనా అర్హులైన ప్రజలే లబ్దిదారులుగా ఉండాలి. ఏది ఎవరికి అవసరమో వారికే అందాలి. దురదృష్టవశాత్తు మన ఏలికల్లో ఈ దృష్టే కొరవడుతోంది! ఎందుకంటే వారు ప్రజల్లో కేవలం ఓటర్లనే తప్ప మనుషుల్ని చూడలేకపోతున్నారు! ఫలితంగా సంక్షేమం దుర్వినియోగం అవుతుంది. కొత్త ప్రభుత్వం ఇందుకు మినహాయింపు కావాలి.

ఇప్పుడు ఈ హామీల అమలే ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు. ఎందుకంటే... ఒకవైపు ప్రజలు హామీల అమలు పట్ల ఆశగా, ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఇప్పుడిప్పుడే ఓటమిని అతికష్టంగా జీర్ణించుకుంటున్న విపక్షం అప్పుడే అధికారపక్షం ప్రజల విశ్వాసాన్ని కోల్పోవాలని ఆత్రుత పడుతోంది. ఆరు నెలల పాటు వేచి చూస్తామన్న వాళ్లు, ప్రభుత్వం పడిపోవడం గురించి, వాగ్దానాలను నెరవేర్చకపోవడం గురించి తీవ్రంగానే మాట్లాడడం మొదలుపెట్టారు. ప్రభుత్వం ఇది గుర్తెరిగి నడుచుకోవాలి. ప్రస్తుతానికైతే ఇది గుర్తించిన సూచనలే కనిపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే పాత ప్రభుత్వం చర్యలను, వాటి ఫలితాలను సమీక్షించడం మొదలు పెట్టిన కొత్త ప్రభుత్వం... తన హామీలు, ఆలోచనల అమలుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఇది హర్షించదగినదేగానీ... ఆరంభ శూరత్వంగా మిగిలిపోకూడదని ఆశిద్దాం.

లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ జిమ్మిక్కులు

లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ చేస్తున్న విన్యాసంలో భాగంగా అయోధ్యలో జనవరి 22న ఆకాశమంత పందిరి వేసి భూదేవి అంత అరుగు వేసి అన్నంత ఆర్భాటంగా శ్రీరామ మూర్తికి "ప్రాణ ప్రతిష్ట" జరగనుంది. ఆ కార్యక్రమానికి తాము వెళ్లడం లేదని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి ప్రకటించారు. మతం వ్యక్తిగతం. మత కార్యక్రమాలకు ప్రభుత్వం దూరంగా ఉండాలని ఆయన చెప్పారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా మతాన్ని ప్రభుత్వాన్ని కలగాపులగం చేయడాన్ని వ్యతిరేకించారు.ప్రతి ఎన్నికలకు ముందు బీజేపీ మతం కార్డును ప్రయోగిస్తోందన్నారు ఆమె. నిర్దిష్టంగా చెప్పకపోయినా, ప్రకటన ఆమె వెళ్లడం లేదనే ధ్వనిస్తోంది. ఆహ్వానం అందుకొన్న మిగతా పార్టీలు, వాటి నాయకులు ఏమి చేస్తారో చూడాలి. ఈ సందర్భంగా ఒక విషయం గుర్తు చేసుకోవడం అవసరం. గుజరాత్‌లోని సోమనాథ్ మందిరం మరమ్మతుల తర్వాత తిరిగి ప్రారంభించే కార్యక్రమానికి తాను అధికార హోదాలో వెళ్లాలని అప్పటి రాష్ట్రపతి డా.రాజేంద్ర ప్రసాద్ భావించారు. కాని అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆయన కోరికను నిరాకరించారు. ఒక మతానికి చెందిన కార్యక్రమంలో అధికారికంగా రాష్ట్రపతి వెళ్లడం కుదరదని స్పష్టం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ఏమి చేయనుందో? రాజ్యాంగం బోధించే లౌకిక విలువలను తన రాజకీయాల కోసం ధ్వంసం చేస్తున్న ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం "ప్రాణ ప్రతిష్ట" కార్యక్రమానికి అట్టహాసంగా బయలుదేరనున్నారు. ఆయనతోపాటు ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ కూడా ఆ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.



ఎస్. వినయ కుమార్
9989718311

> విదేశీ విరాళాల కోసం కూడా కేంద్ర ప్రభుత్వం అయోధ్య ట్రస్టును విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్ఎ) కింద రిజిస్టర్ చేసింది. అయితే దాని బ్యాంక్ అకౌంట్ ఢిల్లీలో ఉంది కనుక అందులో ఎంత డబ్బు పడిందో తమకు ఇంకా తెలియదని ట్రస్టు ప్రతినిధి అయోధ్యలో చెప్పారు. 2021 జనవరి 15నుండి 44 రోజుల పాటు దేశమంతటా విరాళాల సేకరణ కోసం శ్రీరామ జన్మభూమి రామ మందిర నిధి సమర్పణ్ అభియాన్‌ను ప్రారంభించారు. రామమందిర నిర్మాణానికి రూ.18వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా. అవి కాకుండా లెక్కకురాని ఖర్చులు కూడా ఉంటాయి.

మతపరంగా భారతీయులను విభజించి పాలించడానికి బ్రిటిష్ పాలకులు రగిల్చిన మత విద్వేషాల మంట ఇంకా మండుతూనే ఉంది. ఎంతోమంది భారతీయులు ఆ మంటకు బలయ్యారు. అవుతూనే ఉన్నారు. అయినా ఆ మంట ఆరిపోకుండా మతతత్వ రాజకీయ పార్టీలు, సంస్థలు ఎగదోస్తూనే ఉన్నాయి. ముస్లింలపై, క్రైస్తవులపై లౌకిక ప్రజాస్వామ్య వాదులపై దాడులు జరుగుతున్నాయి. అవి భౌతిక దాడులు కావచ్చు. లేదా డీప్ ఫేక్ దాడులూ గావచ్చు. ముస్లిం మతోన్మాద పార్టీలుసంస్థలు అదే పని చేస్తున్నాయి.

ప్రధానితో పాటు పదివేల మంది ప్రముఖులు 'ప్రాణ ప్రతిష్ట'లో పాల్గొనున్నట్లు అయోధ్య ట్రస్టు వెల్లడించింది. వారితో పాటు ప్రభుత్వ సిబ్బంది కోసం అయోధ్య పట్టణంలోని హోటళ్ల రూములను, సత్రాలను బుక్ చేస్తున్నారు ఇప్పటికే చేసుకొన్న బుకింగ్‌లను యూపీ ప్రభుత్వం రద్దు చేసింది. జనవరి 22న ట్రస్టు నుండి ఆహ్వానం అందుకొన్న వారు, విధులు నిర్వహణకు నియమించిన ప్రభుత్వ సిబ్బందిని మాత్రమే అయోధ్య పట్టణంలోకి అనుమతి స్తారు. వారు తమ ఆహ్వాన పత్రాలను, అధికారిక ఉత్తర్వు లను చూపెట్టాలి. అయోధ్యలో కొత్తగా ప్రారంభమైన విమానాశ్రయంలోకి దేశం నలుమూలల నుండి వంద విమానాలు ఆ రోజు వాలుతాయట. ఈ నెల చివరి నాటి కల్లా అయోధ్య విమానాశ్రం మొదటి దశ సిద్ధమవుతుంది. డిసెంబర్ 30న ప్రధాని మోడీ ఢిల్లీ అయోధ్యల మధ్య నడిచే మొదటి విమానాన్ని ప్రారంభిస్తారు. జనవరి 16 నుండి ఎయిర్ ఇండియా జనవరి 6 నుండి ఇండిగో అయోధ్యకు తమ విమాన సర్వీసులను ప్రారంభిస్తాయి. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో మొదటి దశపైనే కేంద్రం రూ.1,450 కోట్లు ఖర్చు చేసింది.

డిసెంబర్ 30నే ఆధునీకరించిన అయోధ్య రైల్వే స్టేషన్‌నూ ప్రధాని ప్రారంభిస్తారు. అలాగే అమృత్ భారత్ సూపర్ పాస్టు ఎక్స్‌ప్రెస్‌కు, మరో రెండు రైళ్లకు పచ్చ జెండా ఊపుతారు. పట్టణంలో మరో 11వేల కోట్లతో చేపట్టే పనులనూ ఆయనే ప్రారంభిస్తారు. అనంతరం అయోధ్యలో నిర్వహిస్తున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ప్రారంభాలు, ప్రసంగాల్లో బీజేపీ రాజకీయాల మార్కెటింగ్ హెడ్ మోదీదే అసలు పాత్ర. దేశ వ్యాప్తంగా ఐదు లక్షల గ్రామాల్లో జనవరి 1 నుండి 15వ తేదీ వరకు తాత్కాలిక రామ విగ్రహం ముందు ఉంచి పూజించిన అక్షింతలను పంచుతారట. మందిర నిర్మాణానికి 2020 ఫిబ్రవరి నుండి 2023 మార్చి 31 వరకు రూ.90 కోట్లు ఖర్చుచేసినట్లు, అవిపోగా మరో 3 వేల కోట్లు తమ దగ్గర నిలువ ఉన్నట్లు ట్రస్టు వెల్లడించింది. రామమందిర నిర్మాణంలో ఇది రెండో దశ మాత్రమే. మందిర నిర్మాణం 2025 జనవరి నాటికల్లా పూర్తవుతుందట. నిర్మాణం పూర్తి కాకుండానే ఇంత తొందరెందుకంటే రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం అన్నది స్పష్టం.

తాత్కాలిక గుడిలో భక్తులు సమర్పించుకొంటున్న కానుకలు రోజురోజుకి పెరిగిపోతూనే ఉన్నాయి. సెప్టెంబర్ నెలలో అక్కడి దానపాత్ర(హుండీ) ఆదాయం రూ.60 లక్షలు కాగా అక్టోబర్‌లో రూ.64 లక్షలు. ఆ రాబడి నెలకు కోటి రూపాయల వరకు పెరగొచ్చని ట్రస్టు అంచనా. మొదట్లో నెలకు రూ.10లక్షలు రూ.15 లక్షలు మాత్రమే హుండీ ఆదాయం ఉండేది. విదేశీ విరాళాల కోసం కూడా కేంద్ర ప్రభుత్వం అయోధ్య ట్రస్టును విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్ఎ) కింద రిజిస్టర్ చేసింది. అయితే దాని బ్యాంక్ అకౌంట్ ఢిల్లీలో ఉంది కనుక అందులో ఎంత డబ్బు పడిందో తమకు ఇంకా తెలియదని ట్రస్టు ప్రతినిధి అయోధ్యలో చెప్పారు. 2021 జనవరి 15నుండి 44 రోజుల పాటు దేశమంతటా విరాళాల సేకరణ కోసం శ్రీరామ జన్మభూమి రామ మందిర నిధి సమర్పణ్ అభియాన్‌ను ప్రారంభించారు. రామమందిర నిర్మాణానికి రూ.18 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా. అవి కాకుండా లెక్కకురాని ఖర్చులు కూడా ఉంటాయి. ఈ ఏడాది ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మందిర నిర్మాణానికి రూ.500 కోట్లు బడ్జెట్ నుండి కేటాయించింది. అయోధ్య పర్యాటక స్థలంగా మారనుంది.కనుక మరో రూ.95 కోట్లు తులసి స్మారక భవనం పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం కేటాయించింది.

తామొకటి తలిస్తే దైవమొక్కటి తలిచాడు అన్నట్లు అయోధ్య పట్టణంలో చిన్న వ్యాపారులు ఒకటనుకొంటే మోడీ, యోగీలు మరొకటి చేస్తున్నారు. 1980లో భారతీయ జనతా పార్టీ ప్రారంభమైన నాటినుండి అక్కడి వ్యాపారులు బీజేపీ మద్దతుదార్లు. అయోధ్యలో రామమందిరం నిర్మించాలని పట్టుదలతో ఉన్నారు. బాబ్రీ మసీదు విధ్వంసంలో కరసేవకులకు సహకరించారు కూడా. 2020 ఆగస్టు 5న మోడీ మందిర నిర్మాణానికి పునాదిరాయి వేయడంతో వారు ఉప్పొంగిపోయారు. కాని ఆ రాయి తమకే వచ్చి బలంగా తగులుతుందని ఊహించలేని అమాయకులు. వారణాసిలో రోడ్లు వెడల్పు చేసి "కాశీ విశ్వనాధ్ కారిడార్" ను నిర్మించిన తరహాలో అయోధ్య పట్టణంలోనూ రోడ్లు వెడల్పు చేస్తున్నారు. పట్టణంలో 13 కి.మీల ట్రంకు రోడ్డు నిర్మాణానికి "రూ.797.68కోట్లు యూపీ ప్రభుత్వం కేటాయించింది. ఈ పనిని రెండేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించింది. రోడ్డు వెడల్పు చిన్న వ్యాపారుల నోటికాడి ముద్దను లాగేసుకొంది. పట్టణంలో బుల్‌డోజర్ల రొద నిర్విరామంగా వినిపిస్తోంది. ఆ రొద విన్పిస్తే చాలు చిన్న వ్యాపారుల పైప్రాణాలు పైనే పోతున్నాయి. అంగళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని యోగి ఏడాది క్రితం ప్రకటించారు. కాని ఆ న్యాయం దరిదాపుల్లో కన్పించడం లేదు. రాజ్‌కుమార్ సైని అనే అతను 30ఏళ్లుగా హనుమాన్ గృహ గుడి ముందు చిన్న అంగడిలో పూలు అమ్మేవాడు. రోడ్డు వెడల్పులో ఆ షాపును కూల్చేశారు. ఇప్పుడు రోడ్డుమీద సైని పూలు అమ్ముతున్నాడు. అతని రోజువారి ఆదాయం దాదాపు మూడింట ఒక వంతుకు పడిపోయింది. కుటుంబం కష్టాల పాలైంది.

> అయోధ్యలో నిర్వహిస్తున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ప్రారంభాలు, ప్రసంగాల్లో బీజేపీ రాజకీయాల మార్కెటింగ్ హెడ్ మోదీదే అసలు పాత్ర. దేశ వ్యాప్తంగా ఐదు లక్షల గ్రామాల్లో జనవరి 1నుండి 15వ తేదీ వరకు తాత్కాలిక రామ విగ్రహం ముందు ఉంచి పూజించిన అక్షింతలను పంచుతారట. మందిర నిర్మాణానికి 2020 ఫిబ్రవరి నుండి 2023 మార్చి 31 వరకు రూ.90 కోట్లు ఖర్చుచేసినట్లు, అవిపోగా మరో 3వేల కోట్లు తమ దగ్గర నిలువ ఉన్నట్లు ట్రస్టు వెల్లడించింది. రామమందిర నిర్మాణంలో ఇది రెండో దశ మాత్రమే. మందిర నిర్మాణం 2025 జనవరి నాటికల్లా పూర్తవుతుందట. నిర్మాణం పూర్తి కాకుండానే ఇంత తొందరెందుకంటే రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం అన్నది స్పష్టం.

రోడ్డు వెడల్పులో బ్రిజ్ కిషోర్ పాండే అంగడి, ఇల్లూ రెండూ పోయాయి. ప్రభుత్వం తమ దుస్థితిని గమనిస్తోందో లేదో అర్థం కావడంలేదని పాండే చెప్పారు. మూడు తరాలుగా మేము మా అంగడిలో పూజా సామగ్రి అమ్మేవారం. మోడీజీకి, యోగీజీకి మద్దతు ఇస్తూ వచ్చాం. కాని బుల్‌డోజర్ నా ఇంటి ముందుకే యోగి వస్తుందని నేను ఎప్పుడూ ఊహించలేదని వాపోయాడు. అంగడిని, ఇంటిని కూల్చి రెండు నెలలయింది. ప్రభుత్వం నుండి అందిన నష్ట పరిహారం లక్ష రూపాయలు మాత్రమే. ప్రధానమంత్రి ముద్రయోజన కింద వ్యాపారం కోసం నాలుగేళ్ల క్రితం అతను అప్పు తీసుకొన్నాడు. ప్రతి నెలా వాయిదా డబ్బు కడుతున్నాడు. అప్పు ఇంకా ఉంది. అది ఎలా తీర్చాలని బ్రిజ్ బేలగా ప్రశ్నించారు. మా సమస్యల్ని ప్రభుత్వం ఎలా పరిష్కరించనుందో అర్థం కావడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మీకాంత్ తివారి తన షాపులో మత సంబంధమైన పుస్తకాలు అమ్మేవాడు. విస్తరణలో అతని అంగడిలో కొద్ది భాగమే మిగిలింది. ఇప్పుడు పుస్తకాల వ్యాపారం మానేసి పొగాకు వ్యాపారం చేస్తున్నాడు. ప్రతిరోజు రూ. వేయి నుండి రూ.1500 వరకు అతనికి ఆదాయం ఉండేది. ఇప్పుడు ఆ ఆదాయం పోయింది. ఇలాగే ఉంటే మేము భిక్షమెత్తుకొని బతకాల్సిందేనని ఆయన అన్నారు. గతంలో వ్యాపారులు షాపు యజమానుల 25 శాతం అద్దె పెంపుతో ఐదేళ్లకు ఒప్పందం తిరిగి రాసుకొనే వారు. ఇప్పుడు ఐదేళ్లకు బదులు 11 నెలల లీజు ఒప్పందమే చేసుకొంటామని షాపు యజమానులు భీష్మించారు. అంటే ప్రతి 11 నెలలకు అద్దె పెంచుతారన్న మాట. తమ షరతులపై ఒప్పందం పునరుద్ధరించుకోని వారిపై ట్రెస్ పాసర్ కింద వివిధ సెక్షన్లు మోపి కేసులు పెడ్తున్నారు. ముప్పయి నలభై ఏళ్ల క్రితం తమ పేరుపై అంగడిని లీజుకు తీసుకొన్న వృద్ధ తరం నేడు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

బ్రిటిష్ కాలంలోనే బాబ్రీ మసీదుపై వివాదాలు మొదల య్యాయి. 1853లో నిర్మోహీ అనే హిందూతెగ బాబర్ గుడిని కూల్చి మసీదు నిర్మించాడని వాదించింది. ఆ సమయంలో మొదటిసారిగా అక్కడ మత ఘర్షణలు జరిగాయి. ఆ తర్వాత ఆరేళ్లకు బాబ్రీ మసీదును దాని ప్రాంగణాన్ని బ్రిటిష్ పాలకులు రెండుగా చేసి మసీదు ఉన్న భాగాన్ని ముస్లింల ప్రార్థనకు, వెలుపలి భాగాన్ని హిందు వులకు అప్పగించారు. 1990లో బీజేపీ నాయకుడు ఎల్‌కె అద్వానీ రామమందిరంపై దేశవ్యాప్త రథయాత్ర చేశారు. ఆ తర్వాత లోక్ సభలో బీజేపి బలం రెండు స్థానాల నుండి 80 స్థానాలకు పైగా పెరిగింది. మతాన్ని రాజకీయాల్ని జోడించి ఆనాడు బీజేపీ రాజ కీయ ప్రయోజనం పొందింది. ఇప్పుడు ఏకంగా కేంద్ర ప్రభుత్వాన్ని యూపీ ప్రభుత్వం మతంతో జోడించి లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలని చూస్తుంది. జనవరి 22న అర్చకుల మంత్రోచ్చారణల మధ్య మోడీ, భగవత్‌ల సమక్షంలో శ్రీరాముడి మూర్తికి ప్రాణ ప్రతిష్ఠ చేస్తారు. దాంతో రాతి విగ్రహానికి చేతనత్వం కలుగుతుంది. దేవుడు భక్తుల మొక్కులు తీర్చడం మొదలెడ్తాడు. మొక్కు లేని భక్తి లేదు కనుక హుండీలు నిండుతుంటాయి. అనతి కాలంలోనే భక్తులు అయోధ్య శ్రీరాముడిని కుబేరుడిని చేస్తారు. ఢిల్లీలో ప్రధాని లోక్‌సభ ఎన్నికల లోగా అదానీ, అంబానీలను మోడీమరింత అపర కుబేరుల్ని చేస్తారు. అదీ సంగతి. ■

లోగుట్టు - కనికట్టు



అక్కడొక పచ్చని పొలం
ఎప్పుడూ నవ్వుతూ కనిపించేది
నల్లటి తాచుపామొకటి
దారిలా మారి అమాంతం మింగేసింది

ఇక్కడొక గుట్ట
గంభీరంగా తల ఎత్తుకుని
చూస్తూ కూర్చుని వుండేది
రంగుల మేడొకటి
దాన్ని నిలువునా కబలించేసి
మెడ విరిచి మూలన కూర్చోబెట్టింది

అంతా లోగుట్టు పనితనం
ఎన్నడూ ఎరుగని
కనికట్టు వ్యవహారం

అదిగదిగో అక్కడొక చెట్టు
నిటారుగా నిలబడి
తన కొమ్మల కరచాలనంతో
మనిషిని ఎప్పుడూ పలకరిస్తుండేది
రియల్ రంగమొకటి
రంపంలా మారి కోసి పడేసింది
ఇప్పుడక్కడ
గీతలు గీసిన రంగు రాళ్ళు
పగలబడి నవ్వుతూ కూర్చున్నాయి

ఇదిగో ఇక్కడొక వరి చేను
పచ్చని మెరుపుల్ని పులుముకుని
కళ్లను మురిపిస్తుండేది
పొగ గొట్టాల కారా?నమొకటి
పచ్చదనంపై నలుపుని చల్లేసి
ఇనుప కమ్మీలను పరిచేసింది

అంతటా లోగుట్టు పనితనం
కనికట్టు కల్లోలం

మింగుడు పడని మనసు
మింగడమెలాగో నేర్చుకున్నాక
లెక్కల్లో కూడికలకై వెంపర్లాడుతోంది
పాలన సంగతి
పాపులకే తెలుసన్నట్టు
కాలం గుర్రంపై స్వారీ చేస్తోంది

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

పాలస్తీనా ప్రతిఘటనకు ప్రజాదరణ

2023 అక్టోబరు 7న హమాస్ ఇజ్రాయిల్‌పై దాడి చేసిన తరువాత గాజాపై ఇజ్రాయిల్ ప్రతీకార బాంబు దాడులతో యుద్ధం మరింత వికృతరూపం ధరించింది. ఆసుపత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని కార్పెట్ బాంబుదాడులను సాగిస్తోంది. కొరియా, వియత్నాం యుద్ధాలలో ఒక్క అంగుళం కూడా వదలకుండా కార్పెట్ బాంబు దాడులను చేసి అమెరికా మారణహోమాన్ని సృష్టించింది. అదే చరిత్రను పునరావృతం చేస్తూ, ఇజ్రాయిల్ సైన్యం నాన్‌స్టాప్ బాంబు దాడులు చేస్తూ, గాజాలో ఇండ్లను భూమట్టం చేస్తూ శ్మశానానందాన్ని పొందుతుంది. తనపై దాడి చేసిన హమాస్ వారిని పట్టుకోలేక, 21 వేలమందికి పైగా సామాన్య అమాయక ప్రజలను హతమార్చింది. ఇందులో 70 శాతం మంది చిన్న పిల్లలు, మహిళలతో పాటుగా జర్నలిస్టులు, డాక్టర్లు కూడా వున్నారు. తీవ్ర అననుకూల పరిస్థితులలో వార్తలను సేకరిస్తూ, సంఘర్షణలను, బాంబుదాడులను చిత్రీకరిస్తూ 90 మంది జర్నలిస్టులు తమ ప్రాణాలనర్పించారు. హ్యూమన్ రైట్స్ వాచ్ గత వారం ఇజ్రాయిల్ ప్రభుత్వం యుద్ధ నేరానికి పాల్పడిందని ఆరోపించింది. ప్రజలకు ఆహారం, నీరు అందకుండా కృత్రిమ కరువును సృష్టించి ప్రజల ప్రాణాలను తీస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూని ఈ నాటి హిట్లర్ అని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ అన్నారు. అంతేకాకుండా 'గాజాపై ఈ పిచ్చి దాడులను ఆపేయాలి. ఇజ్రాయిల్ వెంటనే ఈ మాడ్నెస్‌ని, దాడులను ఆపాలి.' అన్నారు. పాలస్తీనా ప్రజలకు అండగా తామున్నామంటూ, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజా ప్రదర్శను ఇస్తాంబుల్ పట్టణంలో నిర్వహించారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీమ్, మలేసియా ఒక స్వతంత్ర సార్వభౌమ దేశమని, అమెరికా ఒత్తిడులకు లొంగమన్నారు. తమ హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న పాలస్తీనియన్లకు పూర్తి సహకారమంది స్తామని పెద్ద ప్రజా ప్రదర్శనను నిర్వహించారు. కొలంబియా అధ్యక్షుడు పెట్రో. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోస్, అమెరికా, జర్మనీ, బ్రిటన్, ప్రపంచ ప్రజలు గాజా ప్రజలకు అండగా వుంటామన్నారు.

- డాక్టర్ కొల్లా రాజమోహన్

మానవ కల్పిత కరువు

గాజాలోని పాలస్తీనియన్లకు అవసరమయిన ఆహారంలో కేవలం పది శాతం మాత్రమే అందుతున్నదని ఐక్యరాజ్య సమితి వెల్లడించింది. UN ఏజెన్సీలు, NGOలు, సహాయసంస్థల భాగస్వామ్యం అయిన ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ ప్రచురించిన ఒక నివేదికలో, గాజాలో ఉన్న కుటుంబాలు, ఆకలి సంక్షోభంలో తీవ్రమైన ఆహార అభద్రతతో బాధపడుతున్నట్లు పేర్కొంది. గాజాలోని మొత్తం 23 లక్షల జనాభా అతిపెద్ద మానవ కల్పిత కరువు ప్రమాదాన్ని ఎదుర్కొంటోందని హెచ్చరించింది. తక్షణ కాల్పుల విరమణ కోసం ఐ.రా.స పిలుపునిచ్చేందుకు వీల్లేదని అమెరికా వీటోని ప్రయోగించి తన సామ్రాజ్యవాద స్వభావాన్ని మరోసారి నిరూపించుకున్నది. గాజాలో మానవతావాద పరిస్థితి మరింత భయంకరంగా మారడంతో ఇజ్రాయిల్ సైనిక చర్య సమర్థించలేనిదిగా మారడంతో, టెల్ అవీవ్ బలమైన మద్దతుదారు అయిన యునైటెడ్ స్టేట్స్, జర్మనీ, బ్రిటన్‌లలో కూడా ప్రజలు తిరగబడుతున్నారు. ప్రభుత్వాలు ఇరుకున పడుతున్నాయి.ఎర్ర సముద్రంలోని "ఇజ్రాయెల్-లింక్డ్" నౌకలపై యెమెన్ హౌతీ మిలీషియా వారి దాడులను తీవ్రతరం చేయడంతో వివాదం మధ్యప్రాచ్యంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తోంది. ఇజ్రాయిల్-పాలస్తీనాకు పరిమితమయిన యుద్ధభూమి సముద్రానికి మారింది.

పాలస్తీనాకు మద్దతిస్తున్న హౌతీ రెబెల్స్ ఎర్రసముద్రాన్ని (రెడ్‌సీ) యుద్ధ క్షేత్రంగా మార్చుకుని ఇజ్రాయిల్‌తో సంబంధమున్న దేశాల నౌకలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులను చేస్తున్నారు. ప్రపంచ వాణిజ్య రంగంలో ముఖ్యమైన నౌకా రవాణా రంగంలో అత్యంత కీలకమైన మార్గం ఎర్రసముద్ర నౌకా మార్గం. ఈ మార్గం ద్వారానే అమెరికా, ఐరోపా దేశాలు ఆసియా, ఆఫ్రికా దేశాలతో వ్యాపారం చేసి లాభాలను ఆర్జిస్తున్నాయి. ఆఫ్రికా చుట్టూ తిరిగిరాకుండా ఈజిప్ట్‌లోని సూయజ్ కాలువ-ఎర్రసముద్రం మీదుగా అంతర్జాతీయ వాణిజ్యం సాగుతోంది. బాబ్ ఎల్ మండెప్ జలసంధి వద్ద మార్గం చాలా సన్నగా 29 కి.మీ. మాత్రమే వుండటం వలన సముద్ర నౌకలపై దాడులకు అనువుగా వుంది. దగ్గరలో వున్న ఎమెన్‌ను స్థావరంగా చేసుకుని హౌతీ రెబెల్స్ వాణిజ్య నౌకలపై దాడుల ద్వారా, అంతర్జాతీయ వాణిజ్య సమాజాన్ని గాజాలో మారణహోమాన్ని ఆపమని కోరుతున్నారు. ఇజ్రాయిల్, అమెరికా యూరప్‌లను హడలెత్తిస్తున్నారు. మొత్తం అంతర్జాతీయ సమాజానికి అల్టిమేటం ఇస్తున్నారు. అమెరికా నేతృత్వంలోని పది దేశాల మిలిటరీ బలగాలను ఎర్రసముద్రంలోకి దించి హౌతీలను ఎదుర్కోవాలని అమెరికా "ఆపరేషన్ ప్రాస్పరిటీ గార్డియన్" వ్యూహాలను రచిస్తున్నది. యుద్ధనౌకల పహారాతో సముద్ర నౌకలను దాడుల నుండి రక్షించటానికి ఎర్రసముద్ర (రెడ్ సీ) సంకీర్ణ రక్షణ కూటమిని అమెరికా ఏర్పాటు చేసింది. ఈ కూటమిలో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, బహరైన్, సేచెలెస్, స్పెయిన్, నార్వే, నెదర్లాండ్, కెనడా, ఇటలీతో పది దేశాలున్నాయి. ప్రాంతీయ దేశాలలో బలమైన సౌదీ అరేబియా, ఈజిప్ట్ చేరలేదు. ఒక్క బహ్‌రైన్ దేశం ఈ కూటమిలో చేరింది. బహ్‌రైన్ దేశం జనాభాలోనూ, వైశాల్యంలోనూ, సైనికశక్తిలో కూడా చిన్నదేశమే. కూటమిలో చేరటానికి అన్ని నాటో దేశాలు ఉత్సాహం చూపటం లేదు.

గాజాపై దాడులు ఆపకపోతే ప్రపంచ ఇంటర్నెట్ పై కూడా దాడి చేస్తామని హౌతీలు హెచ్చరించారు. బాబ్ ఎల్ మండెప్ జలసంధికి దగ్గర సముద్ర భూగర్భజలాల నుంచి వెళ్తున్న సముద్ర కేబుల్ నెట్‌వర్క్ వైర్‌లను కత్తిరించేస్తామన్నారు. ప్రపంచంలో వున్న ఇంటర్నెట్ డేటా 99 శాతం సబ్‌మెరైన్ కేబుల్స్ ద్వారానే జరుగుతుంది. హౌతీలు కొత్తగా నౌకల పైననే కాకుండా, ప్రత్యక్షంగా అమెరికా యుద్ధనౌకలపైనా, ఇజ్రాయిల్ పోర్టల్లపై కూడా దాడులను మొదలెట్టారు. అమెరికా యుద్ధనౌకలు హౌతీల మిస్సైల్ దాడిని ఆపలేకపోయాయి. వందలకొలదీ నౌకలు సముద్రంలో లంగరు వేసి ఆగిపోయాయి. అతి పెద్ద, యం.స్.సీ యునైటెడ్ వాణిజ్య నౌకపై డిసెంబర్ 26న హౌతీ మిలిటరీ మిస్సైల్‌తో దాడి చేసినట్లుగా వెల్లడించింది. గెలక్సీ లీడర్ అనే ఇజ్రాయిల్ వ్యాపారి నౌకను హైజాక్ చేసి 25 మంది సిబ్బందిని ఎమెన్‌లో నిర్బంధించారు. ఇజ్రాయిల్‌తో అంటకాగుతున్న ఇండియా నౌకలను కూడా వదలలేదు. ఇండియా వస్తున్న ఎం.వి.కెమ్.ఫ్లూటో నౌకపైనా, సౌదీ నుండి వస్తున్న ఎం.వి.సాయిబాబా నౌకల పైన కూడా డ్రోన్ దాడులు జరిగాయి. భారతదేశం మూడు యుద్ధనౌకలను కాపలాగా పంపించింది. అందులో "ఐ యస్ యస్ మారముగో"గైడెడ్ మిస్సైల్ విధ్వంసక నౌక కూడా వుంది.



> పాలస్తీనాకు మద్దతిస్తున్న హౌతీ రెబెల్స్ ఎర్రసముద్రాన్ని (రెడ్‌సీ) యుద్ధ క్షేత్రంగా మార్చుకుని ఇజ్రాయిల్‌తో సంబంధమున్న దేశాల నౌకలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులను చేస్తున్నారు. ప్రపంచ వాణిజ్య రంగంలో ముఖ్యమైన నౌకా రవాణా రంగంలో అత్యంత కీలకమైన మార్గం ఎర్రసముద్ర నౌకా మార్గం. ఈ మార్గం ద్వారానే అమెరికా, ఐరోపా దేశాలు ఆసియా, ఆఫ్రికా దేశాలతో వ్యాపారం చేసి లాభాలను ఆర్జిస్తున్నాయి. ఆఫ్రికా చుట్టూ తిరిగిరాకుండా ఈజిప్ట్‌లోని సూయజ్ కాలువ-ఎర్రసముద్రం మీదుగా అంతర్జాతీయ వాణిజ్యం సాగుతోంది. బాబ్ ఎల్ మండెప్ జలసంధి వద్ద మార్గం చాలా సన్నగా 29 కి.మీ. మాత్రమే వుండటం వలన సముద్ర నౌకలపై దాడులకు అనువుగా వుంది. దగ్గరలో వున్న ఎమెన్‌ను స్థావరంగా చేసుకుని హౌతీ రెబెల్స్ వాణిజ్య నౌకలపై దాడుల ద్వారా, అంతర్జాతీయ వాణిజ్య సమాజాన్ని గాజాలో మారణహోమాన్ని ఆపమని కోరుతున్నారు.

ప్రపంచ ప్రజలు ఉద్యమించాలి

నౌకలు రెడ్‌సీ ద్వారా రోజుకి 16 నాటికల్ మైళ్ళ వేగంతో ప్రయాణించి 25 రోజులలో యూరప్‌ని చేరగలుగుతున్నాయి. ఎర్రసముద్రాన్ని తప్పించి ఆఫ్రికా చుట్టూ తిరిగి గుడ్ హోప్ మార్గం ద్వారా ప్రయాణించటానికి 43 రోజులు పడుతుంది. వ్యయ ప్రయాసలకోర్చి రూట్ మార్చే ప్రయాణానికి తొమ్మిది రోజుల నుండి 30 రోజులు ఆలస్యమవుతుంది. 15 రోజులు ప్రయాణకాలం పెరిగితే నౌకకు ఇంధనం ఖర్చు అదనంగా 10 లక్షల డాలర్లవుతాయి. వందకుపైగా వాణిజ్య నౌకలు రూటు మార్చుకున్నాయి. ఆఫ్రికా చుట్టూ తిరిగి వెళ్తున్నాయి. ఆయిల్ ధరలు మూడు శాతం పెరిగి ఒక బారల్ చమురు ధర 80 డాలర్లకు చేరింది. బీమా కంపెనీలు ప్రతి కంటైనర్ మీద 700 డాలర్ల సర్‌ఛార్జి విధిస్తున్నారు. నిత్యావసరవస్తువులన్నిటికీ ఆసియా, ఆఫ్రికా దేశాలపై ఆధారపడిన అమెరికా యూరప్ దేశాలు సరుకుల రవాణా ఆలస్యాన్ని భరించలేవు. ఖర్చు పెరుగుతుంది. ఆసియా దేశాలకు చమురు సహజ వాయువు దిగుమతులు కష్టవుతాయి. ప్రపంచవ్యాపితంగా ధరలు పెరిగి ద్రవ్యోల్బణం సంభవించి ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తుంది. అంతర్జాతీయ వాణిజ్యానికి ప్రమాదంగా పరిణమించిన సమస్యను పరిష్కరించాలంటే గాజాపై ఇజ్రాయిల్ 83 రోజుల మానవ హననాన్ని ఆపేటట్లుగా ప్రపంచ ప్రజలు ఉద్యమించాలి.

టెక్నాలజీ, ఆయుధాలు సమస్యలన్నిటినీ పరిష్కరిస్తాయనే విశ్వాసం అన్నిసార్లూ వాస్తవం కాదని పాలస్తీనీయులు, హౌతీలు నిరూపించారు. ప్రపంచంలో అత్యంత ఆధునిక టెక్నాలజీ సహాయంతో ఏదైనా ముందే కనుక్కోగలమనే ఇంటలిజెన్స్ నెట్‌వర్క్ వున్నదనుకుని విర్రవీగే ఇజ్రాయిల్ ప్రభుత్వం, హమాస్ దాడిని ముందే పసిగట్టలేకపోయింది. హఠాత్తుగా జరిగిన అక్టోబర్ 7 దాడిని జీర్ణించుకోలేక సాగిస్తున్న విశృంఖల దాడులు హమాస్‌ని పట్టుకోవటంలో విఫలం చెంది విచక్షణారహితంగా సామాన్య ప్రజలను హతమారుస్తున్నారు. 200 డాలర్లతో తయారయ్యే డ్రోన్‌లతో, లక్షలకోట్ల డాలర్ల విలువ చేసే నౌకలను హౌతీలు హడలెత్తిస్తున్నారు. లక్షల కోట్ల అంతర్జాతీయ వాణిజ్యం సంక్షోభంలోకి జారేటట్లున్నది. వరస ఎదురుదెబ్బలు తింటూ, డాలర్ పతనం ప్రారంభమై, ఉక్రెయిన్‌లో కూడా భంగపడబోతున్న అమెరికాకు ఇజ్రాయిల్ దుశ్చర్యలను చివరకంటా బలపరచటం సాధ్యం కాదు. ప్రజలే చరిత్రను నిర్మిస్తున్నారు. ■

నవతెలంగాణ
5
కరీంనగర్
శనివారం డిసెంబర్ 30, 2023 www.navatelangana.com

మండలాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు, కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - గన్నేరువరం : గన్నేరువరం మండలాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి, కస్తూర్బా పాఠశాల, మోడల్ స్కూల్ ఏర్పాటు కోసం శుక్రవారం అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పది సంవత్సరాలుగా గన్నేరువరం మండలం అభివృద్ధికి నోచుకోలేదన్నారు.త త్వరితగతిన ఆస్పత్రి, రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణాలు పూర్తి చేయనున్నట్టు తెలిపారు. వారివెంట తహసీల్దార్ బిక్షపతి, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చిటుకూరి అనంతరెడ్డి, కొమ్మెర రవీందర్‌రెడ్డి, బొడ్డు సునీల్, కాంతాల అంజిరెడ్డి, చింతల శ్రీధర్‌రెడ్డి, మాతంగి అనిల్, కొలుపుల రవి, నల్ల చంద్రారెడ్డి, బుర్ర తిరుపతిగౌడ్, సర్పంచులు ముస్కు కరుణాకర్‌రెడ్డి, దుడ్డు రేణుకమల్లేశం, చింతలపల్లి నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ బద్ధం సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్‌కు కలిసొచ్చింది..

గత వైభవాన్ని సంతరించుకున్న 'హస్తం' పార్టీ

2023 రౌండప్



- అసెంబ్లీ ఎన్నికల్లో 13స్థానాలకుగాను ఎనిమిది కైవసం
- పదేండ్లుగా వెలుగువెలిగి.. డీలా పడిన బీఆర్ఎస్
- ఇద్దరికి మంత్రి పదవులు, మరో ఇద్దరికి ప్రభుత్వ విప్‌లు
- ఏండ్లుగా గెలుపు కోసం పోరాడుతున్న వారిని వరించిన విజయం
- ఎక్కడా ఖాతా తెరవని బీజేపీ.. ఓడిన ఉద్దండులు..

2023 ఏడాది ప్రారంభం నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన అసెంబ్లీ ఎన్నికలు చివరికి డిసెంబర్ 3న ఫలితాలతో ఉమ్మడి జిల్లా రాజకీయాలను తారుమారు చేసింది. అన్నింటా తామై.. స్థానిక సంస్థల ఎన్నికలు మొదలుకుని అసెంబ్లీ స్థాయి వరకూ క్లీన్‌స్వీప్ చేసుకుంటూ వచ్చిన బీఆర్ఎస్ పార్టీకి బీటలు వేసినట్టయింది. ఊహించని రీతిలో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకుని ఉమ్మడి జిల్లా రాజకీయాలను కుదిపేసింది. తన పూర్వవైభవాన్ని తిరిగి పొందింది. ఈ ఏడాది కాలం కాంగ్రెస్‌కు కలిసిరాగా.. మొన్నటివరకూ అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బీటలువారే పరిస్థితి తెచ్చిపెట్టింది.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో వెలుగు వెలిగిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఏర్పాటు తరువాత కనుకమరుగయ్యే పరిస్థితికి దిగజారింది. అయితే ఈ ఏడాది వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని సత్తాచాటి పూర్వవైభవాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 స్థానాలల్లో ఎనిమిది కైవసం చేసుకోగా.. అందులో ఇద్దరికి మంత్రి పదవులు వరించాయి. మరో ఇద్దరికి ప్రభుత్వ విప్ హోదా దక్కింది. గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఆరుగురు ఏండ్లుగా విజయం కోసం పోరాడుతున్నవారే కాగా.. ఈ సారి వారిని గెలుపు వరించింది. ఈ క్రమంలో పదేండ్ల పాటు ఒక్క స్థానం మినహా మిగిలిన 12సెగ్మెంట్లనూ ఏలిన బీఆర్ఎస్ పార్టీ ఈ సారి ఐదింటికే పరిమితమై కొంత డీలా పడింది. ఏదేమైనా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ ఏడాది నువ్వా నేనా? అన్న రీతిలో తలపడగా.. మధ్యలో పోటీకి వచ్చిన బీజేపీకి మాత్రం ఒక్క స్థానమూ దక్కపోవడం గమనార్హం.

ఇద్దరికి మంత్రి పదువులు.. మరో ఇద్దరికి విప్‌లు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ మంత్రుల స్థాయికి ఎదిగారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పొన్నం, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా దుద్దిళ్ల కొలుదీరారు. వీరిలో పొన్నం ప్రభాకర్‌కు 2023 బాగా కలిసొచ్చిందనే చెప్పవచ్చు. 2009లో ఎంపీగా పని చేసిన ఆయన ఆ తరువాత వచ్చిన 2014, 2018 ఎన్నికల్లో అటు ఎంపీగా, ఇటు ఎమ్మెల్యేగా కరీంనగర్ నుంచి పరాభవం పొందుతూ వచ్చారు. దీంతో తన పూర్వపుస్థానం కరీంనగర్‌ను వదిలి ఇదే ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న హుస్నాబాద్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోగా.. అక్కడిప్రజలు భారీ మెజార్టీతో బ్రహ్మరథం పట్టారు. తెలంగాణ ఉద్యమంలో ఎంపీగా ఆయన చేసిన పోరాటం, ఎంపీగా వైభవంగా సాగిన తన రాజకీయ ప్రస్థానం మళ్లీ తన చెంతకే చేరింది. ఏకంగా రాష్ట్ర మంత్రి హోదా దక్కించుకున్న ఆయన ఇక్కడి పార్టీ బలోపేతానికి ఊతమిచ్చినట్టయింది. మరోవైపు శ్రీధర్‌బాబు సైతం రెండు పర్యాయాలు ప్రతిపక్షంలోనే ఉండిపోయారు. 2014లో ఓడినప్పటికీ 2018లో గెలిచి విపక్షంలోనే కూర్చున్నారు. అంతకుముందు వరుసగా మూడుసార్లు గెలిచి రెండుసార్లు మంత్రిగా పనిచేసిన ఆయనకు పదేండ్ల తరువాత పూర్వవైభవాన్ని తిరిగి పొందారు. ఇక మరోవైపు 20ఏండ్లుగా వేములవాడ ఎమ్మెల్యేగా గెలిచేందుకు అలుపెరగని పోరాటమే చేసిన ఆది శ్రీనివాస్‌ను ఈ 2023 ఆ కోరికను నిలబెట్టింది. ఎప్పుడూ స్వల్ప ఓట్ల తేడాతోనే ఓడిపోతూ వచ్చి ఈ సారి ఎలాగైనా గెలవాలనే ఆయన సంకల్పం సిద్ధించి అసెంబ్లీలో అధ్యక్షా! అనేందుకు అర్హున్ని చేసింది. ఆది శ్రీనివాస్‌లాగానే ధర్మపురిలో గెలుపుకోసం పోరాడిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కూడా ఎమ్మెల్యేగా గెలుపొందారు. సీనియర్ నాయకులుగా పార్టీ విధేయులుగా ఉన్న వీరిద్దరికీ ప్రభుత్వ విప్ హోదా దక్కడం గమనార్హం.

అసెంబ్లీలోకి తొలిసారి...

గతంలో ఎంపీగా పని చేసిన పొన్నం ఏనాడూ అసెంబ్లీ పోరులో గెలవలేదు. ఈసారి ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారి శాసనసభలో తన వాయిస్ వినిపిస్తున్నారు. మిగిలిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, వేములవాడ, ధర్మపురి శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలే కాదు.. కోరుట్లలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తనయుడు డాక్టర్ సంజయ్‌కుమార్ సైతం తొలిపోరులోనే విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టగా... హుజూరాబాద్ నుంచి గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కూడా తొలి విజయాన్ని అందుకున్నారు.

ఖాతా తెరవని బీజేపీ.. ఓడిన ఉద్దండులు..

అసెంబ్లీ పోరులో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే ఫైట్‌జరగగా.. మూడు చోట్ల మాత్రం ముగ్గురు ఉద్దండులు పోటీనిచ్చినా విజయం సాధించలేకపోయారు. కరీంనగర్ ఎంపీగా, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షునిగా ఉన్న బండి సంజయ్ గట్టిపోటీనే ఇచ్చినా చివరికి 3600ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. మరో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తన పార్లమెంట్ నియోజకవర్గంలోనే ఉన్న కోరుట్ల అసెంబ్లీ నుంచి పోటీకి దిగినా విజయం సాధించలేకపోయారు. ఇక ఓటమే ఎరుగని నేతగా వరుసగా 7సార్లు హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చిన ఈటల రాజేందర్ ఈ ఏడాది అసెంబ్లీపోరులో ఓటమి చవి చూశారు. అటు సీఎం కేసీఆర్‌పై గజ్వేల్‌లో తలపడి, ఇటు సొంత నియోజకవర్గం హుజూరాబాద్‌లో పోటీ చేసి రెండు చోట్లా పరాజయం పాలయ్యారు. ఏదేమైనా ఈ ఏడాది ఉమ్మడి రాజకీయాలను అసెంబ్లీఎన్నికల పోరు తారుమారు చేసిందని చెప్పవచ్చు.

నేడు సీపీఐ(ఎం) జిల్లా ప్లీనరీ

కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



నవతెలంగాణ-కరీంనగర్ : గత కార్యక్రమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకొనుటకు ఈ నెల 30న కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో నిర్వహించే సీపీఐ(ఎం) జిల్లా ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, ప్రజలపై వాటి ప్రభావాలు, ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోవడానికి ఈ ప్లీనరీ సమావేశం తోడ్పడుతుందన్నారు. ఈ ప్లీనరీ సమావేశానికి రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ, దేశ సంపదను కార్పోరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్న బీజేపీని ఎక్కడ, ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఓడించాలని పిలుపునిచ్చారు. 2014లో ఆకలి సూచికలో 125 దేశాల్లో 104వ దేశంగా ఉన్న భారతం దేశం 111వ స్థానానికి దిగజారిందని తెలిపారు. పీడితుల సమస్యలపై ప్రభుత్వాలను నిలదీసేది కమ్యూనిస్టులేనన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే అనేక సంస్కరణలు, చట్టాలు వచ్చాయన్నారు. ఈ దేశాన్ని చిన్నాభిన్నం చేస్తూ, ప్రజల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొడుతూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని, నియంతృత్వ చట్టాలను తీసుకొస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఐఐటీలో అచీవర్స్ విద్యార్థుల విజయ దుందుభి


జ్ఞాపికను అందిస్తున్న లీడ్ ప్రతినిధి

నవతెలంగాణ - కరీంనగర్

స్థానిక కోతి రాంపూర్ లోని అచీవర్స్ పాఠశాల 2023-2024 వార్షిక సంవత్సరం నేషనల్ లెవల్ లీడ్ ఐఐటీ, జెఈఈ మిడిల్ ఆఫ్ ది ఇయర్ పరీక్షలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు పాఠశాల డైరెక్టర్‌కు లీడ్ ప్రతినిధి వినోద్ పవార్ జ్ఞాపికను అందజేశారు. కె.అవినాష్ 6వ, ఎం.నిశిత 7వ, జె.వికాస్ 8వ, కె.శ్రీసహస్రరెడ్డి 9వతరగతి విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. పాఠశాల డైరెక్టర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సిహెచ్.పల్లవి విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. ఇంకా ఇలాంటి విజయాలను సాధించాలని విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు.

కాంగ్రెస్‌లో చేరిన హమాలీ సంఘం జమ్మికుంట అధ్యక్షుడు



నవతెలంగాణ - జమ్మికుంట

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుగు, జమ్మికుంట హమాలీ వర్కర్స్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు వొల్లాల శ్రీనివాస్‌గౌడ్ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్ సమక్షంలో హైదరాబాద్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మారపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఎండి సలీం పాషా, బండి కుమార్, సందీప్ ఉన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో న్యూ మిలీనియం స్కూల్ విద్యార్థినులు




నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట పట్టణంలోని న్యూ మిలీనియం పాఠశాలకు చెందిన ఇద్దరు చిన్నారులు వరల్డ్ రికార్డ్ ఆఫ్ గిన్నిస్ బుక్‌ల చోటు సాధించడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ పి.విశ్వనాథరెడ్డి ఆనందం వ్యక్తం చేస్తూ చిన్నారులను అభినందించారు. న్యూ మిలీనియం స్కూల్స్‌లో ఆరోతరగతి విద్యార్థిని వేముల శర్విక, మూడో తరగతి విద్యార్థిని ఆరాధ్యశ్రీ ఈ నెల 24వ తేదీన హైదరాబాద్‌లోని భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీలలో పాల్గొని అద్భుతమైన ప్రతిభ కనపరచడమే కాకుండా, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీ

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట పట్టణంలోని రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అలాట్ చేసిన ధాన్యం సీఎంఆర్‌కు పెట్టకుండా పక్కదారి పట్టించిన రైస్ మిల్లులపై స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. రికార్డులు, ధాన్యం నిల్వలు పరిశీలించినట్టు తెలిపారు. బియ్యంగా మార్చి సీఎంఆర్‌కు పెట్టలేదన్న ఫిర్యాదు మేరకు తనిఖీలు చేసినట్లు అధికారులు తెలిపారు.

దేశసేవే లక్ష్యంతో విద్యార్థులు ముందుకు వెళ్లాలి



నవతెలంగాణ - తిమ్మాపూర్

దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో ఇంజనీరింగ్ విద్యార్థులు ముందుకెళ్లాలని జ్యోతిష్మతి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల అకాడమిక్ బోర్డు అడ్వైజర్, డైరెక్టర్ ఆఫ్ బల్క్ సాలిడ్స్ సెంటర్ కనాస్ స్టేట్ యూనివర్సిటీ యూఎస్ఏ ప్రొఫెసర్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ డాక్టర్ దండు శివరామరాజు అన్నారు. మండలంలోని జ్యోతిష్మతి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల లో సివిల్, మెకానికల్, ఈఈఈ ఇంజనీరింగ్ విద్యార్థులకు స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రోగ్రాం పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ముఖ్య అతిథిని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు జ్ఞాపిక అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఎస్.రావు స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సంపత్ రావు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికను కుటుంబానికి అప్పగించిన పోలీసులు

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం : కరీంనగర్ బైపాస్ ఫ్లైఓవర్ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం బస్సు దిగి కనిపించకుండా పోయిన బాలిక వసిష్ఠ కృష్ణ ఆచూకీ లభించింది. పోలీసులకు బృందాలుగా విడిపోయి సీసీ ఫుటేజ్ ఆధారంగా హైదరాబాద్ జూబ్లీ బస్టాండ్ ప్రాంతంలో పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం, బంధువులు కలిసి గురువారం అర్ధరాత్రి బాలికను తీసుకుని కరీంనగర్ చేరుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. న్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, మీడియాకు బాలిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా పాలన కార్యక్రమానికి విశేష స్పందన

నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి


దరఖాస్తులు స్వీకరిస్తున్న నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్ : ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని 2, 19, 13, 34వ డివిజన్లలో దరఖాస్తు సెంటర్లను సందర్శించారు. 13వ డివిజన్‌లో వికలాంగుడు ఓర్సు శ్రీనివాస్‌కు కుడిచేయి లేనిది గమనించిన నరేందర్ రెడ్డి అతని దరఖాస్తు ఫారం తీసుకొని నింపి రిజిస్టర్‌లో నమోదు చేయించి రశీదు ఇచ్చారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు దరఖాస్తు సెంటర్ల వద్ద ఉండి సహకరించాలని కాంగ్రెస్ నాయకులను కోరారు. కార్యక్రమంలో కూన దామోదర్, మూల రవీందర్‌రెడ్డి, అస్తపురం రమేష్, ఎంఎ నవాజ్, కొట్టే రాము, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కీర్తి కుమార్, మహమ్మద్ భారీ, శేహెన్షా ఇమ్రాన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులోనీ రాజీవ్ రహదారిపై ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. జోగుండ్ల గ్రామానికి చెందిన పురం రాజలింగు, కనకయ్య ద్విచక్ర వాహనంపై రామంచ గ్రామం వైపు వెళ్తుండగా కారు అతివేగంగా ఢీకొట్టింది. కనకయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. రాజలింగకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచితంగా అభయహస్తం దరఖాస్తులు

నవతెలంగాణ - చొప్పదండి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయ హస్తం దరఖాస్తు ఫారాలను ప్రజలకు మున్సిపల్ సిబ్బందికి ఉచితంగా అందించామని, ఎవరు కూడా డబ్బులు పెట్టి కొనకూడదని స్పెషల్ ఆఫీసర్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ పి.శాంతికుమార్ సూచించారు. చొప్పదండి పట్టణంలోని 1, 2, 3, 4, 5, 6, 14 వార్డులలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమాన్ని స్పెషల్ ఆఫీసర్ నరేందర్ పరిశీలించారు. ఇప్పటివరకు 1476 అభయ హస్తం దరఖాస్తులను స్వీకరించినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ డి.ప్రశాంత్ కుమార్, ఏఈ రాజేశం, సీనియర్ అసిస్టెంట్ మోహన్‌రెడ్డి, జూనియర్ సహాయకులు అంజయ్య, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అర్హులందరికి పథకాలు..

నవతెలంగాణ - చొప్పదండి : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలను అర్హులందరికి అందేలా చూస్తామని కాంగ్రెస్ యువజన నాయకుడు తోడేటి విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆరు గ్యారంటీ దరఖాస్తుల ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతుందన్నారు. రేషన్‌కార్డ్, మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, పెన్షన్లు పథకాల దరఖాస్తులకు అనూహ్య స్పందన వస్తుందన్నారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శని, ఆదివారాలు మార్కెట్‌కు సాధారణ సెలవులు కాగా సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా సెలవు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. తిరిగి వచ్చే నెల రెండవ తేదీన మార్కెట్ పునః ప్రారంభం అవుతుందని అన్నారు. కాబట్టి రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం

డీఆర్ఓకు తీర్మానం పత్రం అందజేత


డీఆర్ఓకు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్లు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావుపై 20మంది కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు తీర్మానపత్రాన్ని శుక్రవారం కరీంనగర్ డీఆర్ఓ పవన్ కుమార్‌కు కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు నాలుగు సంవత్సరాల నుండి ఎలాంటి సమాచారం లేకుండా ఎజెండా తయారు చేస్తున్నారన్నారు. ప్రతి ఎజెండాలో ముందస్తు చైర్మన్ ఆదేశానుసారం 70శాతం నిధులు ఖర్చు పెట్టి ఆమోదం కోసం సమర్పిస్తున్నారని ఆరోపించారు. అడ్వాన్సుగా లక్షల రూపాయలు డ్రా చేసి, చేయని పనులకు బిల్లును పెట్టి రికార్డు చేశారన్నారు. డీజిల్, బ్లీచింగ్ పౌడర్ పేర ఖర్చు అయిన దానికన్నా అధిక రూపాయలు బిల్లు పెట్టి డ్రా చేశారని ఆరోపించారు. పట్టణ ప్రగతి నిధులు వార్డులలో చేయని పనులకు రికార్డు చేయించి, బిల్లులు డ్రా చేసుకుని తీసుకున్నారన్నారు. సద్దుల బతుకమ్మ, దసరా, గణేష్ నిమజ్జనం టెండర్లు లేకుండా చైర్మన్ పనులు చేసి, రికార్డు చేయించుకొని లక్షలాది రూపాయలు డ్రా చేసుకున్నారని ఆరోపించారు. అలాగే జనరల్ ఫండ్‌లను రూల్స్‌కు విరుద్ధంగా ఖర్చు చేసి సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి మెజార్టీ కౌన్సిలర్లం అందరం ఇష్టపూర్వకంగా నిర్ణయం తీసుకొని సంతకాలు చేసినట్టు చెప్పారు. అవిశ్వాస తీర్మానాన్ని తొందరగా ఆమోదించాలని వారు కోరారు. కార్యక్రమంలో పొన్నగంటి మల్లయ్య, మారేపల్లి బుచ్చయ్య, పిట్టల శ్వేత, మేడిపల్లి రవీందర్, దేశిని రాధా, ఎలగందుల స్వరూప, బొంగోని వీరన్న, శ్రీపతి నరేష్, కూతాడి రాజయ్య, రావికంటి రాజకుమార్, బిట్ల కళావతి, పొనగంటి సారంగం, గుల్లి పూలమ్మ, పొనగంటి విజయలక్ష్మి, మద్ది లావణ్య, సాయిని రమ, కల్వల దీప్తి, రామ్మోహన్, పొనగంటి రాము, పొన్నగంటి శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

వేడెక్కిన రాజకీయం

ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారాన్ని చేపట్టగా జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. జమ్మికుంట మున్సిపాలిటీలో 30 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో 20 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావుపై అవిశ్వాసం పెట్టినట్టు తెలుస్తుంది. మున్సిపల్ చైర్మన్ కూతురు పెండ్లి ఈ నెల 28న జరిగింది. కౌన్సిలందరూ పెండ్లికి హాజరై, బయటకు వచ్చి అవిశ్వాసానికి మంతనాలు జరిపినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అదే రాత్రి అవిశ్వాస తీర్మానంపై సంతకాలు పెట్టిన కౌన్సిలర్ల ఇంటికి వెళ్లి అవిశ్వాసం పెట్టవద్దని మాట్లాడినట్లు సమాచారం. అవిశ్వాసం పెట్టబోమని, కలెక్టర్ వద్దకు వెళ్లబోమని పాడి కౌశిక్ రెడ్డి తో అన్నట్లు సమాచారం. కానీ తెల్లవారి 18మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు జిల్లా అధికారికి వినతిపత్రం అందజేయడం గమనార్హం. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానంతో పట్టణంతోపాటు నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

మంత్రులను కలవడానికి తరలి వెళ్లిన కౌన్సిలర్లు

జమ్మికుంట మున్సిపల్‌లో 30 మంది కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ వారు 28 మంది, కాంగ్రెస్ పార్టీకి ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 18 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లతో కలిసి శుక్రవారం అవిశ్వాస తీర్మాన పత్రాన్ని కరీంనగర్లో అందజేసి అక్కడినుండి జిల్లాకు చెందిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లో కలవడానికి అదే బస్సులో బయలుదేరి వెళ్లారు. మంత్రులను కలిసిన తర్వాత అక్కడినుండి క్యాంపునకు వెళ్తారనే ప్రచారం జమ్మికుంటలో జోరుగా సాగుతోంది.

రెండోరోజు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరణ


గన్నేరువరం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


గంగాధర : గర్శకుర్తిలో దరఖాస్తులు ఇచ్చేందుకు బారులు తీరిన జనం



రామడుగు : దరఖాస్తులను స్వీకరిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ - గన్నేరువరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు అర్హులైన వారికి అందుతాయని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిజమైన లబ్ధిదారులు నిర్లక్ష్యానికి గురి అయ్యారని, నేడు గడీల పాలన పోయి ప్రజా పాలన మొదలైందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, సర్పంచ్ బేతెల్లి సమతరాజేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ చింతల పద్మపరశురాం, ఎంపీడీవో స్వాతి పాల్గొన్నారు.

నవతెలంగాణ - గంగాధర

ఆరు గ్యారెంటీల అమలు కోసం గంగాధర మండలంలోని గర్శకుర్తి, గంగాధర, గట్టుభూత్కూర్, గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలకు జనం తాకిడి పెరిగింది. తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో మల్హోత్ర ఆధ్వర్యంలో ప్రజా పాలన గ్రామసభలు కొనసాగగా, ఆయా గ్రామాల్లో ప్రజలు బారులు తీరి దరఖాస్తులు అందించారు. తొలి రోజు 5 గ్రామాల్లో 693 దరఖాస్తులను అధికారులు స్వీకరించగా, శుక్రవారం జరిగిన గ్రామసభల ద్వారా రెట్టింపు దరఖాస్తులు అందినట్టు అధికారులు వివరించారు.


జమ్మికుంటలో..


నవతెలంగాణ - జమ్మికుంట

ప్రజాపాలనను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మార్కల రజినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కోరపెల్లి, మాచనపెల్లి గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమంలోకమిషనర్ బి.శ్రీనివాస్ దరఖాస్తులను స్వీకరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ సతీష్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు కడవేర్గు మమత, మాచనపల్లి సర్పంచ్ బొజ్జం కల్పనాతిరుపతిరెడ్డి, ఎంపీటీసీ పొలసాని రాజేశ్వరరావు, కోరపల్లి సర్పంచ్ రమ, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - రామడుగు

ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గోపాలరావుపేట సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నవెంకటరాంరెడ్డి అన్నారు. గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రజాపాలన అభయహస్తం గ్యారంటీల దరఖాస్తులను స్వీకరించారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాపాలనా దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఎంపీవో రాజశేఖరరెడ్డి, మండల స్పెషల్ అధికారి ప్రియదర్శిని పాల్గొన్నారు.

నవతెలంగాణ - వీణవంక


వీణవంక మండలంలో..

మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్ రెడ్డి, కొమ్మిడి రాకేష్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు పలు సూచనలు సలహాలు అందజేశారు. వారివెంట గ్రామ శాఖ అధ్యక్షులు గిరవేన సాయిలు, సింగిరెడ్డి సమ్మిరెడ్డి, గంగాడి రాజిరెడ్డి, వంగల కొండల్‌రెడ్డి, కోమల్‌రెడ్డి, సతీష్ యాదవ్, అనిల్‌రెడ్డి, వార్డు మెంబర్ కొండల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి సతీష్, కిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



నవతెలంగాణ-జగిత్యాల

విద్యార్థులు క్రీడాల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణ ఎస్.కె ఎన్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో జిల్లా యువజన సర్వీసుల, క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు 2024 ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. గెలుపు ఓటములు సహజం అని, కల్చరల్ ఆక్టివిటీలో భాగస్వాములు కావడం గెలుపు కన్నా చాలా ముఖ్యమైనది అని పేర్కొన్నారు. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి వివేకానందస్వామి అని, ఆయనను నేటి యువతకు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అశోక్, జిల్లా యువజన క్రీడా అధికారి రవికుమార్, రాజేంద్ర ప్రసాద్, సతీష్, అనిల్ రావు పాల్గొన్నారు.

గాడి తప్పిన విద్యాశాఖ

- జిల్లా అంతటా ఇన్‌చార్జీ ఎంఈఓలే..
- ఎల్ఎఫ్ఎల్‌లు సగానికి పైగా ఖాళీలే..
- సమీపిస్తున్న పదో తరగతి పరీక్షలు
- వంద శాతం ఉత్తీర్ణత ఎలా సాధ్యం



నవతెలంగాణ-జగిత్యాల టౌన్

విద్యార్థులను ఉన్నత శిఖరాలకు ఎదిగేలా తీర్చిదిద్దాల్సిన విద్యా వ్యవస్థ గాడి తప్పుతోంది. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యం దారి తప్పుతోంది. పిల్లలకు మెరుగైన విద్య అందేందుకు దోహదపడాల్సిన అధికారులతో పాటు బోధన అందించే టీచర్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రానున్న పది వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు కాదు కదా.. కనీసం విద్యార్థుల సామర్థ్యాలు కూడా మెరుగుపడని పరిస్థితి నెలకొంది.

జగిత్యాల జిల్లాలో 18 మండలాలున్నాయి. వీటిల్లో 515 ప్రాథమిక పాఠశాలల్లో 20499 మంది, 84 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 5208 మంది, 189 ఉన్నత పాఠశాలల్లో 4239 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు చదుకుంటున్నారు. కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం మన ఊరు మన బడి పేరిట 12 రకాల మౌలిక సదుపాయాల్ని కల్పించేందుకు పనుల్ని చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. ఇటీవల బీఆర్ఎస్ అన్ని ప్రభుత్వ పాఠశాల ల్లోనూ అల్పాహారం అందించే పథకాన్ని కూడా ప్రారంభించింది.

ఇన్‌చార్జిలతో లోపించిన పర్యవేక్షణ..

జిల్లాలో మండల విద్యాధికారుల పోస్టుల్లో రెగ్యులర్ బాధ్యులు కాకుండా అందరూ ఇన్‌చార్జీలే ఉన్నారు. 7 గురికే 18 మండలాల బాధ్యతలూ అప్పగించారు. 2018లో పూర్తి స్థాయిలో బదిలీలు జరిగాయి. 2023లో ప్రధానోపాధ్యాయులు బదిలీలు మాత్రమే జరిగి మిగతా బదిలీలు జరిగాక పలువురికి పదోన్నతులు రాక ఉపాధ్యాయులు నైరాస్యంలో మునిగిపోయారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పాఠ్యాంశాల బోధన, ప్రిపరేషన్ చేయడంలో అశ్రద్ధ కొనసాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి. అందు కోసం తగిన రీతిలో విద్యా బోధన కొనసాగాలి. పరీక్షలకు ప్రిపరేషన్ చేయడం, విద్యార్థులకు అదనపు క్లాసులు తీసుకోవడం, స్టడీ అవర్స్ పెంచడం వంటివి జరగాలి. విద్యా సంవత్సరం క్యాలెండర్ ఉన్నప్పటికీ ఆచరణలో అది అమలు కానీ పరిస్థితులున్నాయి. విద్యతో పాటు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం, అల్పాహారం అందించే పనుల్ని కూడా చక్కబెట్టాలి. కానీ ఒక పాఠశాలకు ప్రధానో పాధ్యాయుడిగా కొనసాగుతున్న వారినే పలు మండలాలకు ఇన్‌చార్జీ ఎంఈఓలుగా అదనంగా రెండు మూడు మండలాల బాధ్యతలు కూడా ఇవ్వడంతో వారంతా ఏ పనినీ సరిగ్గా చేయలేని పరిస్థితులున్నాయనే అభిప్రాయముంది.

సమీపిస్తున్న వార్షిక పరీక్షలు..

పదో తరగతి బోర్డ్ పరీక్షలు మార్చిలో జరగనున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన కుంటుపడింది. ఈ ఏడాదిలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. దీంతో పాఠ్యాంశాల బోధనలో జాప్యం జరుగుతూ వస్తోంది. ఆయా సబ్జెక్టుల వారిగా పాఠ్యాంశాల్ని భోధించడంలో వెనుకబాటు ఉంది. పైగా పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలంటే ఎంఈఓలు, జీహెచ్ఎంలు నిరంతరం ఇదే పనిగా పర్యవేక్షణ చేయాలి. ఎంఈఓలైతే వారి మండలాన్ని, జీహెచ్ఎంలైతే వారు చూసే స్కూల్ బాధ్యతను వంద శాతం నిర్వర్తించాలి. అప్పుడే అనుకున్న ఫలితాలు సాధించడం వీలవుతుంది. కానీ ఒక్కొక్కరికి అదనంగా మండలాలు, స్కూల్స్ ఇంచార్జీ ఇవ్వడంతో దేనికీ న్యాయం చెయ్యలేని పరిస్థితులున్నాయి. దీంతో విద్యా బోధన, మధ్యాహ్న భోజనం, అల్పాహారం పథకాల అమలు ఇష్టారాజ్యంగా సాగు తుందనే అభిప్రాయాలున్నాయి. గతంలో సాధించిన ఉత్తీర్ణతను కూడా కాపాడుకుంటే చాలనే చర్చ నడుస్తుంది. కానీ జిల్లాలోని 18 మండలాలకు 7గురు ఎంఈఓలే విధులు నిర్వహిస్తుండడంతో వార్షిక ఫలితాలలో వారిని బాధ్యులను చేయడంలో జిల్లా విద్యాశాఖ అధికారి కూడా వెనుకడుగు వేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పలు పాఠశాలలకు ప్రభుత్వం నిర్దేశించిన సౌకర్యాలు లేకున్నా సుమారు 10 సంవత్సరాల వరకు పలు పాఠశాలలకు రెన్యువల్ చేస్తూ అందిన కాడికి దండుకుంటున్న ఎంఈఓలు. పదో తరగతి ఫలితాల్లో మాత్రం తమకేమీ పట్టనట్టు ప్రవర్తించడం ఏంటని ఆ శాఖలోని పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే చాలా ఏండ్లుగా ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగుతున్న వారి అక్రమాలకు అడ్డు అదుపు లేదనేది పలు సందర్భాల్లో నిరూపితమైంది. ప్రభుత్వంలో చక్రం దింపిన కొంతమంది అధికారులు ఈ ప్రభుత్వంలో నైన పని విధానంలో మార్పు చూపాలి అని ఉపాధ్యాయ వర్గాలు అభి ప్రాయపడుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా రాజకీయ నాయకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అటు ఉపాధ్యాయులు ఇటు తల్లిదండ్రులు కోరుచున్నారు.



పరిశీలిస్తున్న అధికారులు

ఉన్నతి కార్యక్రమం పరిశీలన

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గత సెప్టెంబర్ నుంచి నిర్వహిస్తున్న 'ఉన్నతి' కార్యక్రమం' అమలు తీరును జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి కె. మహేష్ శుక్రవారం పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి, వివరాలు యాప్‌లో నమోదు చేయడంతో పాటు, ఉపాధ్యాయుల డైరీలు, పాఠ్య ప్రణాళికలు పరిశీలించినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వారి వెంట ఉపాధ్యాయులు ఇమ్మానుయేల్, శివకృష్ణ, ఇబ్రహీం, మమత పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోండి

సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు



దరఖాస్తు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని గోదురు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు పరచడంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన పారదర్శకంగా ఉంటుందని అన్నారు. అంతేకాకుండా పకీరు కొండాపూర్, మూలరాంపూర్ గ్రామాల్లో ప్రజాపాలన కొనసాగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో కట్కం ప్రభు, ఎంపీ ఓ కపాకర్, సర్పంచ్ సోమ ప్రభాకర్, డబ్బా మాజీ ఉప సర్పంచ్ బూసరాజేశ్వర్, కోటగిరి వెంకటస్వామి, ఎలాల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిపై చెక్ డ్యాం నిర్మించండి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గోదావరినదిపై చెక్ డ్యామ్ నిర్మించి సాగునీరించాలని మాజీ ఎంపీటీసీ పెంట లక్ష్మీ లింబాద్రి శుక్రవారం ప్రగతి భవనంలోని ప్రజావాణి కార్యక్రమంలో ఇరిగేషన సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. గోదావరినదిపై అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి జేవీ నరసింహారావు గంగనాల ప్రాజెక్టు మత్తడిని ప్రారంభించారని పేర్కొన్నారు. ఆ కాలువ నుంచి సుమారు 2.5 కిలోమీటర్ల వరకు నీరు వృథా అవుతుందని, అక్కడి ప్రాంతమైన రాట్నాల మడుగు దగ్గర చెక్ డ్యామ్‌ను నిర్మించి రైతులకు బాసటగా నిలవాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు వారు తెలిపారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

నవతెలంగాణ-మేడిపల్లి

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన వస్తుందని, అర్హులకు అన్ని పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనతో శ్రీకారం చుట్టిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఉమ్మడి మేడిపల్లి మండలంలోని మన్నెగూడెం, కొండాపూర్, కల్వకోట, కట్లకుంట గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అభయహస్తం 6 గ్యారంటీలతో ప్రగతి పథం సకల జనహితం కానుందని, అర్హులైన పేదవారికీ ఆర్థిక చేయూతకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి 6 వరకు ప్రజాపాలనతో అభయ హస్తం గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణ ప్రతి గ్రామంలో,వార్డుల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. మహాలక్ష్మి, గృహలక్ష్మి, రైతు భరోసా, చేయూత, ఇందిరమ్మ ఇండ్లు, అభయ హస్తం లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ఒకటే దరఖాస్తులో అన్ని నింపాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజులలోనే 2 పథకాలను విజయవంతంగా అమలు చేశామన్నారు. మేడిపల్లి, భీమారం మండల ప్రజలకు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, తహసీల్దార్ వసంత, జడ్పీటీసీ హరిచరణ్‌రావు, ఎంపీపీ దొనకంటి ఉమాదేవి రాజ రత్నాకర్‌రావు, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్యాలలో ప్రజా పాలన కార్యక్రమం



నవతెలంగాణ-మల్యాల

మల్యాల మండలంలోని ముత్యంపేట, తక్కలపల్లి, నూకపల్లి గ్రామాలలో ప్రజా పాలన శుక్రవారం నిర్వహించారు. 6 గ్యారంటీల అమలుపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరు కాగా గ్రామస్తులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందుగా ఇచ్చిన 6 హామీలలో ఒకటి అమలు కాగా మిగతా ఐదింటికి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. 100 రోజుల్లోనే మిగతా అన్ని గ్యారెంటీలను అమలయ్యేలా మా ప్రభుత్వ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ దివాకర్, డీపీఓ దేవరాజ్, ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ మనోహర్, ఎంపీడీవో వెంకటేష్, పద్మ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు. మల్యాల మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదిక కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కథలాపూర్

కథలాపూర్ మండలంలో ప్రజలందరూ తమ గ్రామాల్లో నిర్వహించే ప్రజాపాలన సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు అన్నారు. మండలంలోని గంభీర్పూర్ తక్కలపల్లి, బొమ్మెన గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలనలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల వద్దకే పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. రానున్న కాలంలో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో ముందు ఉంచుతారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జవాజి రేవతి గణేష్, సర్పంచ్‌లు పిడుగు లావణ్య, తిరుపతిరెడ్డి, లక్ష్మి శ్రీనివాస్, సింధుజ, శేఖర్, ఎంఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమల్ల పరిశీలన



నారు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నవతెలంగాణ-కొడిమ్యాల

కొడిమ్యాలలో వరి నారుమల్లను మండల వ్యవసాయ అధికారి జ్యోతి శుక్రవారం పరిశీలించారు. చలి తీవ్రత అధికంగా ఉన్నందున ప్రతిరోజు రాత్రి నారుమడిలో ఉన్న నీటిని తీసివేసి ఉదయం మళ్ళీ కొత్తగా నీరు పెట్టాలని ఏవో రైతులకు సూచించారు. జింకు లోప నివారణకు జింకుసల్ఫేట్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలన్నారు. అలాగే మొగి పురుగు నివారణకు నారు పీకే వారం రోజుల ముందు క్యార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను చల్లుకోవటం వలన నాటు వేసిన తర్వాత మొగిపురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చును అని రైతులకు వివరించారు. కార్య క్రమంలో ఏఈఓలు మంజుల, శ్రీనివాస్‌రెడ్డి రైతులు ఉన్నారు.

నేటి మెగాలోక్ అదాలత్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

కేసుల సత్వర పరిష్కారానికి మెగాలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జ్ నీలిమ సూచించారు. వివిధ కేసుల్లో అపరిష్కృతంగా ఉన్న కేసులను సత్వరమే పరిష్కరిం చడానికి మెగాలోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. శనివారం జగిత్యాల కోర్టులో నిర్వహించే మెగాలోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకుని విలువైన సమయం, డబ్బులు ఆదా చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

జగిత్యాలరూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు బక్క శెట్టి తిరుపతి తండ్రి లింగయ్య అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. వారి వెంట సర్పంచ్ సరోజన మల్లారెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మహేష్, గ్రామశాఖ అధ్యక్షులు గంగారెడ్డి, నాయకులు రాజీరెడ్డి, మల్లేశం గౌడ్, చంద్రయ్య, బెజ్జంకి నరేష్, గుమ్మడి జీవన్, గడ్డం జలంధర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



సీపీడబ్ల్యూ స్కీమ్ పునరుద్ధరించండి

సీఎం రేవంత్‌రెడ్డికి పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వినతి

నవతెలంగాణ-రాయికల్

రాయికల్ పట్టణంలో సీపీడబ్ల్యూ స్కీమ్ పునరుద్ధరించడంతో పాటు మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని పునరుద్ధరిం చేందుకు రూ.5 కోట్లు నిధులు మంజూరు చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్ లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. 2004-2009 మధ్యకాలంలో జగిత్యాల, రాయికల్, బీర్పూర్ ప్రాంతాల్లోని గ్రామీణ ప్రాంతానికి శుద్ధి చేసిన నీరు సరఫరా చేసేందుకు గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం (సీపీడబ్ల్యూ స్కీం)



సీఎంకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ఏర్పాటు చేశామని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగునీరు అందిస్తామని చెప్పి, సీపీడబ్ల్యూ స్కీంలను మూసివేశారని, దీంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీడబ్ల్యూ సీమ్‌లు పునరుద్ధరణకు జగిత్యాల మండలంలో 150 లక్షలు, రాయికల్ మండలంలో 150 లక్షలు, బీర్పూర్ మండలంలో 190 లక్షలు అవసరమవుతాయని తెలిపారు. అగ్నిమాపక కేంద్రంతో రాయికల్, బీర్పూర్, సారంగాపూర్, మల్లాపూర్ తదితర మండలాల్లో అగ్నిమాపక ప్రమాదాలను నియంత్రించడంలో ఎంతో ఉపయోగకరంగా ఉండేదని,అగ్ని మాపక కేంద్రాన్ని నిలిపివేయడంతో జగిత్యాల అగ్నిమాపక కేంద్రానికి 40-50 కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన గ్రామాల్లో ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు సంభవించి నప్పుడు జగిత్యాల అగ్నిమాపక కేంద్రంపై ఆధారపడాల్సి వస్తుందని, రాయికల్‌లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో బీజేపీ విఫలం

- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. జగిత్యాల డీవైఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా నాయకులు ఆర్. హరీష్ అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆనగంటి వెంకటేష్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగయువతకు ప్రతి సంవ త్సరం రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. నేటికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోనూ ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రవేటు పరం చేస్తూ ఉన్నా ఉద్యోగాలను ఊడకొడుతూ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తుందని విమర్శించారు. ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ ఇచ్చిన హమీలను నేరవెర్చకుండా కాలాయాపన చేస్తూ మోసం చేస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి యువత తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్

కోటి ఆశలతో సాధించుకున్న తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి, పారదర్శంగా నియామకాలు చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలండర్ విడుదల చేసి యువతకు సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఉద్యోగాలను భర్తీ చేసేంతవరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు నిమిషకవి రాజేష్, ఎం.రమ్య, ఎండి.జాకీర్, సిరికొండ గణేష్, చిలుక శివ, సాయికిరణ్, ఎ.సంధ్య, బి.గణేష్, జి.శ్రీనివాస్, పి.చిరంజీవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జిల్లా పరిషత్ ఐదో స్థాయి సంఘ సమావేశం

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ ఐదో స్థాయి స్త్రీ శిశు వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ సంఘ సమావేశం అధ్యక్షులు పొనుగోటి ప్రశాంతి ఆధ్వర్యంలో జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సారథ్యంలో జరిగింది. జిల్లా సంక్షేమ అధికారి స్త్రీ, శిశ, వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ ఆడెపు భాస్కర్ సంబంధిత ప్రగతి నివేదికను సమర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, సిబ్బంది వివరాలు సమర్పించాలన్నారు. పిల్లల పెరుగుదల పర్యవేక్షణ సక్రమంగా నిర్వహించాలన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, ప్రీస్కూల్ పిల్లలకు, టేక్ హోమ్ రేషన్ పిల్లలకు పోషకాహారం సరిగ్గా అందేలా చూసు కోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ అధికారి జడ్పీ జిల్లా పరిషత్ సభ్యులను, అధ్యక్షులను అంగన్‌వాడీ కేంద్ర బిల్డింగ్ నిర్మాణాల కోసం జిల్లా పరిషత్ నిధుల నుంచి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ దావా వసంత, ఐదో స్థాయి సంఘ అధ్యక్షులు పునుగోటి ప్రశాంతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహన అధికారి రఘువరన్, జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ అడెపు భాస్కర్, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

డ్రైనేజీలోకి వెళ్లిన ట్రాక్టర్

తప్పిన ప్రమాదం



మురుగు కాలువలో పడిన ట్రాక్టర్

నవతెలంగాణ- రాయికల్

రాయికల్ మండలంలోని మైతాపూర్ గ్రామ శివాలయంకు వెళ్ళే దారిలోని డ్రైనేజీ కప్పు కూలిపోవడంతో ఆ వైపుగా పంట పొలాలకు వెళ్లే ఓ రైతు ట్రాక్టర్ ట్రాలీ మురుగు కాలువలో పడిపోయింది. ట్రాలీతోపాటుగా ఇంజన్ బోల్తా పడి ఉంటే ప్రమాదం సంభవించేదని, ఈ నెల 26న రెండేళ్లకే కూలిన డ్రైనేజీపై కప్పు శీర్షికన నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన వార్త విషయంను స్థానిక రైతులు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వైపు నిత్యం రైతులు ఎడ్ల బండితో పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రమాదాలు సంభవించక ముందే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - సిరిసిల్ల

నవతెలంగాణ క్యాలెండర్‌ను శుక్రవారం సిరిసిల్ల శాసనసభ్యులు కె.తారక రామారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ నవతెలంగాణ దినపత్రిక నిజాలు నిర్భయంగా రాస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. నవతెలంగాణ పత్రిక విలువలతో కూడిందని, ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, కౌన్సిలర్లు ఆకుల కృష్ణ, కల్లూరి రాజు, అన్నారం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండారి శ్యామ్, నాయకులు గూడూరి ప్రవీణ్, బొల్లి రామ్మోహన్, దిడ్డి రాజు పాల్గొన్నారు.



నవతెలంగాణ

7

రాజన్న సిరిసిల్ల

శనివారం | డిసెంబర్ 30, 2023 | www.navatelangana.com

అనుమానాలు, ఆందోళనలు వద్దు

- అభివృద్ధి, సంక్షేమం మాకు రెండు కండ్లు
- జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తాం
- ప్రజా పాలన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





సిరిసిల్ల : సిరిసిల్ల లోని ప్రజా పాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ - సిరిసిల్ల

విద్య, వైద్యం, సాగునీరు, రోడ్లు, వంతెనలు ఇలా అన్ని రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టి.. కార్మిక, కర్షక, ధార్మిక క్షేత్రమైన రాజన్న సిరిసిల్ల జిల్లా సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రజలందరికీ మేలు జరిగేలా చూస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రజలకు ప్రజా పాలన కార్యక్రమం వేదికగా భరోసా నిచ్చారు.

సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై లాంఛనంగా ప్రారంభించారు. సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ప్రతి గడపకూ సంక్షేమాన్ని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కొత్త ప్రభుత్వం.. కొత్త ఆలోచనతో ముందుకెళ్లే క్రమంలో ప్రభుత్వం కొలువుదీరిన మొదటి వారం రోజుల్లోనే ప్రజలకు ఉపయోగకరమైన ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు హామీని నెరవేర్చామని చెప్పారు. అదే విధంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం ప్రజల వద్దకే వెళ్లి ప్రజా పాలన కార్యక్రమం చేపట్టి 6 గ్యారంటీ ల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు పని దినాలలో జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల లోని ప్రతి వార్డులలో ప్రజా పాలన సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల మొదలగు పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. ప్రజలకు ఉచితంగా దరఖాస్తులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఒకే దరఖాస్తులలో ఆరు స్కీంలకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అనివార్య కారణాల వలన దరఖాస్తు ఇవ్వలేని వారు ఈ నెల 6తేదీ లోగా మున్సిపల్ కార్యాలయంలో అందజేయవచ్చున్నారు. మహిళా, మైనార్టీ, రైతు, బీసీ, దళిత డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లు 100రోజుల్లో అర్హులకు 6గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. 95శాతం ప్రజలకు ప్రజా పాలన కార్యక్రమం ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. ఇంకా ఏమైనా మిగిలి ఉంటే వాటి పరిష్కారం కృషి చేస్తామని చెప్పారు. ప్రజలు నమ్మకంతో మాకు అవకాశం ఇచ్చారనీ.. ప్రజల కష్ట సుఖాల్లో తోడుంటామని, ప్రభుత్వానికి ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలనీ కోరారు. మహిళలకు ఆర్టీసీ లో ఉచిత ప్రయాణంతో బంధాలు బలోపేతం అవుతున్నాయనీ ఆది శ్రీనివాస్ అన్నారు. బాలికలు,యువతలో విద్యాభివృద్ధికి, ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శన తద్వారా మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తుందన్నారు. మొత్తంగా మహిళా సాధికారితకు ఈ నిర్ణయం మొదటి అడుగుగా నిలిచిందన్నారు.

దరఖాస్తులు సరిపడా అందుబాటులో ఉంచాలి :

ప్రజా పాలన సదస్సులలో ప్రజలకు దరఖాస్తులు సరిపడా అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఒకరోజు ముందుగానే అన్ని కుటుంబాలకు దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు శంకరయ్య, కౌన్సిలర్‌లు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసత్ అలీ బేగ్ పాల్గొన్నారు.

అర్జీదారులకు ఇబ్బందులు కలగొద్దు

అడిషనల్ కలెక్టర్ పి.గౌతమి



నవతెలంగాణ - కొనరావుపేట

ప్రజాపాలన కార్యక్రమంలో అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ పి.గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్జీదారులతో మాట్లాడి ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 6కౌంటర్లు మాత్రమే ఉన్నాయని మహిళలకు ఇబ్బంది కలుగుతుందని, నూతన రేషన్ కార్డుల దరఖాస్తుల గురించి అడిషనల్ కలెక్టర్‌ను అర్జీదారులు కోరగా.. రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. మహిళలకు ఇబ్బంది లేకుండా మరో కౌంటర్‌ను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ ప్రకాష్‌రావు, సర్పంచ్ గున్నాల అరుణ, ఎంపీఓ రాజు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ
- కలెక్టరేట్ ముందు ధర్నా



ధర్నా చేసున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :

సిరిసిల్లలోని పార్కులు డివైడర్లు గ్రీనరీ పెంచే కార్మికుల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు కార్మికులతో ధర్నా పెట్టారు పట్టణంలోని పార్కులు, డివైడర్లు, ప్లాంటేషన్ తదితర విభాగాల్లో పని చేస్తున్న 50మంది కార్మికులకు గత 5నెలల నుంచి వేతనాలు చెల్లించలేదాన్నరు. కాంట్రాక్టర్‌ను జీతాలు అడిగితే మున్సిపల్ నుంచి మాకు బిల్లులు రావడంలేదని బిల్లులు వచ్చాక వేతనాలు ఇస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కార్మికులకు వేతనాలు చెల్లించల్ని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు. ధర్నాలో నర్సయ్య శారద, గీత, శ్రీకాంత్, రాకేష్, ఇంద్రవ్వ, మనేమ్మ, అనసూర్య, లక్ష్మి, కనకవ్వ, వంశీ, ప్రియాంక, కళ్యాణ్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలబడదాం

- ఎమ్మెల్యే కేటీఆర్
- కౌన్సిలర్లకు దిశా నిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేటీఆర్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

అధికారంలో ఉన్న లేకున్నా ప్రజల పక్షాన ఉందామని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలో ఆయన పర్యటించారు. సిరిసిల్ల పట్టణంలోని రాజన్న మల్టీ స్పెషాలిటీ ప్రారంభించి, పలు కార్యక్రమాల్లో పాల్గొని పలువురిని పరామర్శించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. సమావేశంలో ముందస్తు కార్యకలాపాలపై కౌన్సిలర్లకు దిశానిర్దేశం చేశారు. సిరిసిల్ల పట్టణ ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటామని, కౌన్సిలర్‌లు అందరు జనంలోనే ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు, పథకాలు అందరికి చేరే వరకు పోరాడుదామన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరితో అన్ని పథకాలకు దరఖాస్తు చేయించాలన్నారు. విలీన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా చేయడానికి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మున్సిపల్ తీర్మానం చేశామని, పట్టణ ప్రజలకు ఏ ఇబ్బంది ఉన్న వెంటనే స్పందించాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో తిరిగి సత్తా చాటుదామని, కొత్త సంవత్సరంలో కొత్త ఉత్సాహంతో పని చేద్దామని పిలుపునిచ్చారు. కౌన్సిలర్ల అందరికీ అందుబాటులో ఉంటానని, ఏదైనా సమస్య వస్తే నేరుగా నేనే వస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ - తంగళ్ళపల్లి :

తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవ స్థానం పున్ఃప్రారంభానికి మంత్రి కేటీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. మండల కేంద్రంలో దాదాపు రూ.50 లక్షల వ్యయంతో నిర్మాణం అవుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి రావాలని మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం సిరిసిల్లకు రావడంతో ఆలయ ప్రతినిధులు గ్రామస్తులు వెళ్లి ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. జనవరి 3వ తేదీ నుండి 6వ తేదీ వరకు జరిగే మహోత్సవ కార్యక్రమానికి తమరు తప్పక రావాల్సిందిగా ఆయనను కోరారు.



పల్లె దవాఖనను ప్రారంభించిన విప్

పల్లె దవాఖానలో మెరుగైన వైద్య సేవలు

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- మామిడిపల్లిలో జెడ్పీ చైర్‌పర్సన్‌తో కలిసి పల్లె దవాఖన ప్రారంభం

నవతెలంగాణ - కొనరావుపేట : ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన పల్లె దవాఖనను జడ్పీ చైర్పర్సన్ న్యాలకొండ అరుణ, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రజా పాలనలో ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే గ్రామాలలో దరఖాస్తులను స్వీకరిస్తుందని పేర్కొన్నారు. అందులో ప్రధానంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డును రూ.5 లక్షల పరిమితి నుండి 10 లక్షల వరకు పెంచినట్లు గుర్తుచేశారు. గ్రామస్థాయిలో కూడా మెరుగైన వైద్య సేవలు అందించడానికి పల్లె దవాఖనలు తోడ్పడుతాయని చెప్పారు. ప్రధానంగా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో పాటు గర్భిణులకు దవాఖానలు ఉపయోగకరంగా కుంటాయని వివరించారు. పల్లె దవాఖానను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందుకుగాను వైద్య సిబ్బంది తమ సేవలను అందించాలని ఆదేశించారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అదనపు తరగతి గదులు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని పూర్తి చేసేందుకు విధులు కేటాయించాలని ప్రధానోపాధ్యాయులు కస్తూరి శ్రీనివాస్ ఎమ్మెల్యేను కోరారు. తరగతి గదులతో పాటు గ్రామంలో ఏ ఇతర సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కారించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఇక్కడ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, డీఎంహెచ్వో సుమన్మోహన్రావు, సర్పంచ్ కొక్కుల భారత, సెస్ వైస్ చైర్మన్ దేరకొండ తిరుపతి, ఎంపీడీవో రామకృష్ణ, వైద్యాధికారి వేణుమాధవ్, జిల్లా కిసాన్సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పాషా.. ఉపసర్పంచ్ రాంరెడ్డి, నాయకులు ఎల్లయ్య, జవ్వాజి రాములు, సాగర్, మల్లారెడ్డి, ఎల్లారెడ్డి, ఉస్మాన్, అబ్దుల్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాం

ఆరు మాసాల్లో ఇండ్ల పట్టాలు.. నిర్మాణాలు



నవతెలంగాణ - సిరిసిల్ల

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతామని, పట్టాలు రాని జర్నలిస్టులకు పట్టాలు ఇప్పించడంతోపాటు జర్నలిస్టులు అందరికీ ఇండ్ల నిర్మాణానికి ఆరు మాసాలలోపు పరిష్కరించడం జరుగుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డిలను ప్రెస్ క్లబ్ పాలకవర్గం, సభ్యులు శాలువాతో సత్కరించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని అధికారంలోకి రాకముందే హామీ ఇచ్చామని గుర్తుచేశారు. జర్నలిస్టులకు ఇచ్చిన హామీ ప్రకారం ఇంటి స్థలాలతో పాటు ఇండ్లను కూడా ప్రభుత్వం నిర్మించి ఇస్తుందని హామీ ఇచ్చారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా ఉండి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆకుల జయంత్, ప్రధాన కార్యదర్శి పరకాల ప్రవీణ్ కుమార్, రఘు రాపెల్లి భాస్కర్ కాయితి మహేందర్ సీనియర్ జర్నలిస్టులు కరుణాల భద్రాచలం, తడుక విశ్వనాథం టివి నారాయణ, రాపెల్లి సంతోష్ కుమార్, ఊరడి మల్లికార్జున్ రాచ లక్ష్మణ్ మిట్టపల్లి కాశీనాథ్ కాంబోజి ముత్యం మేడి కిషన్ ప్రెస్ క్లబ్ పాలకవర్గం సభ్యులు అల్లే రమేష్ నాయిని బాబు రాజా రమేష్ అన్సర్ అలీ దయానంద్ శిరీష నాలుగు పాల్గొన్నారు.

పల్లె పోరు జరిగేనా?

- ముంచుకొస్తున్న గడువు
- ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత
- పార్లమెంట్ ఎన్నికల ముందా..
- తరువాత అనేది తేలని వైనం



నవతెలంగాణ - తంగళ్ళపల్లి

గ్రామ పంచాయతీ ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. ఇటీవలే కొత్త ప్రభుత్వం ఏర్పడడం, కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల ను వంద రోజుల్లో అమలు చేస్తాననడం.. వాటిలో రెండు పథకాలే ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. మిగిలిన గ్యారంటీలను కూడా అమలు చేయాల్సి ఉంది. అవన్నీ పూర్తి చేశాక గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ అభ్యర్థులకు మేలు చేకూరుతుందనే ఆలోచనల్లో ప్రభుత్వం ఉంది. మరోవైపు పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యాక నిర్వహిస్తే బాగుంటుందని అంచనా వేస్తున్నట్టు తెలుస్తోంది. అధికారులు మాత్రం ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను కొనసాగిస్తున్నా. ప్రభుత్వం మాత్రం అందుకు సిద్ధంగా లేనట్లుగా తెలుస్తోంది. కానీ పంచాయతీరాజ్ అధికారులు ఇప్పటికే ఎన్నికల కసరత్తు ప్రారంభించారు.

ఫిబ్రవరి 1తో కాలపరిమితి పూర్తి...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 255 గ్రామపంచాయతీలు ఉండగా అందులో 2240వార్డు స్థానాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో జిల్లా మొత్తంగా తంగళ్ళపల్లి మండలంలో ఒక గ్రామపంచాయతీకి, ఇల్లంతకుంట మండలంలోని ఒక గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరగలేదు. అలాగే మరీ కొన్ని కొత్త గ్రామ పంచాయతీల కోసం ప్రతిపాదనలో గత ప్రభుత్వంలో అధికారులు పంపించినట్లు సమాచారం. 2024 ఫిబ్రవరి ఒకటో తేదీతో పంచాయతీ పాలకవర్గాల కాల పరిమితి పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం కనీసం 15 రోజుల ముందుగానే ఎన్నికల తతంగం అంతా పూర్తి కావాలి. అంటే జనవరిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. పైగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఇప్పటినుంచే ఆ ప్రక్రియను ప్రారంభిస్తే తప్ప జనవరి 15వ తేదీ నాటికి ఎన్నికలను పూర్తి చేసే పరిస్థితి ఉండదు. అయితే ప్రభుత్వం ఇంతవేగంగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్లే ఆలోచనల్లో లేనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పదేండ్లుగా కాంగ్రెస్ అధికారానికి దూరంగా ఉంది.గ్రామాల్లో పార్టీ శ్రేణులు చెల్లాచదురయ్యాయి. ఈ పరిస్థితుల్లో పథకాల అమలు, పార్లమెంటు ఎన్నికలు పూర్తి చేసుకోవడం ద్వారా గ్రామాల్లోనూ పార్టీ శ్రేణులకు బలం చేకూర్చవచ్చునే ఆలోచనల్లో ఉన్నట్టు సమాచారం.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు..

స్థానిక సంస్థల్లో బీసీ, ఎస్టీ రిజర్వే షన్లు పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. 6 శాతం నుంచి 10 శాతానికి ఎస్టీ రిజర్వేషన్లను పెంచడంతో పాటు బీసీలకు కూడా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని యోచిస్తోంది..

సన్నద్ధమవుతున్న అధికారులు...

ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు మాత్రం గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి సారించారు. ప్రభుత్వం ఒకవేళ ముందుగానే ఎన్నికలు నిర్వహించాలంటే అప్పటికప్పుడు అంటే ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో అధికారులు ముందస్తుగా ఏర్పాట్లుచేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు ఎంత మంది సిబ్బంది అవసరం తదితర వివరాలు అన్నింటిని సిద్ధం చేసి నివేదికను ఉన్నత అధికారులకు పంపించారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాతే..!

లోక్‌సభ ఎంపీల పదవీ కాలం 2024మేతో పూర్తికానుంది. వాటికి సంబంధించి ఓటరు నమోదు వంటి ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. పార్లమెంట్ ఎన్నికల నాటికి ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలుచేసే ఆలోచనల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. పార్లమెంట్ ఎన్నికలతరువాత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే విజయావకాశాలు కూడా కాంగ్రెస్‌కు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని ఆ పార్టీ భావిస్తున్నట్టు సమాచారం.

క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది



నవతెలంగాణ - బోయినిపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మార్తాండరావు స్మారక క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉన్నత స్థానంలో ఉంటారన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు దేహ దారుఢ్యన్ని పెంపొందిస్తాయన్నారు. స్నేహభావం సైతం పెరుగుతుందని తెలిపారు. చెన్నాడి మార్తాండ రావు కష్టజీవి అని ఎన్నో కష్ట నష్టాలు ఓర్చి మంచి ఉన్నత స్థానాన్ని సంపాదించాడని కొనియాడారు. చదువు లేకున్నా నెంబర్ వన్ స్థానంలో ఉన్న వ్యక్తి మార్తాండ రావు అని విద్యార్థులు కూడా వారు అనుకున్న గోల్‌ను చేరుకునేందుకు ఎన్ని కష్టాలు వచ్చినా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచులు గుంటీ లతాశ్రీ, జోగినపల్లి ప్రేమ్ సాగర్ రావు, రాజన్న సిరిసిల్ల జిల్లా మార్తాండ రావు ట్రస్టు చైర్మన్ చెన్నాడి రాజ్యలక్ష్మి, బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు చెన్నాడి అమిత్ కుమార్, మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు, ఎంపీటీసీ సంభ బుచ్చమ్మ,విద్యార్థిని విద్యార్థులు నాయకులు ఉన్నారు.

అసెంబ్లీ ఎన్నికల తుది

ఖర్చుల వివరాలు అభ్యర్థులు సమర్పించాలి

ఎన్నికల వ్యయ పరిశీలకులు మణిగండ స్వామి



నవతెలంగాణ - సిరిసిల్ల : అసెంబ్లీ ఎన్నికల తుది ఖర్చులు వివరాలు అభ్యర్థులు సమర్పించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు జి.మణిగండసామి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల అకౌంట్ రికన్సిలేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకులు జి. మణిగండసామి మాట్లాడుతూ.. అభ్యర్థుల తుది ఖర్చులకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు, తేడాలు ఉంటే జిల్లా వ్యయ మానిటరింగ్ కమిటీని సంప్రదించాలని చెప్పారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ... అభ్యర్థులు వచ్చే నెల 2వ తేదీ లోగా తుది ఖర్చుల వివరాలను నిర్దీత ప్రోఫార్మాలో సమర్పించాలని చెప్పారు. ఒకవేళ అభ్యర్థులు ఖర్చుల వివరాలు సమర్పించగా లేకపోతే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 10 (ఏ) ప్రకారం అభ్యర్థులకు తదుపరి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు అవుతారన్నారు. సమావేశంలో ఎన్నికల వ్యయ ప్రత్యేక అధికారి స్వప్న, నోడల్ అధికారి రామ కృష్ణ, ఏఈఓలు, ఎన్నికల అకౌంటింగ్ టీమ్ పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ధర్మపురి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీలను అమలులో భాగంగా ఈనెల 28న ప్రజా పాలనకు శ్రీకారం చుట్టింది. ధర్మపురి మండలం పరిధిలోని నక్కలపేట గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని, దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు సంబంధిత పత్రాలను జత చేసి అధికారులకు ఇచ్చి రసీదు పొందాలని తెలిపారు. ఏదైనా సమస్యలు ఉంటే తనకు నేరుగా ఫోన్ ద్వారా గాని కలిసి గాని సమస్యలను తెలుపాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మొగిలి శేఖర్, ఎంపీటీసీ భూక్య అమ్మాయి, ప్రజా పాలన ప్రత్యేక అధికారి రాజేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగణబట్ల దినేష్, గొల్లపెల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నిశంత్ రెడ్డి,జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, సత్యనారయణ,శ్రీహరి పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేటలో ప్రజాపాలన అభయ హస్తం దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ములసపు లక్ష్మీ, అర్బన్ మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, ఎంపీడీఓ శైలజ రాణి, ఎంపీవో సలీం, సర్పంచ్ జయ, మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కోరుట్ల : పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసి వారికి న్యాయం చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, యూత్ అధ్యక్షుడు రిజ్వాన్, గంగన్న చిట్యాల లక్ష్మీనారాయణ, సదుల వెంకటస్వామి, బన్న రాజేష్, జాగిలం భాస్కర్, మ్యాదరి లక్ష్మన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లీ చెల్లిపై దాడి.. ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ- కథలాపూర్ : మండలంలోని కలికోట గ్రామానికి చెందిన బొడ్డు హరీశ్ కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లి బొడ్డు రాజవ్వ, చెల్లెలు జువ్వాజీ అనూషలపై తల్వార్‌తో దాడి చేశాడు. ఈ దాడిలో వారికి గాయాలు అయ్యాయి. బాధితురాలు రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదతో కేసు నమోదు చేసి నిందితుడు హరీశ్‌నును జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

అంగట్లో ఆరు గ్యారెంటీల ఫారాలు

ఒక్కో ఫారానికి రూ.10 నుంచి రూ.50 వసూలు



నవతెలంగాణ - తంగళ్ళపల్లి : ప్రభుత్వం ప్రజలకు అందించే ఆరు గ్యారంటీల పథకాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు ప్రభుత్వం సరిపడా ఇవ్వకపోవడంతో జిరాక్స్ షాపుల వారు ఇదే అదనుగా రూ.10నుంచి రూ.50 విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గురువారం నుంచి ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి ప్రభుత్వం స్వీకరించే దరఖాస్తు ఫారాలు ప్రభుత్వమే ఒకరోజు ముందుగానే ప్రజలకు ఇంటింటికి పంపిణీ చేయాల్సి ఉంది. కానీ ప్రజలు మాత్రం ముందుగానే దరఖాస్తు ఫారాల కోసం, జిరాక్స్‌ల కోసం జిరాక్స్ సెంటర్ల వద్ద క్యూ కడుతున్నారు. ఇదే అదును చూసి జిరాక్స్ సెంటర్ల వారు దరఖాస్తు ఫారాలను ఆన్లైన్లో డౌన్లోడ్ చేసి ఒక్కో దరఖాస్తుకు కనీసం రూ.10 నుండి రూ.50ల వరకు దండుకుంటున్నారు. అలాగే ఒక్క జిరాక్స్ కాపీకి రూ.ఐదు రూపాయల వరకు దోచుకుంటున్నారు. గ్రామాల్లో అధికారులు పూర్తిస్థాయిలో ప్రజలకు ఆరు గ్యారంటీల పథకాలపై అవగాహన కల్పించకపోవడంతో ఇలా జిరాక్స్ సెంటర్ల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు.

మున్సిపల్ సాధారణ సమావేశం

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్



పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ డా.దాసరి మమతరెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో 33 సాధారణ అంశాలు,2 అడిషనల్ అంశాలు గాను కౌన్సిల్ సభ్యులు 35 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ కౌన్సిల్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, వైస్ చైర్ పర్సన్ నాజీమీన్ సుల్తానా మోబిన్,మేనేజర్ శివప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఓదెల:



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఓదెల మండలంలో ప్రజాపాలనలో భాగంగా గోపరపల్లి, బాయమ్మపల్లి, అబిరెడ్డిపల్లి గ్రామాల్లో తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో సత్తయ్య స్పెషల్ ఆఫీసర్లు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గోపరపల్లె సర్పంచ్ కర్క మల్లారెడ్డి, ఎంపీటీసీ గోపు లావణ్య నారాయణరెడ్డి, సర్పంచ్ తెలుసూరి కొమురయ్య పాల్గొన్నారు.

రెండోరోజు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జూలపల్లి



ప్రజాపాలనలో భాగంగా శుక్రవారం రోజున జూలపల్లి మండలంలో చీమలపేట, కాచాపూర్ గ్రామాలలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లో కలిపి 1201 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో వేణుగోపా లరావు తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా స్పెషల్ ఆఫీసర్ జిల్లా విద్యాధికారి మాధవి, ఎంపీడీవో వేణుగోపాలరావు, తహసీల్దార్ బషీరుద్దీన్, ఎంపీవో కిరణ్, కరెంట్ ఏవో అశోక్, పంచాయతీ రాజ్ శాఖ అధికారిని సువిశాల ఆర్ఐ సంపత్, సదయ్య, గ్రామ సర్పంచ్‌లు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకరు పని చేస్తే.. మరొకరికి డబ్బులు జమ

నవతెలంగాణ-జూలపల్లి



జూలపల్లి మండలం అబ్బపూర్ గ్రామానికి చెందిన సిరవేణి రాజయ్య తండ్రి రాయ మల్లయ్య అనే కూలీ వాచన్‌వార్డుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేస్తే, నెలలు గడుస్తున్న డబ్బులు పడడం లేదని అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగిన ఫలితం లేదని వాపోయాడు. ఇలా ఎందుకు జరిగిందని అధికారులను అడగగా ఇతని పేరు మీద పడే డబ్బులు వేరే వారి ఖాతాలో జమ అయ్యాయని అతని పేరు జంగం రాజయ్య మృతి చెందిన వ్యక్తిపై డబ్బులు పడ్డాయని వివరాలు తెలియజేశారు.12 వేలకు పైగా డబ్బులు వస్తాయని,నేను పనిచేసిన డబ్బులను త్వరగా ఇప్పించాలని సంబంధిత అధికారులు నాకు న్యాయం చేసి డబ్బులు ఇప్పించగలరని రాజయ్య కోరాడు.

ఆర్జీ-2లో వృత్తి విద్యా కోర్సులు ప్రారంభం

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ:



ఉత్పత్తులను పరిశీలిస్తున్న జీఎం

2023-24 సంవత్సరానికి గాను టైలరింగ్, మగ్గం, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సులను శుక్రవారం సీఈఆర్ క్లబ్ నందు ఏరియా జనరల్ మేనేజర్ ఎల్.వి. సూర్యనారాయణ రిబ్బన్ కత్తిరించి కోర్సులను పారంభించారు.మన సంస్థ ఉద్యోగుల, వారి కుటుంబ సభ్యుల పరిసర ప్రాంతాల అభ్యున్నతి కోసం ఎన్నో నిధులు వెచ్చించి ఖర్చు చేస్తుందనీ, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎల్వీ సూర్యనారాయణ అన్నారు. సింగరేణి సేవా సమితి ద్వారా నిర్వహిస్తున్న వృత్తి విద్యా శిక్షణ కోర్సుల ద్వారా మహిళలు స్వయం ఉపాధి, ఆర్థిక లబ్ధి పొంది తమ కాళ్ళ మీద తము నిలబడి జీవించే విధంగా ఈ కోర్సులు ఉపయోగపడుతాయన్నారు.ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్,అధికార ప్రతినిధి జి.రాజేంద్ర ప్రసాద్, డీవైపీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



ఈనెల 22న సెంటినరీ కాలనీలో జరిగిన నెట్‌బాల్ బాలుర విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి చంద్ర మహీధర్, అర్హాన్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు తగురం తిరుపతి తెలిపారు. ఈనెల 30 నుంచి జనవరి ఒకటి వరకు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని,ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్, ప్రధానోపాధ్యాయులు హకీంఖాన్ విద్యార్థులను అభినందించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా అభయ హస్తం గ్యారంటీ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, 8వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం పెద్దపల్లి పురపాలక సంఘం పరిధిలోని 8వ వార్డు నందు అభయహస్తం గ్యారంటీల కొరకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్ భాగ్యలక్ష్మిలు మాట్లాడుతూ వార్డు ప్రజలకూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ప్రజల కొరకు చేపట్టిన అభయ హస్తం కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోని లబ్ధి పొందాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కట్టా శివ ప్రసాద్, ఆశ వర్కర్లు, మెప్మా అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీని సందర్శించిన రైల్వే ఉన్నతాధికారులు

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ:



సీహెచ్‌పీ పనులను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

సీహెచ్‌పీని రైల్వే ఉన్నతాధికారులు భరతేష్ కుమార్ జైన్ డివిజినల్ రైల్వే మేనేజర్ ఓసీపీ-3 సీహెచ్‌పీ బొగ్గు రవాణాను సమీక్షించారు.రైల్వే ట్రాక్ ఎరెక్షన్ లొకేషన్‌పై కొత్త సైలో బంకర్ సైట్ క్లియరెన్స్ ఇవ్వడం కోసం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న సైలో బంకర్ నిర్మాణం పనులు, పూర్తయ్యే సమయం గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్మించే సమయంలో వ్యాగన్ కదలికలపై శ్రద్ధ వహించాలని, రక్షణతో పనులు చేయాలని సూచించారు. అలాగే క్వారీ నుంచి బొగ్గు రవాణా, బొగ్గు ఉత్పత్తి భవిష్యత్ ప్రణాళికలను తెలుసుకోవడానికి ఓసీపీ-3ని సందర్శించారు.ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎల్వీ సూర్యనారాయణ, ఏరియా ఇంజనీర్ నరసింహరావు, డీజీఎం సివిల్ ధనుంజయ, సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ సదానందం, ఓసీపీ-3 సీహెచ్‌పీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ఫోన్ ఎత్తట్లే..



- సర్కారు ఫోన్ల మూగనోము
- ప్రభుత్వ నెంబర్లే అయినా స్పందించరు
- ప్రజలకు అందుబాటులో ఉండని సార్లు
- ప్రభుత్వం మారినా.. మారని తీరు

రామగుండం-నవతెలంగాణ

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరి స్తున్నారు. సమాచార లోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం అధికారులకు కేటాయించిన ప్రభుత్వ ఫోన్ నెంబర్లలో సైతం అందుబాటులో ఉండడం లేదు. దీంతో అధికారులు, ప్రజల మధ్య సమన్వయం లోపించి తప్పుడు సందేశం వెళ్తోంది. ప్రస్తుతం కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పలు కొత్త పథకాలను ప్రవేశపెట్టిన నేపథ్యంలో వాటిపై ప్రజలు, నాయకులు, మీడియా వ్యక్తులకు పలు సందేహాలు నెలకొంటున్నాయి. వాటి నివృత్తి కోసం కార్యాలయాల్లో అందుబాటులో లేని అధికారులను ఫోన్లలో సంప్రదించేందుకు యత్నిస్తున్నా వారు ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదు. దీంతో సమాచార సేకరణ కోసం ఫోన్ చేసేవారికి నిరాశే ఎదురవుతోంది.

ఫేక్ సమాచారం వెళ్లే ప్రమాదం..

ప్రజా సేవలు సమగ్రంగా ప్రజలకు అందాలంటే సమాచార వ్యవస్థ పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉంది. కానీ కొందరు అధికారుల తీరు కారణంగా ప్రజలు, పాలకులు, అధికారుల మధ్య సమాచారం లోపం తలెత్తుతోంది. దీంతో తప్పుడు సమాచారం ప్రచారంలోకి వెళ్తోంది. కనీసం జర్నలిస్టులకు సైతం అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో సరైన సమయంలో సమాచార పంపిణీ జరగడం లేదు. ఫలితంగా సామాజిక మధ్యమాల్లో తప్పుడు వార్తలు ప్రసారం అవుతు న్నాయి. ఇటీవల కొన్ని పథకాలకు సంబంధించిన సమాచార లోపంతో ప్రజలు మీసేవలు, గ్యాస్ ఏజెన్సీల ముందు బారులు తీరాల్సి వచ్చింది. ప్రసార మాధ్యమాల ద్వారా సమాచార పంపిణీ సవ్యంగా జరగకపోతే సామాజిక మధ్యమాల ఇచ్చే అస్పష్టత, ఫేక్ సమాచారం తీవ్రమైన అనార్థాలకు దారి తీస్తాయని, ఇది ప్రపంచ సమస్యగా మా రిందని ఇటీవల రామగుండం సీపీ రెమ రాజే శ్వరి సైతం ఓ సమావేశంలో ప్రస్తావించారు.

నోటీసు బోర్డులకే పరిమితం..

పనిని సులువు చేసేలా వచ్చిన సాంకేతికతను వినియోగించుకునేలా ప్రభుత్వం అధికారులకు ఫోన్ నెంబర్లు కేటాయించి వాటిని కార్యాలయ నోటీసు బోర్డుల్లో రాసి పెట్టి అందుబాటులో ఉంచుతున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలకు అధికారి ఫీల్డ్ వర్క్, ఇతర కారణాలతో అందుబాటులో లేకపోతే నోటీసు బోర్డులో ఉన్న ఫోన్ నెంబర్లుకు ఫోన్ చేసినా వారు స్పందించడం లేదు. దీంతో కేవలం ఆ నెంబర్లు నోటీసు బోర్డుకే పరిమితమవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు వివాదాలు, వార్తలు, సమాచార స్పష్టత, నిజనిర్ధారణ కోసం పాత్రికేయులు ఫోన్లు చేసినా అధికారులు లిఫ్ట్ చేయడం లేదు. సమాచార పంపిణీ వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పుడే ప్రజాపాలన, ప్రజా సంక్షేమం సవ్యంగా కొనసాగుతాయని మీడియా వ్యక్తులు పలు సార్లు అధికారులను నిలదీసిన సందర్భాలు ఉన్నాయి.

స్పందించకుంటే సమస్యే ...

గత ప్రభుత్వంలో పాలకులు, అధికారుల తీరుతో విసిగి వేసారిన ప్రజలు మార్పును కోరుకున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ప్రజలకు అందించే సేవల ఆధారంగానే ప్రభుత్వ పని తీరును బయటపడుతుంది. ప్రజల సందేహాలను నివృత్తి చేయడంలో అధికారులు విఫలమైతే అది ప్రభుత్వంపై పైన వ్యతిరేక భావన కలిగేందుకు దారి తీస్తుందని, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నిర్మూలిస్తాం

- ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలను ఇప్పిస్తాం
- ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్

నవతెలంగాణ-గోదావరిఖని:



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ ప్రసాద్

సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నిర్మూలిస్తామని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ అన్నారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ ప్రసాద్ మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆరు ఏరియాల్లో ఓట్లు వేసి గెలిపించిన కార్మిక లోకానికి కృతజ్ఞతలు తెలిపారు. వెయ్యి ఓట్లతో ప్రాతినిధ్య సంఘంగా ఓడిపోవడానికి గల కారణాలు సమీక్ష చేసుకొని, రాబోయే రోజుల్లో సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన ధ్యేయంగా మొక్కవోని దీక్షతో పనిచేస్తామని అన్నారు. కంపెనీలో రాజకీయ జోక్యాన్ని నిర్మూలించి, సింగరేణికి రావాల్సిన ప్రభుత్వ బకాయిలు ఇప్పించి, ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వంతో పోరాడి అమలుకు కృషి చేస్తామని అన్నారు. పదేళ్ల అధికారం లేకున్నా వెన్నంటి నిలిచి ఐఎన్‌టీయూసీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకి సానుభూతి పరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌లు నరసింహారెడ్డి, ధర్మపురి, ఆర్జీ-1 వైస్ ప్రెసిడెంట్ సదానందం, సెంట్రల్ క్యాంపెనింగ్ ఇన్‌చార్జ్ వికాస్ కుమార్ యాదవ్, ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి, సెంట్రల్ నాయకులు దేవులపల్లి రాజేందర్, బ్రాంచ్ నాయకులు సాగర్, పోలు మహేష్ బాబు, బేబీ శీను, రామారావు, ఫిట్ నాయకులు దేవేంద్ర చారి, జన్ను మహేష్, పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ 6 గ్యారంటీ పథకాలు

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శుక్రవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కూనారం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామ సభల్లో పాల్గొన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన సభలో దరఖాస్తులు సమర్పించలేని వారు జనవరి 6 వరకు తమ దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని, గ్రామంలోని ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకునే విధంగా పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సూచించారు. యాసంగి సీజన్ నుంచి రైతులకు ధాన్యం తరుగు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమం కింద మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, చేయూత ఇందిరమ్మ ఇండ్ల పథకాల కింద దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, గ్రామంలోని ప్రతి కుటుంబం వారి కుటుంబ పరిధిలో రావాల్సిన పథకాలకు దరఖాస్తులను సమర్పించాలని ఎమ్మెల్యే తెలిపారు.

జనవరి 2లోపు ఎన్నికల వ్యయ వివరాలను సమర్పించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్



జనవరి 2 లోపు ఎన్నికల వ్యయ వివరాలను సకాలంలో సమర్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు.శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల వ్యయ పరిశీలకులు ఆశీష్ యాదవ్, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు సునిల్ శ్రీవాత్సవ్‌లతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థుల ప్రతినిధులతో ఎన్నికల వ్యయ వివరాల రికన్సిలేషన్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల వ్యయ వివరాలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సకాలంలో సమర్పించాలని అన్నారు. ఎన్నికల అభ్యర్థుల బ్యాంకు స్టేట్‌మెంట్ బిల్లులపై తప్పనిసరిగా పోటి చేసిన అభ్యర్థి లేదా ఎన్నికల ఏజెంట్ సంతకం చేయాల్సి ఉంటుందని, ఎన్నికల ఖర్చుల వివరాలు నమోదు చేసిన ఏ.బీ.సీ. రిజిస్టర్లలో ప్రతి పేజీపై తప్పనిసరిగా సంతకం ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి అధికారి శ్రీమాల, ఎన్నికల సహాయ వ్యయ పరిశీలకులు అశోక్ కుమార్, ఎం.శ్రీనివాస్, రవి బాబు, పాల్గొన్నారు.

ప్రజల వద్దకు ప్రజా పాలన

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

ప్రజల వద్దకు పాలన అందించేందుకు ప్రజా పాలన కార్యక్రమం రూపకల్పన చేశామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.పెద్దపల్లి మండలం ములసాల, పెద్దపల్లి పట్టణంలోని 10,11వ (రంగంపల్లి) వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామ సభల్లో శుక్రవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలువురి నుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి 6 గ్యారెంటీ పథకాలను అమలు చేసేందుకు చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం వారి కుటుంబ పరిధిలో రావాల్సిన పథకాలకు దరఖాస్తులను చేసుకోవాలని తెలిపారు. గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన సభలో దరఖాస్తులు సమర్పించలేని వారు జనవరి 6 వరకు తమ దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీ మాల, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మధుసూధన్ శర్మ, ఎంపీడీవో రాజు, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఎంపీవో సుదర్శన్, సర్పంచ్ ఎలగందుల శంకరయ్య, ఏపీఎం దివ్య, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కడార్ల శ్రీనివాస్, కట్కూరి సుధాకర్ రెడ్డి, నూగిళ్ళ మల్లయ్య, భూతగడ్డ సంపత్, ఉప్పు రాజు, కటికినపల్లి రవి, సతీష్, అమిరిషెట్టి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంపల్లిలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ముత్తారం:



దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

ప్రజా పాలన అభయహస్తం గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ సముద్రాల రమేష్, ఎంపీటీసీ అల్లం తిరుపతి, మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీ పథకాలలో భాగంగా గురువారం 5 గ్యారంటీల పథకాలను ప్రారంభించడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి నిరుపేద సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి అన్ని విధాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమాల కోసం రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో 6 గ్యారంటీలను బాధ్యతాయుతంగా అమలు చేసేందుకు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్, డీఎల్‌పీవో రాంబాబు, పంచాయితీ కార్యదర్శి సాగర్, గ్రామాల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

నవతెలంగాణ-ముత్తారం:



ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన దామ స్వామి కూతురు దామ అలేఖ్య అనారోగ్యంతో కరీంనగర్ అపెక్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు బాధితురాలిని ముత్తారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ శుక్రవారం పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

కరోనా కొత్త వేరియంట్‌పై కార్మికులకు అవగాహన

నవతెలంగాణ-గోదావరిఖని:



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య అధికారి

సింగరేణి ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ ఆదేశాల మేరకు సింగరేణి వైద్య ఆరోగ్య శాఖ, సింగరేణి ఏరియా ఆసుపత్రి డీవైసీఎంవో డాక్టర్ కిరణ్ రాజ్ సూచనలతో ఆర్జీ-1 పరిధిలోని జీడీకే సీఎం-2, 2ఎఅండ్ 5 ఉద్యోగులకు కరోనా కొత్త వేరియంట్‌పై ఏరియా ఆరోగ్య అధికారి డాక్టర్ ఎన్.సుమన్ శుక్రవారం అవగాహన కల్పించారు. కరోనా కొత్త వేరియంట్ ప్రజల్లో తీవ్ర ప్రభావాన్ని చూపుతున్న సందర్భంగా మాస్క్ ధరించాలని, సోషల్ డిస్టెన్స్‌ని పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో కాలరీస్ మేనేజర్ అనిల్ గబాలే, సేఫ్టీ ఆఫీసర్ పి.శ్రీనివాస్ తదితరులున్నారు.

బిట్ బిట్ డ్యాన్స్ అకాడమీ అవార్డ్స్ ప్రధానోత్సవం

నవతెలంగాణ-గోదావరిఖని:

గత 25 సంవత్సరాలుగా కళా రంగంలో విశిష్ట సేవలందిస్తున్న బిట్ బిట్ డ్యాన్స్ అకాడమీ నిర్వహణలో, దేవ కళా బృందం ఆధ్వర్యంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వారికి అవార్డులు ప్రధానం చేయనున్నట్లు అకాడమీ వ్యవస్థాపకులు తుమ్మల విజయ్, గ్రాండ్ మాస్టర్ పులిపాక దేవ, నిర్వాహకులు వీర్ల ప్రశాంత్, కంక సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, సామాజిక సేవ, కళా, సాహిత్య తదితర రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి విద్యారత్న, వైద్యరత్న, సేవారత్న, కళారత్న, సాహిత్యరత్న లాంటి అవార్డులతో ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. తమ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారు తమ సేవలకు సంబంధించిన పేపర్ క్లిప్స్, ఫోటోలు, బయోడేటాను జనవరి 5లోగా పులిపాక దేవేందర్, ఇంటి నెంబర్: 18-3-85/2/3/1, మార్కండేయ కాలనీ, గణేష్ నగర్ బోర్డు దగ్గర, గోదావరిఖని-505 209కి పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 917770 9591, 9866426371 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులకు ప్రతి పథకం చేరుతుంది

ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ నాయకత్వంలో డివిజన్‌ను అభివృద్ధి చేస్తాం

11వ డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్

నవతెలంగాణ-గోదావరిఖని:



దరఖాస్తులను స్వీకరిస్తున్న మేయర్

కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులకు ప్రతి పథకం చేరుతుందని రామగుండం నగర పాలక సంస్థ 11వ డివిజన్ కార్పొరేటర్, యూత్ కాంగ్రెస్ స్టేట్ సెక్రటరీ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్ అన్నారు. శుక్రవారం డివిజన్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని నగర మేయర్ డాక్టర్ అనిల్ కుమార్, తహసీల్దార్ కుమారస్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్జీదారులకు దరఖాస్తు ఫారంలను అందజేశారు.అనంతరం కార్పొరేటర్ తేజస్వి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన అభయహస్తం హామీ ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత అర్హులందరికీ పెన్షన్లు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఇంటి నిర్మాణానికి స్థలం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం ఉచితం, రైతుబంధు బీమా పెంపు లాంటి సంక్షేమ పథకాల కోసం ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ధరాకాస్తులను స్వీకరిస్తు న్నట్లు తెలిపారు. అర్హులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు.ఏసీపీ తుల శ్రీనివాస్ రావు నేతృత్వంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ మున్సిపల్ సిబ్బందితోపాటు అంగన్వాడీ టీచర్స్,ఆశా వర్కర్స్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం

ప్రజాపాలనలో పేదలందరికి సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే విజయరమణారావు

నవ తెలంగాణ-సుల్తానాబాద్ రూరల్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి,ఎలిగేడు మండ లంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు 6 గ్యారంటీల హామీల అమలు పట్ల చిత్తశుద్ధితో ఉన్నాం అని ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకం అందించడమే మా లక్ష్యమని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డ రెండు రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఆరోగ్య శ్రీ 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచామన్నారు. మహిళలందరికి ఉచిత బస్సు ప్రయాణం రెండు హామీలను నెరవేర్చామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణ్ శ్రీ, స్థానిక జడ్పీటీసీలు, ఎంపీపీలు సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికా రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

నవతెలంగాణ జూలపల్లి/ఎలిగేడు



ఎలిగేడు మండలం దూళికట్ట ఆమ్లెట్ గ్రామమైన నేతకాని పల్లె గ్రామానికి చెందిన దుర్గం అంజయ్యకు చెందిన ఆవు మేత కోసం వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. 60 వేల విలువ గల ఆవు మృతి చెందడంతో బాధితుడు కన్నీరుగా విలపించాడు. విద్యుత్ అధికారులు న్యాయం చేయాలని కోరాడు.

ఆరు గ్యారంటీలపై కళాజాత ప్రదర్శన

నవతెలంగాణ-హాజీపూర్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. మంచిర్యాల మున్సిపాలిటీలోని 15,16 వార్డులలో కళాకారులు ప్రజలకు ఆటపాటల ద్వారా పథకాలను వివరించారు. జనవరి 6 వరకు ప్రజా పాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వాళ్లందరికీ ఆరు గ్యారంటీ పథకాలను అందిస్తుందని ప్రజలు దరఖాస్తూ చేసుకొని రసీదు పొందాలని పాటల రూపంతో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు లావుడ్యా రమేష్, ముల్కల్ల మురళి, మామిళ్ళ లచ్చన్, వెళ్తారు పోశం, కొప్పర్తి రవీందర్, బీరుపూరి శ్రీనివాస్, సల్లూరి కిష్టయ్య, రామటెంకి రాజా తిరుపతి, గోడిసేలా క్రిష్ణ, లింగపల్లి రాజేష్, నాగలక్ష్మి సంధ్య మిట్టపల్లి, నిరోషాయాదవ్ పాల్గొన్నారు.

భారత్ గౌరవ్ సమ్మాన్ పురస్కార్‌కు ఎంపిక

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



జ్యోతి నగర్‌కు చెందిన న్యాయవాది డా. రాజలింగు మోతె భారత్ గౌరవ్ సమ్మాన్-2023 అవార్డుకు ఎంపికయ్యారు. సంఘసంస్కర్త, సమాజ ప్రభావశీలుడుగా ధృవీకరణ పత్రాన్ని ఆయన అందుకున్నారు. పట్టణంలోని సంఖ్యత కేంద్రం కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు కలువల సతీష్ కుమార్, శ్రీరాంపూర్ డివిజన్ బీఎంఎస్ నాయకులు అవునూరి రమేష్, పట్టణ దళిత నాయకులు మంతెన మధు పురస్కార గ్రహీతను సన్మానించారు. అనంతరం రాజలింగు మాట్లాడుతూ ఈ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు

కొనసాగుతున్న ప్రజా పాలన గ్రామ సభలు

నవతెలంగాణ-జైపూర్

మండలంలో గ్రామ పంచాయతీల వారిగా ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు నర్వ, టేకుమట్ల, షెట్‌పల్లి, గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు జరిగాయి. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీల అమలుకు సంబంధించి గ్రామీణుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామ పంచాయతీల సర్పంచుల అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామ సభలో ముందుగా ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించారు. అనంతరం కుటుంబాల వారిగా అర్హులైన వారి నుండి ధరఖాస్తులు స్వీకరించారు. గ్రామ పంచాయతీల వారిగా నియమితులైన అధికారులతో పాటు ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్, సర్పంచులు రాజకుమార్, గోనె సుమలత నర్సయ్య, మేడి రవిల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, తహసీల్దార్ రమేష్, ఎంపీఓ అనిల్ కుమార్, అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

భీమారంలో...

మండల కేంద్రంతో పాటు ఖాజీపల్లి, కొత్తపల్లి, మద్దికల్ గ్రామ పంచాయతీల్లో ప్రజా పాలన గ్రామ సభలు కొనసాగాయి. ఎంపీడీఓ శ్రీనివాస్ రావుతో పాటు తహసీల్దార్ విశ్వంబర్ గ్రామ సభల ద్వార ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించడంతో పాటు అర్హులైన వారు ఐదు గ్యారంటీ పథకాలు పొందేందుకు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభల్లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



జైపూర్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

రేషన్‌కార్డు లేకపోయినా ధరఖాస్తు చేసుకోవచ్చు

ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీ పథకాలకు ధరఖాస్తు చేసుకునే వారికి రేషన్ కార్డు లేకపోయినా అర్హత పొందిన పథకానికి అర్జీ పెట్టుకోవచ్చునని అధికారులు సూచించారు. ఆదరబాదరగా కాకుండా పూర్తి సమాచరంతో వచ్చే నెల 6 వరకు అర్జీలు పెట్టుకోవడానికి అవకాశం ఉన్నందున గ్రామీణులు తొందరపడవద్దని కోరారు. ధరఖాస్తు దారులు తమ అర్జీని సమర్పించిన వెంటనే అధికారి నుండి రశీదు స్వీకరించాలన్నారు.

కాసిపేట : మండలంలోని కాసిపేట, ముత్యంపల్లి, కోమటిచేను, బుగ్గగూడెం గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలను నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ముందుగా ఎంపీడీఓ ఎంఏ అలీం ప్రజా పాలన గ్రామ సభలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గంగారాం, తహసీల్దార్ బోజన్న, సర్పంచులు ఆడె బాదు, రాంటెంకి శ్రీనివాస్, దరావత్ దేవి, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, ఎంపీఓ నాగరాజు, హెచ్‌ఎంలు రాథోడ్ రమేశ్, సుధాకర్ నాయక్, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కాసిపేటలో..

పీహెచ్‌సీని సందర్శించిన జాతీయ తనిఖీ బృందం



నవతెలంగాణ-హాజీపూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జాతీయ నాణ్యత ప్రమాణాలు ధృవీకరణ కోసం జాతీయ స్థాయి ప్రత్యేక బృందం సందర్శించింది. ఈ బృందంలో డాక్టర్ సుప్రియ, డాక్టర్ సరస్వతి ఇతర అధికారులు పీహెచ్‌సీలోని ఓపీ సేవలు, ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ, ప్రయోగశాల, సాధారణ పాలన పరమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీ బృందం పీహెచ్‌సీ వస్తుందనే నేపథ్యంలో గురువారం నుండే ఆస్పత్రి రూపురేఖలు మారి పోయాయి. ముగ్గులు, మొక్కలతో ఆస్పత్రిలో ఎన్నడూ లేని విధంగా సుందరంగా ముస్తాబు చేశారు. ఎప్పుడు ప్రాంగణం చెత్తచేదారంతో నిండి ఉండేది. ఒక రోజు వ్యవధిలోనే ఆస్పత్రి శుభ్రం కావడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ సుబ్బారాయుడు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విజయ పూర్ణిమ, ఫయాజ్ ఖాన్, నీరజ, మండల వైద్యాధికారి లహరి పాల్గొన్నారు.

రేపు ఎడ్ల పందాలు

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గుడిపేట్ గ్రామంలో ఆదివారం ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తిప్పని మహేష్ తెలిపారు. గుడిపేట్ గ్రామ శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద పాత గుడిపేట్‌లో కిలోమీటర్ దూరంలో ఈ పోటీలుంటాయన్నారు. ఉత్సాకులు, పోటీలో పాల్గొనే వారు ఉదయం 9 గంటలలోపు వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 96666369905, 9652596586ను సంప్రదించాలని కోరారు. మొదటి బహుమతి 3 గ్రాముల బంగారం, రెండవ బహుమతి రూ.5 వేలు, మూడవ బహుమతి రూ.3 వేల నగదు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేతుల మీదుగా అందించనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ఆవిష్కరించారు. అనంతరం కళాశాలలో మద్యం, డ్రగ్స్, మత్తు పానీయాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్ హాజరై మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి కఠిన శిక్షాలుంటాయన్నారు. జీవితంలో కష్టాలను అధిగమిస్తూ ముందుకు సాగాలన్నారు. యువత జీవితాన్ని నాశనం చేసుకోకుండా, విద్య, ఉపాధి తదితర అంశాలపై దృష్టి సారించి భవిష్యత్‌లో మంచి ఉన్నత స్థాయిలో ఉండాల నిసూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు బండ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ విజిత్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయాస్తం 6 గ్యారంటీ స్కీంలను అమలు చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రజల వద్దకే అధికారులను పంపి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి పేదోడికి ప్రభుత్వ పథకాలు అందేల చూస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలకు ఏమి చేయలేదని ఆరోపించారు. ప్రతిపక్షాలు, అధికారులు, పాలక పక్షాలు సమన్వయంతో పని చేసినప్పుడే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రతిపక్షాలు ప్రశ్నించాలని, పాలక పక్షం పని చేసి చూపించాలన్నారు. ఆరు గ్యారెంటీ స్కీంలలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు చెందకుండా జనవరి 6 వరకు తమ దరఖాస్తులను చేసుకోవచ్చని తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యేగా 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, తహసీల్దార్ వేణుగోపాల్, సర్పంచి జక్కు భూమేష్, పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, నాయకులు మోహన్ రెడ్డి, ముత్యం రాజన్న, మత్య శంకరయ్య, మిక్కిలినేని రాజశేఖర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్, దుమల రమేష్, మామిడిపల్లి ఇంద్రయ్య, దాముఖ కరుణాకర్, ఇసాక్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఫసిఉల్లా, సుధాకర్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ముత్యం సతీష్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సోహెల్ అహ్మద్, బీరవేణి రాజన్న యాదవ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించిన అధికారులు..

మండలంలోని తిమ్మాపూర్, మురిమడుగు, ఇంధన్‌పల్లి గ్రామాల్లో ఎంపీడీఓ అరుణాని, తహసీల్దార్ వేణుగోపాల్, పీఈఓ రమేష్ అభ హస్తం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. సిబ్బందితో పాటు ప్రజలకు పలు సూచనలు చేశారు. తిమ్మాపూర్, మురిమడుగు, ఇంధన్‌పల్లి సర్పంచులు జడి గంగాధర్, భాగ్యలక్ష్మి రాజలింగు, కంటెం సునీత శంకర్, కార్యదర్శులు చంద్రమౌళి, జంగు, లావణ్య పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు వారధులు పత్రికలే

- ప్రెస్‌క్లబ్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదులు పత్రికలేనని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా క్యాలెడర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇండ్ల నిర్మాణాలపై వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలో ప్రింట్ మీడియా విలేకరులకు ఇంటి స్థలాలతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యేను ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నరసయ్య కోరారు. ప్రెస్ భవనం అసంపూర్తిగా ఉందని రూ. ఐదు లక్షల కేటాయించాలని విన్నవించడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి విలేకరుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి గాజుల లింగన్న గౌడ్, గౌరవ అధ్యక్షులు మందపల్లి కాంతయ్య కోశాధికారి షీలా చంద్రశేఖర్, ప్రచార కార్యదర్శి జాడి వెంకటయ్య, సంయుక్త కార్యదర్శి సత్యం, అమరగొండ సతీష్, కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముసఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, పార్టీ నాయకులు రాజశేఖర్, దాముఖ కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపైనే పోరాటం : మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-హాజీపూర్

ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపైనే పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. శుక్రవారం వేంపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తూ ఓటమికి ఏ మాత్రం కుంగిపోకుండా నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. 4 పర్యాయాలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేశానని పేర్కొన్నారు. తాను గతంలో తీసుకువచ్చిన అభివృద్ధి పనులే ఇప్పుడు నియోజకవర్గ పరిధిలో జరుతున్నయన్నారు. గతంలో కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని 324 సర్వే నంబర్‌లో అవినీతి జరిగిందని, ఎకరాల భూమి కబ్జాకు గురైందని ఆరోపించారు. ఇపుడు అధికారం వారి చేతుల్లోనే ఉందని ఆ సర్వే నంబర్ అవినీతిని బయటకు తీయాలని సవాల్ చేశారు. 20 ఎండ్లు ఎమ్మెల్యేగా ప్రజలకు జవాబుదారీగా పనిచేశానని తెలిపారు. రాబోవు ఏడాది ఎన్నికల కాలం కాబట్టి పార్టీ శ్రేణులు గత జ్ఞాపకాలను మార్చి ప్రతి ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. పార్టీ మారిన అవకాశ వాదులకు గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట్, మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మెనులు కాంతయ్య, పెంట రాజయ్య, ప్రభాకర్, నడిపెల్లి విజిత్ రావు, మండల అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్, గాదె సత్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

ప్రజాపాలనలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల కోసం ఏర్పాటు చేసినా ప్రజాపాలన కార్యక్రమం మండలంలోని బిర్సాయిపేట గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని, ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి ఈ పతకాలు అందేలా అధికారులు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ప్రజాధనం వృథా



ప్రాజెక్టు సందర్శనలో మంత్రులతో ఎమ్మెల్యే గడ్డం వివేక్

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్-మంథని సరిహద్దుల్లో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో గత ప్రభుత్వం ప్రజా ధనం వృధా చేసిందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. శుక్రవారం రాష్ట్ర మంత్రులతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు ఆయన సందర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌లో లోపాలున్నాయని ఆయ పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పట్ల మొదటి నుండి వ్యతిరేకతలు ఉన్నప్పటికి కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడ ప్రాజెక్టును నిర్మించిందని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో పెద్దపల్లి మాజీ ఎంపీ సీడబ్ల్యూసీ మెంబర్ గడ్డం వెంకటస్వామి ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు నిర్మాణం కోసం కృషి చేశారని గుర్తు చేశారు. రూ. 38 వేల కోట్లతో 152 మీటర్ల ఎత్తుతో ప్రభుత్వం ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినప్పటి నుండి చెన్నూర్ నియోజకవర్గం పరిధిలో గల చెన్నూర్, కోటపల్లి, జైపూర్ మండలాల శివారుల్లో వందల ఎకరాల్లో వ్యవసాయ భూములు నీట మునుగుతున్నాయన్నారు. నాలుగు సంవత్సరాలుగా కళేశ్వరం బ్యాక్ వాటర్ కారణంగా గోదావరి తీరంలో రైతులు పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. బాధితులకు న్యాయం చేయడం కోసం ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవడంతో పాటు బ్యాక్ వాటర్ ఇబ్బందులు శాశ్వతంగా పరిష్కరించాలని మంత్రులను కోరారు. అనంతరం మంత్రులను ఆయన సన్మానించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు



నవతెలంగాణ-బోథ్

డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కను శుక్రవారం బోథ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మల్లెపూల సత్యనారాయణ, పోచ్చెర సర్పంచ్ బూరుగుల మల్లేష్, హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పరిస్థితులను, రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన డిప్యూటీ సీఎం, సీఎంతో చర్చించి వచ్చే బడ్జెట్ సమావేశంలో బిల్లు ప్రవేశ పెట్టేందుకు హామ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకుడు నల్ల శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-కాసిపేట

ఎన్‌పీసీ(న్యాక్), ఈజీఎంఎం-డీడీయూజీపై వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు 3 నెలల ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ న్యాక్, ఆదిలాబాద్ నాగేంద్రన్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రికల్ అండ్ హౌజ్ వైరింగ్, 10వ తరగతి ఫెయిల్ లేక పాస్ అయిన వారికి ప్లంబింగ్ అండ్ సానిటేషన్‌పై శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు గల యువత అర్హులని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హస్టల్ వసతి, బుక్స్, యూనిఫాం, షూస్, హెల్మెట్ అందిస్తామన్నారు. అసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, అర్హత సర్టిఫికెట్, కులధృవీకరణ పత్రాల జిరాక్స్, పాస్‌ఫోటోలు5 తీసుకోని ఐటీడీఏ, వైటీసీ బిల్డింగ్, తాళ్లగురిజాలరోడ్, సోషల్ వేల్ఫేర్ స్కూల్ బెల్లంపల్లి సమీపంలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 8328507232, 99661100452లో సంప్రదించాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

నవతెలంగాణ-జైపూర్

గ్రామీణుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత శాఖ అధికారులు సూచించారు. భారత్ వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భీమారం మండల కేంద్రంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఎంపీడీఓ శ్రీనివాస్ రావు, సర్పంచ్ గద్దె రాంరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్న యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవన జ్యోతి భీమా తదితర పథకాల ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా ఈ పథకాల ద్వార ప్రయోజనం పొందిన ప్రజల మనోభావాలను అడిగి తెలుసుకున్నారు.



టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏ.స్వామి, జిల్లా కార్యదర్శి శ్యామ్ అధ్యక్షతన మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా భగత్ బాపూరావ్, ప్రధాన కార్యదర్శులుగా ఎం.రాజేందర్, ఉపాధ్యక్షులుగా ఆర్.జ్ఞానేశ్వర్, కే.లక్ష్మి, కోశాధికారిగా ఆర్.మనోజ్, కార్యదర్శులుగా ఎస్‌కె అశ్రాఫ్, సోనేరావు, సుకుమార్, గంగామణి, ఆడిట్ కన్వీనర్ పి.మల్లయ్య, సోషల్ మీడియా కన్వినర్ ఆర్.అశ్విన్, పత్రికా కన్వినర్‌గా జీవన్‌లను ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్ యూటీఎఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

కేజ్రీవాల్ అభ్యర్థనను తిరస్కరించిన రాజ్యసభ చైర్మెన్

న్యూఢిల్లీ : పార్లమెంట్ ఎగువ సభలో ఆప్ మధ్యంతర నేతగా రాఘవ్ చద్దాను నియమించాలన్న ఆప్ అభ్యర్థనను రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ తిరస్కరించారు. విజ్ఞప్తిని తిరస్కరిస్తున్నట్టు ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు రాజ్యసభ చైర్మెన్ లేఖ రాసినట్టు సంబంధిత వర్గాలు శుక్రవారం పేర్కొన్నాయి. పార్లమెంటు (సౌకర్యాలు) చట్టం 1998 లోని గుర్తింపు పొందిన పార్టీల నేతలు మరియు చీఫ్ విప్ నిబంధనలు మరియు దానికింద అమలు చేసిన నిబంధనలకు లోబడి ఈ ఎంపిక ఉంటుంది. ఈ విజ్ఞప్తి చట్టానికి అనుసరించిలేదనీ, ఇది ఆమోదయోగ్యం కాదని ధన్‌ఖర్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఫ్లోర్ లీడర్ సంజయ్ సింగ్ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నందున రాఘవ్ చద్దాను రాజ్యసభలో ఆప్ తాత్కాలిక నేతగా నియమించాలని ఈ నెల ప్రారంభంలో కేజ్రీవాల్ రాజ్యసభ చైర్మన్‌ను కోరారు. నిబంధనలు పేరుతో కేజ్రీవాల్ అభ్యర్థనను ధన్‌ఖర్ తిరస్కరించడంతో.. రాజ్యసభలో ఆప్ నేతగా సంజయ్ సింగ్ కొనసాగనున్నారు.

మావో ఆలోచనలే నేటికీ మార్గదర్శకాలు

- 139 జయంతి వేడుకలో జిన్‌పింగ్



బీజింగ్ : విప్లవనాయకులు మావో జెడాంగ్ ఆలోచనలే నేటికీ చైనాకు మార్గదర్శకాలని ఆ దేశ అధ్యక్షులు జిన్‌పింగ్ స్పష్టం చేశారు. మావో జెడాంగ్ 130వ జయంతి సందర్భంగా చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) సెంట్రల్ కమిటీ గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్‌లో సింపోజియ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిన్‌పింగ్ మాట్లాడుతూ మావో జెడాంగ్ ఆలోచనలు పార్టీకి, దేశానికి అమూల్యమైన సంపదని అన్నారు. మావో జీవితమంతా దేశశ్రేయస్సు, పునరుజ్జీవనం, ప్రజల ఆనందానికి అంకితం అయిందని తెలిపారు. మావో స్ఫూర్తి భావితరాలకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని చెప్పారు. మన నూతన ప్రయాణంలో మావో లక్ష్యాలను ఎప్పటికీ మరిచిపోకూడదని అన్నారు. మార్క్సిజాన్ని చైనాకు అనుకూలంగా మార్చడంలో మావో ప్రాధాన్యతను గుర్తు చేశారు. అధునాతన సోషలిస్టు వ్యవస్థను స్థాపించడంలోనూ, అజేయమైన చైనా ప్రజల సైన్యం యొక్క కొత్త నమూనాను స్థాపించడంలో మావో కీలకపాత్ర పోషించారని అన్నారు. చైనా దేశానికి, చైనా ప్రజలకు మావో చెరగని చారిత్రాత్మక సేవలను అందించారని, ఇది చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రయంలో సీపీసీ సెంట్రల్ కమిటీ పొలిటికల్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యులు లి కియాంగ్, జావో లెజి, వాంగ్ హునింగ్, డింగ్ జుక్సియాంగ్, లి జి, వైస్ ప్రెసిడెంట్ హాన్ జెంగ్ సింపోజియమ్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సీపీసీ సెంట్రల్ కమిటీ పొలిటికల్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యులు కై క్వి అధ్యక్షత వహించారు.

50 ఏండ్లకే వృద్ధాప్య పింఛన్

జార్ఖండ్ ప్రభుత్వ నిర్ణయం

రాంచీ : వద్ధాప్య పింఛన్ వయస్సును పదేండ్లకు తగ్గిస్తున్నట్టు జార్ఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటయి నాలుగేండ్లు అయిన సందర్భంగా శుక్రవారం రాంచీలోని మొరదబడి మైదానంలో జరిగిన ఓ కార్యక్రమంలో జార్ఖండ్ ముక్తి మోర్చా చీఫ్, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రెండు కీలక ప్రకటనలు చేశారు. దళితులు, గిరిజనులకు వద్ధాప్య పింఛను అర్హత వయస్సును 60 నుంచి 50 ఏండ్లకు తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో స్థాపించే కంపెనీల్లో 75శాతం ఉద్యోగాలు స్థానికులకు రిజర్వ్ చేయబడతాయన్నారు. జార్ఖండ్ దేశంలోనే అత్యంత పేద దేశమని, కొవిడ్ సంక్షోభంతో ఇప్పటికి పోరాడుతున్నామని అన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వంలో ఎలాంటి గందరగోళం లేదని సోరెన్ పేర్కొన్నారు. జార్ఖండ్ వంటి పేద రాష్ట్రాలు ఇతర రాష్ట్రాలకు ఆక్సిజన్ సరఫరా చేశాయని అన్నారు. మహమ్మారి సమయంలో పేద కార్మికులు రక్షించబడ్డారని, అయితే ఇద్దరు మంత్రులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. 2000లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కేవలం 16 లక్షల మంది మాత్రమే పింఛను ప్రయోజనాలను పొందారని, అయితే తన నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం 36 లక్షల మందికి పింఛను అందించిందని పేర్కొన్నారు. కాగా, అధికార కూటమిలో కాంగ్రెస్ కూడా భాగంగా ఉంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో గత బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం అన్నింటినీ నాశనం చేసిందని, ఆ సర్కారు హయంలో రైతులు మరణించారని అన్నారు. తన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన జార్ఖండ్‌ను ఢిల్లీ లేదా రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి కాకుండా గ్రామాల నుంచి పరిపాలిస్తామని అన్నారు. రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వంలో కాంగ్రెస్ కూడా భాగమేనన్నారు. స్థానికులకు ఉద్యోగాల వాగ్దానాల రూపురేఖలు ఇంకా స్పష్టంగా తెలియనప్పటికీ, పంజాబ్, హర్యానా హైకోర్టు గత నెలలో హర్యానాలో ఇదే విధమైన చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ కొట్టివేసింది. ఈ చట్టం వెనుక ఉన్న నేల పుత్రులు అనే భావన యజమానుల రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమేనని పిటిషనర్లు వాదించారు.

మణిపూర్ గాయకుడు అఖు చింగాంగ్‌బామ్ కిడ్నాప్, విడుదల

ఇంఫాల్: మణిపూర్‌కు చెందిన గాయకుడు, గీత రచయిత అఖు చింగాంగ్‌బామ్‌ను సాయుధ దుండగులు శుక్రవారం కిడ్నాప్ చేశారని, ఆ తరువాత విడుదల చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన బంధువుల కథనం ప్రకారం... ఇంఫాల్‌లోని అఖు ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి, ఆయన భార్య, తల్లిని గన్‌పాయింట్‌లో ఉంచి, ఆయనను కిడ్నాప్ చేశారు. అనంతరం ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో ఆయన నివాసానికి 20 కిలోమీటర్ల దూరంలో విడిచిపెట్టారు. ఈ విషయాన్ని పోలీసులు నిర్ధారించారు. కిడ్నాపర్లు తమను డబ్బు డిమాండ్ చేయలేదని, అఖు కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ఆయన బంధువు తెలిపారు. అఖును గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని, ఆ తరువాత విడిచిపెట్టారని తమకు సమాచారం అందిందని పోలీసు అధికారి ఒకరు చెప్పారు.

నకిలీ ఔషధాల రాకెట్ గుట్టురట్టు

- పువ్వాడ లక్ష్మణ్ తదితరులు అరెస్ట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి నకిలీ ఔషధాల రాకెట్‌ను ఛేదించింది. యాంటీ బయాటిక్స్, హైపర్ టెన్షన్, కొలెస్ట్రాల్ తదితర ఔషధాలకు బ్రాండెడ్ ఫార్మా కంపెనీల లేబుళ్లను అతికించినట్టు అధికారులు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ట్రాకన్ కొరియర్స్ ప్రయివేట్ లిమిటెడ్ ద్వారా వస్తున్నట్టు తెలుసుకున్నారు. దీంతో హైదరాబాద్‌లోని దిల్‌సుక్‌నగర్, ఉప్పల్‌లోని సదరు కొరియర్ కార్యాలయాలపై దాడి చేసి 14.5 కిలోలు, 13.34 కిలోల కంటైన్లను గుర్తించారు. ఇవి ఉత్తరాఖండ్ రాంనగర్‌రోడ్‌లోని అమర్ ఫార్మాస్యూటికల్స్ నుంచి హైదరాబాద్ లోని పువ్వాడ లక్ష్మణ్ కోసం పంపించినట్టు తెలుసుకున్నారు. దీంతో పువ్వాడ లక్ష్మణ్ ఫోన్ నెంబర్ ద్వారా దిల్‌సుక్‌నగర్‌లోని శివగంగ థియేటర్ సమీపంలోని బార్ వద్ద ఉన్నట్టు తెలుసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. పువ్వాడకు చెందిన దిల్‌షుక్ నగర్, ద్వారకాపురంలోని శ్రీ వెంకటేశ్వర ఎంటర్ ప్రైజెస్ గోదాంలపై దాడి చేసి ఉత్తరాఖండ్ కాశీపూర్ నుంచి తెప్పించిన రూ.26 లక్షల విలువైన ఎనిమిది రకాల ఔషధాలను ఉన్నట్టు నిర్ధారించుకున్నారు. పువ్వాడను విచారించి, అతని సహచరులైన సైదాబాద్‌కు చెందిన పోకల రమేష్, గారపల్లి పూర్ణచందర్ లు ఉత్తరాఖండ్ లోని నదీం నుంచి నకిలీ ఔషధాలను తెప్పించే రాకెట్ లో ఉన్నట్టు గుర్తించారు.

జమ్ము కాశ్మీర్, లడఖ్‌లకు న్యాయం జరగలేదు

- ఆర్టికల్ 370 రద్దును సమర్థించడంపై రివ్యూ పిటిషన్
- త్వరలో సుప్రీంకోర్టులో దాఖలు చేస్తాం : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు యూసఫ్ తరిగామి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్టికల్ 370 రద్దును సమర్థించే నిర్ణయానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు మహమ్మద్ యూసఫ్ తరిగామి వెల్లడించారు. ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజంలోని భాగస్వామ్యవాదులతో కలిసి సుప్రీంకోర్టులో త్వరలో రివ్యూ పిటిషన్ వేస్తామని చెప్పారు. డిసెంబర్ 11న ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 1019 ఆగస్టు 5న జారీ చేసిన రాష్ట్రపతి ఉత్తర్వుతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది.

ఈ నేపథ్యంలో తరిగామి జమ్మూ కాశ్మీర్‌లో మీడియాతో మాట్లాడారు. 'తలుపులు తెరిచి ఉన్నాయి. మన కోసం తలుపులు తెరుచుకోవడం లేదని మనం ఎందుకు అనుకోవాలి. గతంలో, ఆర్టికల్ 370 రద్దుపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ మేం సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పుడు, చాలా మంది నిరాశావాదులు, మమ్మల్ని నిరుత్సాహపరిచారు' అన్నారు. 'కానీ రాజకీయ నాయకుడిగా, ఈ దేశ పౌరుడిగా, రివ్యూ పిటిషన్ దాఖలు చేసే అవకాశముంది. కొందరు రిటైర్డ్ న్యాయమూర్తులూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది' అని ఆయన అన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో తీవ్ర అన్యాయం జరిగింది. ఇది జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రజల ప్రాథమిక రాజ్యాంగ హక్కులపై దాడి అని తరిగామి అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాలంటూ అప్పీలు చేస్తాం. మా చర్చలు కొనసాగుతున్నాయి. దరఖాస్తులు పరిశీలించబడుతున్నాయి' అని ఆయన అన్నారు.

'తప్పుదోవ పట్టించే కథనాలు'

జమ్మూ కాశ్మీర్‌ను పీడిస్తున్న ఉగ్రవాదం, ఇతర దుష్పరిణామాలకు ఆర్టికల్ 370 కారణమని తప్పుడు కథనంపై తరిగామి విచారం వ్యక్తం చేశారు. కేంద్రంలోని వరుస పాలనల వల్ల ఆర్టికల్ 370 క్రమంగా క్షీణించిందని, ప్రజాస్వామ్య ప్రక్రియను ఢిల్లీ ప్రభావితం చేసి, చివరికి ఆర్టికల్ 370 'బొమ్మ'గా మార్చిందని ఆయన విమర్శించారు. ఆర్టికల్ 370 రద్దును సమర్థించేందుకు తప్పుదారి పట్టించే కథనాలు నిర్మించారని తరిగామి దుయ్యబట్టారు. 'జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ 2017లో జీఎస్టీని ఆమోదించడం ఇటీవలి కాలంలో అలాంటి ఉదాహం 'ఇలలో ఒకటి. ఆర్టికల్ 370ని ఆమోదించే సమయ ంలో ఊహించని విధంగా 42 రాజ్యాంగ ఉత్తర్వులు కేంద్ర జోక్యం పరిధిని పొడిగించాయి' అని తెలిపారు.

డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై ఉక్కుపాదం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

'రాష్ట్రంలో పెరిగిపోతున్న డ్రగ్స్, సైబర్ నేరాలు మహిళలపై వేధింపులు అరికట్టడానికి పోలీసు శాఖ జీరో టాలరెన్స్‌తో వ్యవహరిస్తున్నది. పోలీసు శాఖలో పోస్టింగ్‌లు, పదోన్నతుల్లో ఎలాంటి పైరవీలకు ఆస్కారమివ్వం. మావోయిస్టులు, ఉగ్రవాదుల కార్యకలాపాలపై డేగ కన్ను వేస్తాం. పేద ప్రజలకు అండదండగా నిలుస్తాం. రాష్ట్ర పోలీసు శాఖ ప్రతిష్టను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం' ఇది మా పోలీసు శాఖ వచ్చే ఏడాదిలో ఎంచుకున్న ప్రధాన లక్ష్యాలు అని రాష్ట్ర పోలీసు శాఖ చీఫ్ డాక్టర్ రవిగుప్తా ప్రకటించారు. రాష్ట్రంలో ఈ ఏడాది శాంతిభద్రతలు, నేరాలపై వార్షిక నివేదికను విలేకరుల సమావేశంలో రవి గుప్తా శుక్రవారం ఆవిష్కరించారు. శాంతిభద్రతలు, నేరాలకు సంబంధించి గతేడాదితో పోలుస్తూ అనేక అంశాలను వివరించారు.ప్రజావాణి, ప్రజా పాలన అన్న ప్రభుత్వ నినాదానికి అనుగుణంగా అధికారులు రోజువారి విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశామని రవిగుప్తా తెలిపారు. పోలీసు సాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ చట్ట ప్రకారం న్యాయం చేస్తామనీ, మరీ ముఖ్యంగా అణగారిన వర్గాల ప్రజలకు మరింత చేరువవుతామని చెప్పారు. బేసిక్ పోలిసింగ్ విధానంలో ప్రజ లకు దగ్గరవుతామనీ, నేరాల నియంత్రణపై దృష్టి సారిస్తామని తెలిపారు. 2024లో డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల జీరో టాలరెన్స్ విధానం అనుసరి స్తామని డీజీపీ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీ (ఏడీసీ)లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్స్‌తో సంబంధమున్నవారిపై చట్టప్రకారం చర్యలుంటాయనీ, పీడీ యాక్ట్ నమోదు చేయటంతో పాటు ఆస్తులు అటాచ్ చేస్తామని హెచ్చరించారు.

గతంతో పోలిస్తే 2023లో నేరాల సంఖ్యలో స్వల్ప పెరు గుదల నమోదె ందన్న డీజీపీ.. అందుకు కారణం సైబర్ నేరాలు పెరగటమేనని చెప్పారు. ఈ ఏడాది పండు గలు, ఎన్నికలు ప్రశాం తంగా జరిగాయని తెలిపారు. బేసిక్ పోలీసింగ్ ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రజల రక్షణే ధ్యేయంగా పని చేస్తామని డీజీపీ తెలిపారు. పోలీసులు డ్రగ్స్, సైబర్ నేరాలు అనే రెండు ప్రధాన సవాళ్లను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందనీ, అందుకు తగ్గ వనరులు సమకూర్చి ఇటీవలే ఏడీజీ స్థాయి అధికారిని నియమించిందని తెలిపారు. మావోయిస్టు కదలికల్ని సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామనీ, మావోయిస్టు ప్రభావిత మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో పటిష్ట భద్రత కొనసాగిస్తున్నామని చెప్పారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని డీజీపీ తెలిపారు. ఈ ఏడాది కొత్తగా 14 జిల్లాల్లో భరోసా కేంద్రాలు విస్తరించామన్నారు. షీ టీమ్స్‌కు 10766 ఫిర్యాదులు అందాయనీ, 850 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని చెప్పారు.

మహిళలపై పెరిగిన నేరాలు

మహిళలపై నేరాల్లో పెరుగుదల నమోదైంది. గతేడాది 18075 కేసులు నమోదు కాగా.. 2023లో ఆ సంఖ్య 19,013గా ఉన్నది. ఈ ఏడాది మహిళలపై నేరాలు 5.19 శాతం పెరిగాయి. వరకట్న వేధింపుల్లో 4.27 శాతం పెరుగుదల నమోదైంది. లైంగికదాడులు 2284, వరకట్న హత్యలు 33, వరకట్న వేధింపులతో మృతి చెందినవారు 132 మంది, వరకట్న వేధింపులు 9458, హత్యలు 213, కిడ్నాప్‌లు 884 కేసులు నమోదయ్యాయి. చిన్నారులపై లైంగిక వేధింపుల కేసుల్లో 0.24 శాతం తగ్గుదల నమోదైంది. కాగా, రాష్ట్రంలో ఐసిస్ ఉగ్రవాదుల కదలికలను మొదట ఎన్ఐఏ కనిపెట్టటంపై విలేకరులు వేసిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ఈ విషయంలో రాష్ట్ర ఇంటెలిజెన్స్ వ్యవస్థ సైతం ఎన్ఐఏతో సమన్వయమై పని చేస్తున్నదని డీజీపీ స్పష్టం చేశారు. మావోయిస్టుల కదలికల పైన సరిహద్దు రాష్ట్రాలతో సమన్వయమై రాష్ట్ర పోలీసులు పని చేస్తున్నారని ఆయన మరో ప్రశ్నకు జవాబిచ్చారు. ఓడిపోయిన తాజా మాజీ ఎమ్మెల్యేలకు సెక్యూరిటీని తగ్గించారని ఆయన దృష్టికి తీసుకురాగా.. ఆ అంశం పూర్తిగా సెక్యూరిటీ రివ్యూ కమిటీ విచారించి తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐపీఎస్ అధికారులు సంజయ్‌కుమార్ జైన్, షికా గోయెల్, విజయ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేరాలు, సైబర్ క్రైమ్ పెరుగుదల.. తగ్గిన శిక్షలు

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నేరాల్లో పెరుగుదల నమోదైంది. ఈ సారి నవంబర్ చివరి వరకు 41,511 కేసులు పెరిగాయి. 2022తో పోలిస్తే మొత్తం కేసుల్లో పెరుగుదల 9 శాతంగా ఉన్నది. ఈ ఏడాది మొత్తం ఆస్తి నష్టం రూ. 151.78 కోట్లు కాగా.. రూ. 80.81 కోట్లు రికవరీ అయ్యాయి. గతేడాది రికవరీ రేటు 50 శాతం ఉండగా.. ఈ సారి 53.82 శాతానికి పెరిగింది. సైబర్‌క్రైమ్‌లో 18 శాతం పెరుగుదల నమోదైంది. గతేడాది 13895 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 16339 కేసులు నమోదయ్యాయి. గతేడాది 168 కేసుల్లో జీవిత ఖైదు పడగా.. అది ఈ సారి 232 కేసుల్లో ఉన్నది. అన్ని కేసుల్లో శిక్షల శాతం ఈ ఏడాది 41 శాతంగా ఉన్నది. గతేడాది ఇది 43 శాతంగా ఉంటే.. ఈ సారి 2 శాతం తగ్గుదల నమోదైంది.

మహాలక్ష్మి పథకాన్ని వ్యతిరేకిస్తూ..గజ్వేల్‌లో ఆటో కార్మికుల నిరసన

- ఆర్టీసీలో ఉద్యోగం కల్పించండి

నవ తెలంగాణ -గజ్వేల్

మహాలక్ష్మి పథకాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం గజ్వేల్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. 500 ఆటోలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం అమలు చేయడంతో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ఆటో డ్రైవర్లను ఆర్టీసీలో డ్రైవర్‌గా, హెల్పర్‌గా తీసుకోవాలన్నారు. ఆటో సేవలను ప్రభుత్వ సంస్థలో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోయిన ఆటో డ్రైవర్లను త్వరలో ఆదుకోవాలన్నారు. లేదంటే ఆటో కార్మికులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. తమకు న్యాయం చేయాలని, లేకుంటే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- ఐలు మహాసభలో మాజీ న్యాయమూర్తి ఎస్. మురళీధర్
- ఘనంగా ప్రారంభమైన ఐలు 14వ అఖిల భారత మహాసభ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మతోన్మాదం, మతపరమైన ధ్రువీకరణ శాంతి భద్రతలకు ముప్పు తెచ్చాయని పంజాబ్, ఒరిస్సా, హర్యానా రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి ఎస్. మురళీధర్ అన్నారు. దేశ ప్రజలు అయోమయంలో ఉన్నారనీ, వారికి దారి చూపాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అన్నదే నేటి నినాదమని తెలిపారు.

పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా నగరంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు)14వ మహాసభ గురువారం ప్రారంభమైంది. ఈ మహాసభను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దీపక్ గుప్తా ప్రారంభించారు. పశ్చిమ బెంగాల్ మాజీ న్యాయశాఖ మంత్రి, ఐలు సీనియర్ నాయకుడు రబిలాల్ మైత్రా పతకావిష్కరణ చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఆహ్వాన సంఘం కమిటీ చైర్మెన్ జస్టిస్ ఎకె గంగూలీ స్వాగతోపన్యాసం చేశారు. ప్రారంభ సమావేశానికి ఐలు ఆలిండియా అధ్యక్షుడు బికాష్ రంజన్ భట్టాచార్య అధ్యక్షత వహించారు. ఐలు ప్రధాన కార్యదర్శి పివి సురేంద్రనాథ్ కార్యాచరణ నివేదికను సమర్పించారు.

అంతకు ముందు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి ఎస్. మురళీధర్ మాట్లాడుతూ 'చట్టం, ప్రజాస్వామ్యం' అనే అంశంపై మాట్లాడారు. ప్రజలందరికీ న్యాయం అందాలని, అందుకోసం ఐలు పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో చట్టం చాలా కీలకమైందన్నారు. అట్టడుగు వర్గాల వారికి చట్టాలు అందుబాటులోకి రావాలని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే మహాసభకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

ఘనంగా ప్రారంభమైన ఐలు 14వ అఖిల భారత మహాసభ

ఐలు 14వ అఖిల భారత మహాసభ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హౌరా నగరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అశోక్ బికాష్ మంచ్, నారా నారాయన్ గుప్తా నగర్‌లో మతోన్మాదంపై పోరాటం, సేవ్ రాజ్యాంగం, సేవ్ ప్రజాస్వామ్యం నినాదంతో ఈ మహాసభలు జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు తమ తమ రాష్ట్రాల్లో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై జరిగే పోరాటలను వివరించారు.

నివేదికపై చర్చలు...

శుక్రవారం రెండో రోజు ప్రధాన కార్యదర్శి నివేదికపై సాధారణ చర్చలో 26 రాష్ట్రాల నుంచి 81 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చర్చకు ఐలు ప్రధాన కార్యదర్శి పివి సురేంద్రనాథ్ శనివారం సమాధానమిస్తారు. అనంతరం అఖిల భారత కమిటీ ఎన్నికతో మహాసభ ముగుస్తుంది.

మీడియా స్వేచ్ఛపై దాడి

దేశంలో మీడియా స్వేచ్ఛపై దాడి జరుగుతుందని టెలిగ్రాఫ్ దినపత్రిక ఎడిటర్ ఆర్. రాజగోపాల్ అన్నారు. ఐలు మహాసభలో మీడియా స్వేచ్ఛ, ఆధిపత్యం అనే అంశంపై జరిగిన సెమినార్‌లో టెలిగ్రాఫ్ దినపత్రిక ఎడిటర్ ఆర్ .రాజగోపాల్ మాట్లాడారు.

మీడియాలో ఆధిపత్యం పెరిగిపోయిందని అన్నారు. కొంత మంది చేతుల్లోనే ప్రధాన మీడియా స్రవంతి ఉందని, ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయని అన్నారు. మీడియా రంగంలోకి కార్పొరేట్ దిగ్గజాలు ప్రవేశించి, మీడియా విలువలను దిగజార్చాయని విమర్శించారు. ప్రభుత్వాల కనుసన్నల్లో మీడియా సంస్థలు నడుస్తున్నాయని తెలిపారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెళ్తే దాడులను ఎదుర్కొన్నాయని చెప్పారు. జర్నలిస్టులపై కూడా దాడులు పెరిగాయని, జర్నలిస్టులు హత్యలకు గురవుతున్నారని తెలిపారు. మీడియా రంగం సమూలంగా మారిందని, వాస్తవికతకు దూరంగా ఉందని అన్నారు.

ప్రజా సంఘాల సందేశాలు

ఎస్ఎఫ్ఐ అఖిల భారత కార్యదర్శి మయూఖ్ బిస్వాస్, మహిళా సంఘం అఖిల భారత కార్యదర్శి కొణినికా ఘోష్, పీపుల్స్ రిలీఫ్ కమిటీ కార్యదర్శి ఫువాద్ హలీమ్ తదితరులు సౌహార్థ సందేశాలు ఇచ్చారు.

పలు తీర్మానాలు ఆమోదం

పాలస్తీనా ఆక్రమణను ఖండిస్తూ, మహిళలు, పిల్లలపై పెరుగుతున్న హింసలపై ఆందోళన వ్యక్తం చేస్తూ మహాసభ తీర్మానం ఆమోదించింది. స్థానిక భాషలను హైకోర్టు అధికార భాషగా చేయడం, న్యాయ వ్యవస్థలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, మణిపూర్ అల్లర్లను ఖండించడం, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్‌లు అందించడం, దేశవ్యాప్త ఏకీకృత న్యాయవాద సంక్షేమాన్ని అమలు చేయడానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను సిద్ధం చేయడం వంటి తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

భారీ స్పందన

- రెండో రోజూ ప్రజాపాలనలో లబ్దిదారుల క్యూ
- పలుచోట్ల దరఖాస్తుల కోసం తోపులాట
- బయట కొనుగోలు చేయొద్దన్న అధికారులు
- పలు కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించిన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-విలేకరులు

అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమం శుక్రవారం రెండో రోజూ కేంద్రాల వద్ద లబ్దిదారులు భారీగా క్యూకట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్యారంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ దరఖాస్తులను తీసుకున్నారు. గ్రామాల్లో జనాభాకు అనుగుణంగా కౌంటర్లను ఏర్పాటు చేసి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. దరఖాస్తుల కొరతా వెంటాడింది. కౌంటర్ల వద్ద కనీస సౌకర్యాలు కరవయ్యాయి. దరఖాస్తులు నింపే క్రమంలో వస్తున్న సమస్యలను అధికారులు ప్రజలకు వివరిస్తూ సహాయపడుతున్నారు. నిరక్షరాస్యుల దరఖాస్తులను వారే పూరిస్తున్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్ పల్లి గ్రామంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పాల్గొని ప్రజల నుంచి ఆరు గ్యారంటీల దరఖాస్తులు స్వీకరించారు. మల్హర్‌రావు మండలం తాడిచెర్లలో పాత జిల్లా పరిషత్ పాఠశాల, గ్రామపంచాయతీ దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ల వద్ద దరఖాస్తు ఫామ్స్ కోసం తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న మండల అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని కౌంటర్ నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధివిధానాలతో దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ఫామ్స్ కోసం ఎవరూ ఆందోళన చెందొద్దని, అందరికీ దరఖాస్తులు అందుతాయని తెలిపారు. హన్మకొండ జిల్లా సంగెం మండలంలోని గవిచర్ల గ్రామం పెద్దది అయినప్పటికీ ఒక్క కౌంటర్ కూడా లేదు. ప్రజలకు కూర్చోడానికి కుర్చీలు కూడా లేవు. దాంతో వరుసలో నిలబడిన వృద్ధులు, మహిళలు అనేక ఇబ్బందులు పడ్డారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2వ రోజు 74 గ్రామ పంచాయతీలు మూడు మున్సిపల్ వార్డుల్లో 34,995 గృహాల లబ్దిదారుల నుంచి 44,711 దరఖాస్తులు స్వీకరించినట్టు కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. మణుగూరు మండలంలోని తోగ్గుడెం గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వీకరించారు. అశ్వారావుపేటలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దరఖాస్తులను స్వీకరించారు. ఖమ్మం జిల్లాలో కలెక్టర్ గౌతమ్ కూసుమంచిలో పర్యటించి దరఖాస్తుల తీరును పరిశీలించారు. ఎమ్మెల్యే రాఘమయి సత్తుపల్లిలో పర్యటించారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నర్సాపూర్, పటాన్‌చెరు ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, జి.మహిపాల్‌రెడ్డి ప్రజాపాలనలో పాల్గొని పరిశీలించారు. కలెక్టర్ శరత్ సంగారెడ్డి జిల్లాలోని జోగిపేట, సదాశిపేట, జహీరాబాద్, నారాయణఖేడ్‌లో దరఖాస్తుల స్వీకరణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని ఎల్బీనగర్‌లో 41,639 దరఖాస్తులు స్వీకరించగా, చార్మినార్‌లో 76,379, ఖైరతాబాద్‌లో 48,856, కూకట్‌పల్లిలో 58723, శేరిలింగంపల్లిలో 27,525, సికింద్రాబాద్‌లో 53589, కంటోన్మెంట్‌లో 6515 దరఖాస్తులు స్వీకరించారు. మొత్తంగా రెండో రోజూ 71325 దరఖాస్తులు వచ్చాయి. అయితే దరఖాస్తులు నింపడంలో ఇబ్బందులు పడుతున్న కొంతమంది నిరక్షరాస్యుల సందేహాలు నివృత్తి చేసేందుకు సెంటర్స్ వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. అలాగే పలువురు ఆశావహులు దరఖాస్తులను జిరాక్స్ సెంటర్స్, మీ సేవాల వద్ద కొనుగోలు చేస్తున్నారు. అధికారులు మాత్రం తమ సిబ్బంది ఫామ్స్ ఇస్తారని, బయట డబ్బులు పెట్టి కొనుగోలు చేయొద్దని సూచిస్తున్నారు.

జేడీ(యూ) అధ్యక్షుడిగా నితీష్ కుమార్ ఎన్నిక

న్యూఢిల్లీ : బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ జనతాదళ్ (యునైటెడ్) అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఉదయం ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన జేడీయూ జాతీయ కార్యవర్గ సమావేశంలో సీనియర్ నేత లలన్ సింగ్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రకటన వెలువడిన కొన్ని నిమిషాలకే ఆయన రాజీనామాను ఆమోదించడంతో పాటు పార్టీ అధ్యక్షుడిగా నితీష్‌కుమార్ నియమితులవడం గమనార్హం. కాగా, ఇటీవల పార్టీ అధ్యక్ష బాధ్యతలు నితీష్‌కుమార్ చేపట్టనున్నారన్న ఊహాగానాలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే.

కష్టాల్లో కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు



- పనిచేయని ఆర్వోప్లాంట్, సోలార్‌హీటర్లు, సీసీ కెమెరాలు
- స్నానానికి చన్నీళ్లే దిక్కు.
- పట్టించుకోని అధికారులు


నవతెలంగాణ-మల్హర్‌రావు

కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాల కష్టాల కడలిలో చిక్కుకుంది. కనీస మౌలిక సౌకర్యాలు లేక బాలికలు ఇబ్బందులకు పడుతున్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాగునీరు, చలికి కప్పుకోవడానికి దుప్పట్లు, కాస్మోటిక్ కిట్లు, మెనూ ప్రకారం భోజనం, ఆట వస్తువులు, ఇంటర్ విద్యార్థులకు బోధించే అధ్యాపకుల కొరత, స్నానానికి చల్లని నీళ్లే దిక్కు.. సమస్యలతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అయినా పాలకులు, ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప పరిష్కరించని దుస్థితి నెలకొంది. ఇవన్నీ జయశంకర్-భూపాపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలోని దుబ్బపేట గ్రామపంచాయతీ పరిధిలోని పాఠశాలలో నవతెలంగాణ పరిశీలనలో తేలిన సమస్యలు. స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలలో 240మంది బాలికలున్నారు. అసలే శీతాకాలం ఇందుకు తోడుగా రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలకు ఎముకలు కొరికేలా చలి తీవ్రత పెరి గింది. పగటిపూట సైతం ఉన్ని దుస్తులు ధరించా ల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కస్తూర్బా గాంధీ ఆశ్రమ బాలికల పాఠశాల, తాడిచెర్ల ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో విద్యార్థులు వణికిపో తున్నారు. అసౌకర్యాల మధ్య అనేక ఇబ్బం దులతో కాలం వెళ్లదీస్తూ వస్తున్నారు. విద్యార్థులు స్నానానికి చన్నీల్లే దిక్కవడంతో అనీటితో స్నానం చేస్తూ గజగజ వణుకుతున్న పరిస్థితి. మొత్తం 240 మంది బాలికలు ఒకేసారి స్నానం చేయడం కుదరదు. దాంతో పలువురు విద్యార్థినులు వేకువ జామున 5 గంటలకే లేచి చలిలోనే స్నానం చేయాల్సి వస్తోంది. నిత్యం చన్నీళ్ల స్నానం చేయడం తో జలుబు, దగ్గు, జ్వరం వంటి రోగాల బారిన పడుతున్నారు. అంతేకాదు, పాఠశాలలో ఇంటర్మీ డియట్ విద్యార్థులకు ఇంకా అధ్యాపకులను నియమిం చకపోవడం, పాఠశాలలో అపరిశుభ్రత, స్టోర్ రూమ్‌లో కుళ్లిపోయిన కూరగాయలు దర్శన మిచ్చా 3యి. చెడిపోయిన ఆర్వో ప్లాంట్, సోలార్ హీటర్లు, సీసీ కెమెరాలు కనిపించాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు పట్టించు కొని తమ సమస్యలు తీర్చాలని విద్యార్థినులు వేడుకొం టున్నారు .

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలలో సోలార్ హీటర్లు, తాగునీటి ఆర్వో ప్లాంట్, సీసీ కెమెరాలు చెడిపోయాయని, మరమ్మతులు చేయించాలని గతంలో ఉన్నతాధికారులకు విన్నవించాం. అయినా పట్టించుకోవడం లేదు. కరోనా నేపథ్యం నుంచి బాలికలకు కాస్మోటిక్స్ కిట్లు రావడం లేదు. ఈ సంవత్సరం దుప్పట్లు కూడా ఇవ్వలేదు. ఇంటర్ విద్యార్థులకు సివిక్స్, ఎకనామిక్స్ అధ్యాపకులు లేరని ఉన్నతాధికారులకు నివేదించాం.

: వెన్నెల, పాఠశాల ఎస్‌ఓ



పని విధానమే కారణం...

కరోనా సమయం నుండి చాలా సంస్థలు ఉద్యోగులకు ఇంటి నుండి పని చేసే అవకాశం కల్పించాయి. అయితే కరోనా తర్వాత కూడా ఇదే సదుపాయాన్ని కొన్ని సంస్థలు కొనసాగించాయి. అయితే మరికొందరు వారంలో కొన్ని రోజులు ఇంటి నుండి పని చేసి కొన్ని రోజులు ఆఫీస్‌కి వెళ్ళే విధంగా ఉద్యోగులకు అవకాశమిచ్చారు. దీని వల్ల సంస్థ ఉత్పాదన పెంచుతూనే మహిళా ఉద్యోగులకు తమ వర్క్ లైఫ్‌ను బ్యాలన్స్ చేసుకునేందుకు కొంత వెసులుబాటు దొరికింది. ఈ పని విధానాన్ని ఈ ఏడాది చాలా సంస్థలు అమలు చేశాయి. ఈ పద్ధతిని హైబ్రీడ్ పని విధానం అంటున్నారు. అయితే ఈ పద్ధతి వల్ల మహిళలకు ఇంట్లోనే ఉండి పని చేస్తున్నామనే కాస్త ఆనందం దొరికినా కొన్ని విషయాల్లో మాత్రం భార్యాభర్తల మధ్య విభేదాలకు ఇది కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. రేపటితో ఈ ఏడాది ముగియబోతున్నది. ఈ సందర్భంగా ఈ పని విధానం జంటల మధ్య బంధాన్ని ఎలా కనుమరుగు చేస్తుందో తెలుసుకుందాం...

సాధారణంగా మహిళలకు ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఇంటి పనులు, ఆఫీస్ పనులతోనే సమయం సరిపోతుంటుంది. అలాంటప్పుడు జంటలు ఒకరితో ఒకరు గడపడానికి తగిన సమయం కూడా దొరకదు. కానీ ఇంటి నుండి పని విధానంలో ఈ లోటు కాస్త తగ్గిందనే చెప్పుకోవాలి. ఇందులో భాగంగా వారంలో సగం రోజులైనా ఇద్దరూ ఇంట్లోనే కలిసి పని చేసే అవకాశం దొరుకుతుంది. దీంతో ప్రయాణ సమయం వృథా కాకుండా... ఆ సమయం ఇద్దరూ కలిసి గడపడానికి వెచ్చించవచ్చు. అయితే కొన్ని జంటలు ఇలా మిగుల్చుకోవాల్సిన సమయాన్ని కూడా పనికి కేటాయిస్తున్నట్టు, ఇంట్లో ఉన్నా ఈ అదనపు పని వేళల వల్లే ఇద్దరి మధ్య పొరపచ్చాలొస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఈ



భేదాభిప్రాయాలు క్రమంగా ఇద్దరి అనుబంధాన్ని దూరం చేస్తున్నాయని వారంటున్నారు. ఇకపై ఇలా జరగకుండా ఉండాలంటే వేళకు పని ముగించుకోవడం, భాగస్వామికి తగిన సమయం కేటాయించేలా ప్రణాళిక వేసుకోవడం తప్పనిసరి అంటున్నారు.

వ్యక్తిగత సమయం

దాంపత్య బంధం దృఢమవ్వాలంటే ఇద్దరూ కలిసి సమయం గడపడం ఎంత ముఖ్యమో ఎవరికి వారు కాస్త వ్యక్తిగత సమయం కేటాయించుకోవడమూ అంతే ముఖ్యం. అయితే హైబ్రిడ్ వర్కింగ్ కారణంగా చాలా జంటలకు ఈ సమయమే కరువవుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఈ పని విధానంలో భాగంగా ఇద్దరూ కలిసి ఇంట్లో దగ్గరగా పని చేసుకోవడం వల్ల. దొరికిన ఆ కాస్త సమయం కలిసి గడపడానికి వెచ్చించడం లేదంటే ఆ సమయంలో ఇంటి బాధ్యతలు నిర్వర్తించడంతోనే సరిపోతుందని, ఈ బిజీ లైఫ్‌స్టైల్ ఇద్దరిలో మానసిక ఒత్తిళ్లకు కారణమవుతుందంటున్నారు నిపుణులు. మరికొంతమంది తమ భాగస్వామి వ్యక్తిగతంగా వారి పనుల్లో నిమగ్నమైనా దాన్ని నెగెటివ్ భావనతో చూడడం, వారిపై అనుమాన వ్యక్తిగతంగా వారి పనుల్లో నిమగ్నమైనా దాన్ని నెగెటివ్ భావనతో చూడడం, వారిపై అనుమాన పడడంతోనూ ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలొస్తున్నాయంటున్నారు. అనుబంధంలో చిచ్చుపెట్టే ఈ సమస్యను అధిగమించాలంటే ఒకరినొకరు అర్థం చేసుకోవడం, నమ్మడం, ఎవరికి వారు కాస్త వ్యక్తిగత సమయం కేటాయించుకోవడం దాన్ని గౌరవించడం వంటి అంశాలన్నీ కీలకమే.

అదనపు పనులు వద్దు

హైబ్రిడ్ వర్కింగ్‌లో భాగంగా కొన్ని రోజులు ఇంటి నుంచి పని చేసినంత మాత్రాన అటు ఆఫీస్ పనులు, ఇటు ఇంటి బాధ్యతలు ఏమాత్రం తగ్గవు. కాకపోతే ఆఫీస్‌కెళ్లేందుకు వెచ్చించే ప్రయాణ సమయం మాత్రం ఇక్కడ కలిసొస్తుంది. అయితే ఈ సమయాన్నీ అదనపు పనులకు కేటాయించడం వల్ల వర్క్ లైఫ్ బ్యాలన్స్ అదుపు తప్పుతుంది. ఇదే మానసిక ఒత్తిడి, ఆందోళన, యాంగ్జైటీ వంటి సమస్యలకు దారి తీస్తుంది. పోనీ ఈ మానసిక సమస్యల్ని భాగస్వామితో పంచుకుందామంటే కొంత మంది ఈ విషయంలోనూ ఆసక్తి చూపకపోవడం, వాళ్ల పరిస్థితి విన్నా అండగా నిలబడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇద్దరి మధ్య సఖ్యత కొరవడుతుంది. ఇదే అనుబంధాన్ని బీటలు వారేలా చేస్తుందంటున్నారు నిపుణులు. అందుకే ఇద్దరూ ఇంటి నుంచి పని చేసినా, ఆఫీస్‌కెళ్లినా ప్రతి పనినీ కలిసి పంచుకోవడం, ఒకరి మానసిక సమస్యల్ని మరొకరు పంచుకోవడం అర్థం చేసుకోవడం వల్ల మనకంటూ భాగస్వామి తోడున్నారన్న భరోసా ఉంటుంది. ఈ మద్దతే ఇద్దరి మధ్య అన్యోన్యతను పెంచుతుంది.

డిజిటల్ డీటాక్స్ అవసరం

ఇంట్లోనే ఉన్నా ఈ రోజుల్లో కొందరు ఫోన్లు, వాట్సప్‌లలోనే మాట్లాడుకోవడం, సందేశాలు పంపుకోవడం వంటివి చేస్తున్నారు. ఇక వర్క్ ఫ్రం హెూం పని విధానంలో బిజీగా ఉన్న భర్యా భర్తల్లో చాలా మంది ఇదే పద్ధతిని కొనసాగిస్తున్నారంట. దీని వల్ల ఇద్దరూ కలిసి ఏకాంతంగా గడిపే సమయం కూడా కనుమరుగవుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. అది అప్పటికప్పుడు అనుబంధంపై ప్రతికూల ప్రభావం చూపకపోయినా రోజులు గడిచే కొద్దీ జంటల మధ్య అన్యోన్యతను దెబ్బ తీస్తుందంటు న్నారు. ఇలా జరగకుండదంటే జంటలు రోజులో కాసేపు డిజిటల్ డీటాక్స్ పాటించడం తప్పనిసరి అని చెబుతున్నారు. అలాగే మొబైల్స్, ల్యాప్‌టాప్స్ వంటి వాటిని దూరం పెట్టి ఇద్దరూ కలిసి సమయం కేటాయించడమే దీని ముఖ్యోద్దేశం. మీరు ఆఫీస్‌కి వెళ్లినా, ఇంటి నుంచి పని చేసినా ఈ అలవాటును రోజూ కొనసాగిస్తే అనుబంధాన్ని దృఢం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు.



ఆమెకే సాధ్యమట!

సమాజం ఎన్నో మార్పులు సంతరించుకుంటోంది. నిరంతరం చెందుతున్న అభివృద్ధితో పాటు మన జీవనశైలీ మారిపోతోంది. ఈ క్రమంలోనే మహిళలు ఇంటా బయటా తామేంటో నిరూపించుకుంటున్నారు. వీళ్ళేం చేయగలరు అనే నిర్లక్ష్యపు మాట నుంచి వాళ్ళు మాత్రమే చేయ గలరనేంతగా మార్పు వచ్చింది. అన్ని రంగాల్లోనూ ధైర్యంగా నెగ్గుకురావడం మహిళలకు వెన్నతో పెట్టిన విద్య అని ఓ పరిశోధన రుజువు చేసింది. ఆ వివరాలేంటో మనమూ తెలుసుకుందాం...

ఒకేసారి వేర్వేరు పనులు చేయ డమే మల్టీ టాస్కింగ్. ప్రస్తుత ప్రపంచంలో ముందడుగు వేయాలంటే పోటీపడక తప్పదు. ఉరుకుల పరుగుల జీవితంలో మల్టీ టాస్కింగ్‌లో నిష్ణాతులు అయితే కానీ ముందుకు సాగలేని పరిస్థితి. ఇక మహిళల జీవితంలో అయితే ఈ మల్టీ టాస్కింగ్ తప్పనిసరిగా మారిపోయింది. ఒక పక్క వంట పని చూసుకోవాలి, మరోపక్క పిల్లల్ని బడికి సిద్ధం చేయాలి, ఇంకో పక్క ఇంటికి వచ్చే వారికి సమాధానం చెప్పుకోవాలి. ఇవి మాత్రమే కాకుండా వారూ ఉద్యోగాలు చేస్తుంటే.. ఇక ఆ హడావుడి గురించి మాటల్లో చెప్పలేం. మొత్తానికి ఇంట్లోనే ఉండే గృహిణులైనా, ఆఫీసుల్లో పనిచేస్తున్న ఉద్యో గినులైనా... మల్టీ టాస్కింగ్ మాత్రం తప్పనిసరిగా మారిపోయింది.

ఈ మల్టీటాస్కింగ్ చేయడంలో మగవారికీ, ఆడవారికీ మధ్య ఏమన్నా తేడా ఉందేమో అన్న అనుమానం వచ్చింది రష్యాకు చెందిన కొందరు పరిశోధకులకి. తమ అనుమానాన్ని నివృత్తి చేసుకునేందుకు గాను 140 మందిని ఎంచు కున్నారు. వీరిలో 69 మంది మగవారు కాగా, 71 మంది ఆడవారు. వీరిలో 20 నుంచి 65 ఏండ్లలోపు వయసు కలిగిన వారు ఉన్నారు. వీరందరికీ కూడా ఒకేసారి వేర్వేరు పనులు అప్పగించారు. ఉదాహరణకు ఒక చేత్తో వేర్వేరు ఆకారాలలో ఉన్న వస్తువులను వేరు చేస్తూ, మరో చేత్తో వేరు వేరు అంకెలని వరుసక్రమంలో ఉంచమన్నారు.

ఈ మల్టీటాస్కింగ్ చేస్తున్న సమయంలో అభ్యర్థుల మెదడు ఎలా పని చేస్తోందో తెలుసుకొనేందుకు ఎమ్మారై పరీక్షలు కూడా చేసి చూశారు. దీంతో మల్టీటాస్కింగ్ చేసే సమయంలో మగ వారి మెదడు ఆడవారి మెదడుకంటే ఎక్కువ శక్తిని వినియో గించుకోవడాన్ని గమనించారు. అలాగే వేర్వేరు పనులు ఒకేసారి చేయాల్సి వచ్చినప్పుడు, వారి మెదడు లోని వేర్వేరు భాగాలన్నీ కలసి పని చేయాల్సి వచ్చిందట. కానీ ఆడవారిలో మెదళ్లు మాత్రం ఎలాంటి హడావుడీ లేకుండా అతి తక్కువ సమయంలో, అతి తక్కువ శక్తిని ఉపయోగిస్తూ... వేర్వేరు పనులను ప్రశాంతంగా నిర్వహించేశాయి. 50 ఏండ్లు దాటిన తర్వాతగానీ ఆడవారిలో మల్టీటాస్కింగ్ సామర్థ్యంలో తగ్గు దల కనిపించడం లేదని వారు ఈ పరిశోధనతో తేల్చారు.

ఆడవారిలో కనిపించిన ఈ ప్రత్యేకతకి కారణం ఏమిటన్నది మాత్రం పరిశోధకులకు ఇంకా అంతుపట్ట లేదు. బహుశా ఇంటిని చక్కదిద్దుకునే ప్రయత్నంలో ఆడ వారికి అప్రయత్నం గానే ఈ నైపుణ్యం వచ్చి ఉంటుంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే మనో నిబ్బరంతోనే ఇది సాధ్యపడి ఉంటుంది. కానీ ఒకేసారి ఇన్నేసి పనులు చేస్తున్నారు కదా అని.. వారితో వీలైనంత చాకిరీ చేయించుకోవడమే బాధ కలిగించే విషయం.



మార్గదర్శకాలు రూపొందించండి

(మొదటిపేజీ తరువాయి)

మొదటి నిబంధనలో ఉన్న సాధ్యమైనంత త్వరగా అనే పదబంధాన్ని గవర్నర్‌కు సమర్పించిన బిల్లుల పరిష్కారానికి వర్తించే టైమ్‌లైన్ అంశంలో కూడా సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కేరళ కోరింది. కేరళ ప్రభుత్వం పంపించిన ఎనిమిది బిల్లులను రెండేళ్లపాటు పరిశీలించకుండా వాటిని ఎందుకు రిజర్వ్ చేశారని నవంబర్ 20న సుప్రీంకోర్టు గవర్నర్‌ను ప్రశ్నించిన సంగతి తెలిసిందే. అనంతరం ఏడు బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపించారని కోర్టు దృష్టికి కేరళ ప్రభుత్వం తీసుకొచ్చింది. తమ పరిశీలన కోసం పంపిన బిల్లులపై గవర్నర్ ఏళ్ల తరబడి నిష్క్రియాపరంగా వ్యవహరించారని, రాజ్యాంగం ప్రకారం తనకు సమర్పించిన అధికారాలను, విధులను నిర్వర్తించడంలో విఫలమయ్యారని కేరళ ప్రభుత్వం తరపున సికె శశి తాజా పిటిషన్‌లో పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను మరింత ఆలస్యం చేయకుండా పరిష్కరించేలా గవర్నర్‌ను ఆదేశించాలని కోరారు. ఆర్టికల్ 200 ప్రకారం సాధ్యమైనంత త్వరగా బిల్లులను ఆమోదించకుండా, గవర్నర్లు బిల్లులను పెండింగ్‌లో ఉంచడం వల్ల అనేక రాష్ట్రాలు ఇటువంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. క్రిస్మస్ సెలవుల అనంతరం సుప్రీంకోర్టు ఈ కేసును పరిగణనలోకి తీసుకునే అవకాశముంది.

హైదరాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి ఐదో ర్యాంకు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



పాస్ పోర్టుల జారీలో దేశంలోనే హైదరాబాద్ రీజినల్ పాస్ పోర్ట్ కార్యాలయం ఐదో ర్యాంకును సాధించింది. 2023 సంవత్సరంలో 7.85 లక్షల మందికి పైగా పాస్ పోర్టులను జారీ చేసింది. గతేడాది 6,43,157, 2022లో 4,28,246, 2019లో 5,32,785 పాస్ పోర్టులను జారీ చేసిన సంగతి తెలిసిందే. పాస్ పోర్టులకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా మొత్తం 1.5 కోట్ల మంది పాస్ పోర్టులు అందుకున్నారు. ఐదు పాస్ పోర్ట్ సేవా కేంద్రాలు, 14 పోస్ట్ ఆఫీస్ పాస్ పోర్ట్ సేవా కేంద్రాలతో కలిపి హైదరాబాద్ రీజినల్ పాస్ పోర్టు కార్యాలయం రోజుకు సరాసరిగా 4 వేల పాస్ పోర్టులను జారీ చేస్తున్నది. సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు విచారణ అపాయింట్‌మెంట్ సిస్టమ్‌ను ఆధునీకరించడంతో అనేక చర్యలను తీసుకున్నట్టు రీజినల్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.


ట్రంప్‌పై మరో రాష్ట్రం వేటు..

వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై మరో రాష్ట్రం వేటు వేసింది. 'మైన్' ప్రైమరీ బ్యాలెట్ పోరు నుంచి ట్రంప్ పేరును తొలగిస్తున్నట్టు ఆ రాష్ట్ర సెక్రటరీ గురువారం వెల్లడించారు. అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థి పేరును బ్యాలెట్ నుంచి ఓ ఎన్నికల అధికారి తొలగించడం అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. 14వ సవరణలోని సెక్షన్ 3 ప్రకారం.. ట్రంప్‌ను పోటీకి అనర్హుడని ప్రకటిస్తూ కొలరాడో సుప్రీంకోర్టు ఈ నెల ప్రారంభంలో తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పుని సవాలు చేస్తూ రిపబ్లికన్ పార్టీ అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

కొలరాడో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత.. మైన్ రాష్ట్రంలో ట్రంప్ అభ్యర్థిత్వాన్ని కొందరు సవాల్ చేశారు. వారి అప్పీళ్లను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర సెక్రటరీ షెన్నా బెల్లోస్.. ట్రంప్ పేరును ప్రైమరీ బ్యాలెట్ నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు. ఈ ఉత్తర్వులపై ట్రంప్ కోర్టుకెళ్లేందుకు అవకాశం కల్పించారు. అప్పటిదాకా ఆదేశాల అమలును నిలిపివేస్తున్నట్టు తెలిపారు. బెల్లోస్ నిర్ణయంపై మైన్ రాష్ట్ర కోర్టులకు అప్పీల్ చేయనున్నట్టు ట్రంప్ మద్దతుదారులు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లోని ఎన్నికల్లో ట్రంప్ పోటీ చేయనున్నారా లేదా అనే అంశంపై ఆ దేశ అత్యున్నత న్యాయస్థానం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

2020 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోవడంతో ఆయన మద్దతుదారులు 2021 జనవరి 6న అమెరికా అధ్యక్ష భవనంపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిని ట్రంప్ సమర్థించారని, హింసను ప్రేరేపించారన్న అభియోగాలపై ఇటీవల కొలరాడో కోర్టు కీలక తీర్పు వెలువరించింది.

సబ్సిడీలకు తూట్లు...



(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలు చేసే మోడీ సర్కారు.. ఈ విషయంలో మాత్రం మిన్నకుండినట్టు వ్యవహరించింది. యూపీఏ, ఎన్డీఏ పాలనాకాలం 2004-24 కాలంలో చేసిన లోతైన విశ్లేషణలో పలు అంశాలు వెల్లడయ్యాయి. తాజా బడ్జెట్ ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ వాస్తవ మూలధన వ్యయం దాని మొత్తం వ్యయంలో 18.6 శాతంగా ఉంది. ఇది గత 20 ఏండ్లలోనే అత్యధికం. 2020-21 మహమ్మారి సంవత్సరం నుంచి ఇది పెరుగుతోంది. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2014-15 నుంచి మొత్తం ప్రభుత్వ వ్యయంలో సబ్సిడీల వాటా క్షీణిస్తోంది.

మూలధన పెట్టుబడులపై దృష్టి సారించటం కారణంగా దాని ప్రభావం సబ్సిడీల వాటాపై పడుతుంది. 2023-24లో మొత్తం వ్యయంలో మూలధన వ్యయం వాటా 22.2 శాతంగా ఉంది. ఇది 2014-15లో 11.8 శాతంగా ఉంది. 2018-19 ముగిసే నాటికి ఇది 13.3 శాతానికి పెరిగింది. ఇక రెండో సారి మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూలధన వ్యయాన్ని అమాంతం పెంచుతూ.. సబ్సిడీలకు కత్తెరలు వేస్తోంది. ఇది యూపీఏ దశాబ్ద కాలంలో జరిగిన దానికి భిన్నంగా వ్యవహరించింది. యూపీఏ-1 అధికారం చేపట్టిన 2004-05లో మొత్తం వ్యయంలో 17.2 శాతం మూలధన వ్యయాన్ని కలిగి ఉంది. ఇది 2008-09 నాటికి 10.8 శాతానికి పడిపోయింది. 2013-14లో యూపీఏ-2 పాలన ముగిసే సమయానికి మూలధన వ్యయం 12 శాతంగా ఉంది. మోడీ హయాంలో 2023-24 నాటికి గణనీయంగా 18.6 శాతానికి పెరిగింది.

సబ్సిడీల వాటా ఇలా..

మొత్తం వ్యయంలో సబ్సిడీల వాటా చూస్తే మోడీ పాలనలో తగ్గిపోయింది. యూపీఏ పాలన పర్వాలేదనిపించింది. ఈ వాటా 2004-05లో తొమ్మిది శాతం నుంచి 2008-09లో 14.4 శాతానికి పెరిగింది. యూపీఏ-2 పాలన ముగిసేనాటికి 2013-14లో సబ్సిడీల వాటా 16.3 శాతానికి పెరగటం విశేషం. దీనికి విరుద్ధంగా.. మోడీ ప్రభుత్వ హయాంలో(మహమ్మారి ప్రభావిత కాలాన్ని మినహాయిస్తే) సబ్సిడీల వ్యయం వాటా తగ్గింది. 2014-15 ముగింపు నాటికి ఇది 15.3 శాతానికి పడిపోయింది.

ఎన్డీఏ-1 పాలన ముగిసే నాటికి 2018-19లో 9.6 శాతానికి క్రమంగా పడిపోయింది. 2023-24లో ఏకంగా తొమ్మిది శాతానికి పడిపోవటం గమనార్హం. పదేళ్ల మోడీ పాలనలో దేశంలోని పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలలో ఏ మాత్రమూ మార్పు రాలేదనీ, వారి ఆర్థిక పరిస్థితులు ఆశించినంతగా లేవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మోడీ ప్రభుత్వం తాను చేసే వ్యయంలో మూలధన పెట్టుబడుల (క్యాపెక్స్) పైనే అధికంగా దృష్టి సారిస్తుందని అంటున్నారు. కార్పొరేట్లకు భారీగా ప్రోత్సాహకాలు, సహజ వనరులను అప్పనంగా కట్టబెడుతూ.. మరోవైపు వృథా ఖర్చులను తగ్గించాలన్న ప్రభుత్వ మాటలు నీటి మూటేలేనని.. పదేళ్ల మోడీ పాలనలోని బడ్జెట్ విశ్లేషణ ఈ విషయాన్ని స్పష్టం చేస్తుందని విశ్లేషకులు అంటున్నారు. సబ్సిడీలకు కోతలు పెట్టి పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారాలను మోపిన మోడీ ప్రభుత్వాన్ని ఎవరూ మర్చిపోరని నిపుణులు విమర్శిస్తున్నారు.

హమాస్ వద్ద ఉన్న ముగ్గురు బందీల కాల్చివేత

- ఇజ్రాయిల్ సైన్యం తీరుపై విమర్శలు

గాజా : హమాస్ బంధించిన ఇజ్రాయిల్‌కు చెందిన ముగ్గురు తమకు సహాయం అందించాలంటూ తెల్ల జెండా ఊపుతున్నా పట్టించుకోకుండా ఇజ్రాయిల్ సైన్యం కాల్చివేసింది. సొంత ప్రజలనే కాల్చివేసిన ఇజ్రాయిల్ సైన్యం దుశ్చర్యపై తీవ్ర విమర్శలు రావడంతో తాజాగా వివరణనిచ్చింది. ఉత్తర గాజాలోని షిజాయాప్రాంతంలో ఈ నెల 15న జరిగిన ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు ఇజ్రాయిల్ సైన్యం పేర్కొంది. బిస్లమక్ బ్రిగేడ్ 17వ బెటాలియన్‌కు చెందిన సైనికుడు హమాస్ సభ్యులుగా భ్రమించి ముగ్గురిని కాల్చివేశాడు. ఆ కాల్పుల్లో తొలుత ఇద్దరు మరణించగా.. మూడో వ్యక్తి సమీప భవనంలోకి పారిపోయాడు. వెంటనే కాల్పులు ఆపాలని అక్కడే ఉన్న కమాండర్ సైనికులను ఆదేశించాడు. ఆ వ్యక్తి ఎవరనేది గుర్తించాలని చెప్పాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి ఆ భవనం నుంచి 'సహాయం చేయండి. వారు నాపై కాల్పులు జరుపుతున్నారు' అని హిబ్రూ భాషలో అరుపులు వినిపించాయి. కాల్పులు నిలిపేయాలని కమాండర్ మరోసారి ఆదేశాలు జారీ చేశాడు. ఆ తర్వాత మూడో వ్యక్తి భవనం నుంచి బయటకు వచ్చి, సైన్యం దిశగా వచ్చే ప్రయత్నం చేశాడు. పక్కన ట్యాంక్ నుంచి చప్పుడు వస్తుండటంతో కమాండర్ ఆదేశాలు సైనికులకు వినిపించలేదు. దాంతో అక్కడున్న ఇద్దరు సైనికులు ఆ మూడో బందీపై కాల్పులు జరిపారని' ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ దర్యాప్తు తెలిపింది. ఆ ముగ్గురు బందీల ఒంటిపై చొక్కాలు లేవని, బలగాలకు దగ్గరగా వస్తున్నప్పుడు వారిలో ఒకరు తెల్ల జెండాను ఊపారని, బలగాలకు వారు సరిగా కనిపించకపోవడమే కాల్పులకు దారితీసిందని పేర్కొంది.

దక్షిణ గాజాపై దాడులు ఉధృతం

ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులను ఉధృతం చేసింది. ఇప్పటికే గాజా జనాభాలో 85 శాతం (సుమారు 23 లక్షలు) మంది నిరాశ్రయులయ్యారు. దక్షిణ గాజాపై వైమానిక, భూతల దాడులను తీవ్రతరం చేసినట్లు శుక్రవారం



ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడిఎఫ్) తెలిపింది. దీంతో నివాసాలను వీడిన వేలాది మంది పాలస్తీనియన్లు రఫా సరిహద్దుకు చేరుకున్నారని, ఈ ప్రాంతమంతా రద్దీగా మారిందని ఐక్యరాజ్యసమితి (యుఎన్) తెలిపింది.

స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 1.20కి ఇజ్రాయిల్ డమాస్కస్ సమీపంలోని పలు ప్రాంతాలపై వైమానిక దాడులు జరిపిందని సిరియాకి చెందిన సనా న్యూస్ ఏజన్సీ తెలిపింది. డమాస్కస్ విమానాశ్రయంపై దాడి జరిగిందని బ్రిటన్‌కి చెందిన సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ నివేదిక తెలిపింది. ఇటీవల దాడుల కారణంగా రెండు నెలల పాటు విమానాశ్రయంలో నిలిచిపోయిన సేవలు గురువారం తిరిగి ప్రారంభమయ్యాయని, అదే రోజు దాడి జరిగిందని పేర్కొంది. డమాస్కస్ గ్రామీణ ప్రాంతంలోని సిరియన్ ఎయిర్ డిఫెన్స్ శిబిరం, దక్షిణ ప్రావిన్స్ ఆఫ్ స్వీడియాలోని సైనిక శిబిరాలపై దాడులు జరిగినట్లు తెలిపింది. ఈ దాడుల్లో ఇద్దరు సైనికులు గాయపడినట్లు ప్రకటించింది.

ఇంటర్ పరీక్షల ఫీజు గడువు 3 వరకు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 4,45,990 మంది, ఒకేషనల్‌లో 54,500 మంది కలిపి 5,00,490 మంది విద్యార్థులుంటే, 4,77,906 మంది ఫీజు చెల్లించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 4,27,712 మంది, ఒకేషనల్ విభాగంలో 49,633 మంది కలిపి మొత్తం 4,77,345 మంది విద్యార్థులకుగాను 4,43,209 మంది విద్యార్థులు ఫీజు కట్టారని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ప్రయివేటు విద్యార్థులతో కలిపి 10,59,233 మంది విద్యార్థులుంటే, 9,77,040 మంది విద్యార్థులు ఫీజు చెల్లించారని వివరించారు. ఇంకా 82,193 మంది ఫీజు కట్టలేదని తెలిపారు. ఆ విద్యార్థులంతా ఆలస్య రుసుంతో ఫీజు చెల్లించే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కోవిడ్‌లో రూ. 40 వేల కోట్ల స్కామ్

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించింది. ఈ పడకలు (బెడ్లు) అన్ని అద్దెకు తీసుకొన్నవే. ఒక పడకను అద్దెకు తీసుకున్న ధరతో రెండు పడకలను కొనుగోలు చేయవచ్చును. ఒక పడకకు రోజుకు రూ 20 వేల అద్దె చెల్లించారు. రూ 20 వేలతో సెలైన్ స్టాండ్లు ఉన్న రెండు మంచాలు కొనుగోలు చేయవచ్చు' అని యత్నాల్ తెలిపారు. దేశంలో కరోనా విజృంభణ సమయంలో అంటే 2019 జులై నుంచి 2021 జులై వరకూ కర్నాటక ముఖ్యమంత్రిగా యడ్యూరప్ప పదవిలో ఉన్నారు. కాగా, బీజేపీ ఎమ్మెల్యే యత్నాల్ చేసిన ఆరోపణలపై ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. కోవిడ్ సమయంలో భారీ అవినీతి జరిగిందనడానికి యత్నాల్ వ్యాఖ్యలే రుజువులు అని అన్నారు. అలాగే, యడ్యూరప్ప ప్రభుత్వం రూ. 4 వేల కోట్ల స్కామ్‌కు పాల్పడిందని కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనే ఆరోపించిన విషయాన్ని సిద్ధరామయ్య గుర్తు చేశారు.

బొగ్గు బ్లాకుల వేలంపై ఏం చేశారు?

(మొదటిపేజీ తరువాయి)

పలు సందేహాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత రాకుండా బొగ్గు ఉత్పత్తి చేయాలనీ, కార్మికుల రక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఉత్పత్తి సాధించాలని ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా ఒడిశా నైని బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తి ప్రారంభించాలని చెప్పారు. వచ్చే వేసవి నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందనీ, రాష్ట్రంలోని అన్ని థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాల్లో బొగ్గు బఫర్ స్టాక్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సింగరేణి ఉపరితల భూగర్భగనులు, నూతన ప్రాజెక్టులు, సింగరేణి థర్మల్ ప్రాజెక్టు, సోలార్ ప్రాజెక్టులు, మిషనరీ వినియోగం, బొగ్గు మార్కెటింగ్, రవాణా సహా అన్ని అంశాలను అడిగి తెలుసుకున్నారు. సంస్థ ఆర్థిక స్థితిగతులు, ఉద్యోగ కల్పన, కార్మిక సంక్షేమం, సీఎస్ఆర్ నిధుల కేటాయింపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, ఇప్పటి వరకు సాధించిన ప్రగతి గురించి అధికారులు ఆయనకు వివరించారు.తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం వేలం పెట్టిన బొగ్గు బ్లాకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాన్ని నివారించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కేంద్ర నిర్ణయాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయనీ, వాటినీ పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. సింగరేణి విస్తరణలో భాగంగా బొగ్గు మైనింగ్‌తో పాటు ఇతర ఖనిజాన్వేషణకు రూపొందించిన ప్రణాళికలు ఏమున్నాయని ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు కర్మాగారం ఏర్పాటు పురోగతిని సమీక్షించారు. ఈ విషయంలో సింగరేణి ఏం చేసిందని అడిగారు. అనేక ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానాలు చెప్పలేకపోవడంతో మంత్రి కొంత అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గత ప్రభుత్వ నిర్ణయాలు, సాధించిన అభివృద్ధి, దాపురించిన నష్టాలనూ అడిగారు. కారుణ్య నియామకాల కోసం జరుగుతున్న మెడికల్ బోర్డు ప్రక్రియను మరింత సులభతరం ఎందుకు చేయకూడదని ప్రశ్నించారు. దీనిపై అధ్యయనం చేసి, రిపోర్టు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సింగరేణి సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్, డైరెక్టర్లు ఎన్ బలరామ్ (పర్సనల్, ఫైనాన్స్), డీ సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎన్‌వీకే శ్రీనివాస్ (ఆపరేషన్స్), జీ వెంకటేశ్వర్‌రెడ్డి (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) జీ ఆల్విన్, జనరల్ మేనేజర్ (కో ఆర్డినేషన్) ఎమ్ సురేష్‌తో పాటు వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

పేసర్ల పరేషాన్

32 ఏండ్లు. పదికిపైగా పర్యటనలు. వైట్‌బాల్ ఫార్మాట్‌లో విజయం దక్కినా.. టెస్టు సమరంలో మాత్రం సఫారీ సవాల్ అలాగే మిగిలిపోయింది. విదేశీ గడ్డపై టీమ్ ఇండియాకు గొప్ప రికార్డులు ఏమీ లేవు. ఆధునిక క్రికెట్‌లో గంగూలీ, ధోని, కోహ్లి సారథ్యంలో భారత్ అనితర సాధ్య విజయాలు సాధించింది. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వెస్టిండీస్ గడ్డపై టెస్టు సిరీస్ విజయాలు అందుకుంది. కానీ దక్షిణాఫ్రికాలోనే భారత్‌కు టెస్టు సిరీస్ విజయం ఇప్పటికీ అందని ద్రాక్షగానే మిగిలింది. గత రెండు పర్యటనల్లో ఆ విజయానికి చేరువైనా.. ఈసారి కొట్టడం ఖాయమనే భావన కనిపించింది. సెంచూరియన్ టెస్టులో భారత బ్యాటర్ల వైఫల్యం సుస్పష్టం. కానీ టెస్టు విజయాలు సాధించేందుకు పరుగుల వేట సాగించే బ్యాటర్ల కంటే.. వికెట్ల వేట సాగించే బౌలర్లే కీలకం. కీలక దక్షిణాఫ్రికా పర్యటనలో ఇప్పుడు టీమ్ ఇండియా పేసర్ల పరేషాన్ ఎదుర్కొంటుంది.



- బ్యాటింగ్ వైఫల్యం నిజమే కానీ..
- బౌలర్ల చెత్త ప్రదర్శనే ఓటమికి కారణం

సఫారీ గడ్డపై కలగానే టెస్టు సిరీస్

నవతెలంగాణ క్రీడావిభాగం

టెస్టు మ్యాచ్‌లో విజయం తేల్చేది నాణ్యమైన పేసర్లు. ఓ ఎండ్ నుంచి బౌలర్‌ను మార్చినప్పుడు..బంతి అందుకున్న కొత్త బౌలర్ సత్తా, సామర్థ్యం మ్యాచ్ ఫలితాన్ని శాసించగలదు. సహజంగానే బ్యాటర్లు కాస్త బలహీన బౌలర్‌ను టార్గెట్ చేస్తారు. నాణ్యమైన బౌలర్ నుంచి బంతి మారగానే.. చెత్త బౌలర్‌కు చుక్కలు చూపిస్తారు. ఆ ఓవర్లో అలవోకగా పరుగులు పిండుకుని.. నాణ్యమైన బౌలర్ ఓవర్లో ఒత్తిడికి గురికాకుండా ఉంటారు. భారత్, దక్షిణాఫ్రికా టెస్టులో టీమ్ ఇండియానే ఇందుకు చక్కటి ఉదహరణ.

సెంచూరియన్ టెస్టులో టీమ్ ఇండియా సీనియర్ బౌలర్లు జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, రవిచంద్రన్ అశ్విన్‌లు 69.4 ఓవర్లలో 201 పరుగులకు ఏడు వికెట్లు పడగొట్టారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 245 పరుగులు చేసింది. ఈ స్కోరుకు ముగ్గురు ప్రధాన బౌలర్ల ప్రదర్శన మ్యాచ్‌ను లెవల్ చేసింది. కానీ జట్టులోని మరో ఇద్దరు అనుభవం లేని పేసర్లు శార్దుల్ ఠాకూర్, ప్రసిద్ కృష్ణలు 39 ఓవర్లలోనే 194 పరుగులు సమర్పించుకున్నారు. ఇక్కడే దక్షిణాఫ్రికాకు టీమ్ ఇండియా మ్యాచ్‌ను చేజార్చుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ లైనప్ ప్రదర్శన దారుణం. కానీ బ్యాటింగ్ వైఫల్యం కంటే బౌలర్ల లయ తప్పిన బౌలింగే భారత్‌కు ఓటమిని మిగిల్చింది. పిచ్ నుంచి మంచి పేస్, బౌన్స్ లభించినా మన బౌలర్లకు పెద్దగా రాణించలేదు. దక్షిణాఫ్రికాలో గత ఐదు పర్యటనల్లో భారత్ కనీసం నాలుగు సార్లు ఓ టెస్టు మ్యాచ్‌లోనైనా విజయం సాధించగలిగింది. అందుకు ప్రధాన కారణం, నాణ్యమైన బౌలర్లు జట్టులో ఉండటమే. సఫారీ పేస్ విభాగం అదనపు బలాన్ని మన పేస్ దళం సమం చేయటంతోనే అది సాధ్యపడింది. ఇప్పుడు ఆ పరిస్థితులు కనిపించటం లేదు. బ్యాటర్లపై బుమ్రా, సిరాజ్, అశ్విన్ పెంచిన ఒత్తిడిని.. శార్దుల్ ఠాకూర్, ప్రసిద్ కృష్ణలు తొలగిస్తున్నారు. ఇది సఫారీ బ్యాటర్లకు వరంగా మారింది. బ్యాటింగ్ లైనప్‌కు సైతం సెంచూరియన్ ఓటమిలో బాధ్యత ఉంటుంది. కానీ పేస్‌కు గొప్పగా సహకరించే పిచ్‌లపై అద్భుత ప్రదర్శన చేయాల్సిన బాధ్యత పేస్ విభాగానిదే. భారత పేసర్లు సెంచూరియన్‌లో ఈ అంశంలో వంద శాతం విఫలమయ్యారు.

స్వర్ణయుగం ముగిసిందా?

భారత పేస్ విభాగంలో స్వర్ణయుగం ముగిసిందా అనే అనుమానం మొదలైంది. మహ్మద్ షమి, ఇషాంత్ శర్మ, ఉమేశ్ యాదవ్, జశ్‌ప్రీత్ బుమ్రాలతో కూడిన పేస్ దళం టెస్టుల్లో భారత్‌కు అసమాన విజయాలు అందించింది. 2018-2021 సమయంలో భారత పేస్ విభాగం వరల్డ్ నం.1 పేస్ బృందంగా కితాబు అందుకుంది. ఈ నలుగురు పేసర్లలో మహ్మద్ సిరాజ్ మినహా ఎవరూ బీసీసీఐ వ్యవస్థ నుంచి తయారైన పేసర్ కాదు. ఓ పేసర్‌ను రాష్ట్ర క్రికెట్ సంఘం పట్టించుకోలేదు. మహ్మద్ షమి ఆసీస్‌తో ఆరంగ్రేట సిరీస్‌లోనే ధారాళంగా పరుగులు ఇచ్చుకున్నారు. ఉమేశ్ యాదవ్ 100 వికెట్లు కూల్చినా.. చెత్త సగటు సాధించిన పేసర్‌గా విమర్శలు ఎదుర్కొన్నాడు. మహ్మద్ సిరాజ్ ప్రతిభను గుర్తించిన బోర్డు.. అతడిని రంజీ ట్రోఫీ, దేశవాళీ టోర్నీలు సహా భారత్-ఏ తరఫున ఆడించింది. సిరాజ్ అంశంలోనే బీసీసీఐ వ్యవస్థలు కలిసి పని చేశాయి. బుమ్రా సహజసిద్ధ ప్రతిభావంతుడు. ఒక్కసారి వెలుగులోకి వచ్చాక.. అతడు వెనుదిరగాల్సిన అవసరం రాలేదు. షమి, ఉమేశ్, ఇషాంత్‌లు కఠోర సాధనతో ప్రపంచ శ్రేణి హెూదా దక్కించుకున్నారు. ఈ నలుగురు పేసర్లు ఏకకాలంలో సూపర్ ఫామ్‌లో ఉండటం అప్పటి కెప్టెన్ విరాట్ కోహ్లికి వరంగా మారింది. స్పిన్నర్లు జడేజా, అశ్విన్‌లు సైతం జట్టులో ఉన్నారు. దీంతో ప్రత్యర్థి బ్యాటర్లపై ఒత్తిడి పెరుగుతూనే ఉండేది. ఫలితంగా క్రమం తప్పకుండా వికెట్ల జాతర సాగేది. ఇషాంత్, ఉమేశ్ జాతీయ జట్టుకు దూరం కాగా.. షమి గాయంతో సఫారీ సిరీస్‌కు దూరమయ్యాడు. బుమ్రా, సిరాజ్ ఫామ్‌లో ఉన్నప్పటికీ.. మరో ఎండ్ నుంచి సహకారం దక్కటం లేదు. దీంతో భారత పేస్ దళం స్వర్ణ యుగం ముగిసిందనే వాదన వినిపిస్తోంది.



గతి తప్పిన మేనేజ్‌మెంట్!

కరోనా మహమ్మారితో బీసీసీఐ టాలెంట్ మేనేజ్‌మెంట్ గతి తప్పింది. బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో గాయాలకు గురైన క్రికెటర్లకు రిహాబిలిటేషన్ సెంటర్ సేవలు అందిస్తున్నారు. కానీ ప్రతిభావంతులైన దేశవాళీ క్రికెటర్లకు ప్రతిభకు సాన పట్టడం లేదు. ఈ సమయంలో భారత్-ఏ విదేశీ పర్యటనలు సైతం తగ్గిపోయాయి. ఆ ప్రతికూల ప్రభావం ఇప్పుడు సఫారీ సిరీస్‌లో కనిపిస్తుంది. ప్రసిద్ కృష్ణ అరంగ్రేట మ్యాచ్‌లో తేలిపోయాడు. తొలి టెస్టులో మెరవాలని లేదు. కానీ కనీస ప్రభావం చూపకపోవటం ఆలోచించాల్సిన విషయమే. ఇక శార్దుల్ ఠాకూర్ గత ఐదు టెస్టుల్లో ఏకంగా 56 స్ట్రయిక్ రేట్‌తో కొనసాగుతున్నాడు. పేస్‌కు అనుకూలమైన పిచ్‌లపై ఠాకూర్ సగటున పది ఓవర్లకు ఓ వికెట్ పడగొడుతున్నాడు. ప్రసిద్ కృష్ణ ఫస్ట్ క్లాస్ అనుభవం సైతం అంతంతే. ఇక తొలి టెస్టులో రెండో రోజు లంచ్ విరామం అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మ వ్యూహాలు సైతం విమర్శలకు అవకాశం కల్పించాయి. పసలేని బంతులు సంధిస్తున్న ప్రసిద్, శార్దుల్‌లకు రోహిత్ బంతి అందించాడు. ఓ వైపు పరుగుల వరద పారుతుండగా.. మరో ఎండ్‌లో వికెట్ల వేట సాగించినా ఫలితం లేకుండా పోయింది.

ముందుంది కఠిన పరీక్ష

న్యూఇయర్‌లో కేప్‌టౌన్ టెస్టు తర్వాత భారత్ స్వదేశంలో మరో సవాల్‌కు సిద్ధం కానుంది. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టులు ఆడనుంది. భారత్‌లో స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు వికెట్ల వేట చూసుకుంటారు. అయినా, పేస్ విభాగం కాస్తో కూస్తో బలంగానే ఉండాలి. మహ్మద్ షమి ఫిట్‌నెస్ సాధిస్తే పెద్ద సమస్య ఉండదు. బుమ్రా, సిరాజ్, షమి త్రయం అదరగొడుతుంది. కానీ పేస్ విభాగంలో తరం మార్పిడిలో ఉన్న టీమ్ ఇండియా.. ప్రత్యామ్నాయాలను సైతం వెతుక్కోవాల్సి ఉంది. అందుబాటులో ఉన్న బ్యాకప్ పేసర్లకు భారత్-ఏ సిరీస్ తరఫున ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలి. భారత సీనియర్ జట్టు నెట్స్‌లో తరచుగా బంతులు వేసేందుకు ఏర్పాట్లు చేయాలి. ఐపీఎల్ ప్రదర్శన ఆధారంగా టెస్టు క్రికెట్‌లో బంతి అందిస్తే.. సెంచూరియన్ ఫలితాలే పునరావృతం అవుతాయి.

సిరీస్ ఆసీస్ వశం

- రెండో టెస్టులో పాక్ ఓటమి



మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియాలో పాకిస్థాన్ పర్యటనకు 28 సంవత్సరాలు. ఒక్క డ్రా లేదు, ఒక్క విజయం లేదు. వరుసగా 16 టెస్టుల్లో పరాజయాలు. ఇదీ పాక్ జట్టుకు కంగారూ గడ్డపై ఎదురైన ట్రాక్ రికార్డు. తాజాగా ఆసీస్‌తో మెల్‌బోర్న్ టెస్టులో పాకిస్థాన్ ఓటమి చెందింది. నాలుగు రోజుల్లోనే ముగిసిన టెస్టులో ఆస్ట్రేలియా 79 పరుగుల తేడాతో పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించింది. 317 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 67.2 ఓవర్లలోనే 237 పరుగులు చేసింది. షాన్ మసూద్ (60, 71 బంతుల్లో 7 ఫోర్లు), అఘా సల్మాన్ (50, 70 బంతుల్లో 6 ఫోర్లు), బాబర్ ఆజామ్ (41, 79 బంతుల్లో 4 ఫోర్లు) మెరిసినా.. ఆసీస్ పేసర్ల ధాటికి పాక్ నిలువలేదు. కెప్టెన్ పాట్ కమిన్స్ (5/49) ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగగా.. మిచెల్ స్టార్క్ (4/55) నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఓపెనర్లు అబ్దుల్లా షఫీక్ (4), ఇమామ్ ఉల్ హక్ (12) విఫలమైనా.. మిడిల్ ఆర్డర్‌లో మసూద్, బాబర్, షకీల్ (24), మహ్మద్ రిజ్వాన్ (35)లు మెరిశారు. కానీ ఆ తర్వాత లోయర్ ఆర్డర్ పేకమేడలా కుప్పకూలింది. ఆమర్ జమల్ (0), అఫ్రీది (0), హమ్జా (0)లు చేతులెత్తేశారు. దీంతో పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో 237 పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా వరుస ఇన్నింగ్స్‌ల్లో 318, 262 పరుగులు చేయగా.. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 264 పరుగులే చేసింది. మూడు మ్యాచుల టెస్టు సిరీస్‌లో ఆసీస్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. పది వికెట్ల ప్రదర్శన చేసిన పాట్ కమిన్స్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు సాధించాడు. ఆసీస్, పాక్ మూడో.. డెవిడ్ వార్నర్ వీడ్కోలు టెస్టు జనవరి 3 నుంచి సిడ్నీలో ఆరంభం కానుంది.

టెస్టు జట్టులోకి అవేశ్ ఖాన్

- మహ్మద్ షమి స్థానంలో ఎంపిక



కేప్‌టౌన్ : దక్షిణాఫ్రికాతో రెండో టెస్టుకు యువ పేసర్ అవేశ్ ఖాన్ ఎంపికయ్యాడు. సీనియర్ పేసర్ మహ్మద్ షమి గాయంతో సఫారీ పర్యటనకు దూరం కాగా.. అతడి స్థానంలో అవేశ్ ఖాన్‌ను జట్టులోకి తీసుకుంటూ సీనియర్ సెలక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. భారత్-ఏ జట్టు తరఫున సఫారీ టూర్‌లో ఉన్న అవేశ్ ఖాన్ నాలుగు రోజుల మ్యాచ్‌లో ఇప్పటికే ఐదు వికెట్ల ప్రదర్శనతో మెరిశాడు. భారత్, దక్షిణాఫ్రికా రెండో టెస్టు జనవరి 2 నుంచి కేప్‌టౌన్‌లో ఆరంభం కానుంది.

ఆ ఇద్దరు కావాలి : రెండో టెస్టులో టీమ్ ఇండియా తుది జట్టులో రెండు మార్పులను సూచించారు సునీల్ గవాస్కర్. స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, పేసర్ ముకేశ్ కుమార్‌లను జట్టులోకి తీసుకోవాలని సన్నీ ఓ టెలివిజన్ షోలో తెలిపాడు. రోహిత్‌సేన అంతర్గత ప్రాక్టీస్ మ్యాచులతో ఉపయోగం లేదని, దానికంటే ఇంట్లో విశ్రాంతి తీసుకుని నుంచి నేరుగా మ్యాచ్ బరిలోకి దిగటం మేలని వ్యాఖ్యానించారు.

నవచిత్రం



సారా, శ్రద్ధా శ్రీనాథ్, వెంకటేష్

భావోద్వేగభరితంగా బుజ్జికొండవే..

వెంకటేష్ నటిస్తున్న తన 75వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఊహించని థ్రిల్స్‌తోపాటు ఇంటెన్స్ యాక్షన్, మంచి భావోద్వేగాలను కూడా ఉన్నాయి. తండ్రీకూతుళ్ల బంధం సినిమాకు మెయిన్ ఎసెట్.

ఇటీవల విడుదలైన రెండవ సింగిల్ హీరో కుటుంబంలోని ఆనందాన్ని చూపించింది. తాజాగా విడుదలైన మూడో సింగిల్ 'బుజ్జి కొండవే' తండ్రీకూతుళ్ల అనుబంధానికి సంబంధించిన మరో షేడ్ ప్రజెంట్ చేస్తోంది. ఈ సిస్చ్యువేషన్‌కి తగినట్లు సంతోష్ నారాయణన్ అద్భుతమైన ట్యూన్‌ని అందించారు. రామజోగయ్య శాస్త్రి తన అద్భుతమైన లిరిక్స్ సన్నివేశాన్ని మనసుని హత్తుకునేలా చెప్పారు. ఎస్పీ చరణ్ తన మ్యాజికల్ వాయిస్‌తో భావోద్వేగాలకు మరింత లోతును జోడించారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్.మణికందన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 13 ఈ సినిమా అన్ని దక్షిణ భారతీయ భాషలతోపాటు హిందీలోనూ విడుదల కానుంది. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహాని శర్మ, ఆండ్రియా జెరెమియా, సారా, జయప్రకాష్ ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈచిత్రానికి సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం.

సందేశమూ ఉన్న సినిమా



ఆకాష్

సింగర్ సునీత తనయుడు ఆకాష్ 'సర్కారు నౌకరి' సినిమాతో హీరోగా పరిచయవుతున్నారు. భావన హీరోయిన్. ఈ చిత్రాన్ని ఆర్కే టెలీ షో బ్యానర్ పై దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు నిర్మించారు. గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా న్యూ ఇయర్ సందర్భంగా జనవరి 1న థియేటర్స్‌లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో ఆకాష్ శుక్రవారం మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాల సమాహారం..

'నాకు యాక్టింగ్ అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. చిరంజీవి సినిమాలు ఎక్కువగా చూస్తుండేవాడిని. అలాగే డ్యాన్స్ క్లాసులకు వెళ్లాను. ఉత్తేజ్ మయూఖ ఇన్ స్టిట్యూట్‌లో రెండున్నర నెలలు యాక్టింగ్ కోర్సు చేశాను. నాకు, అమ్మకు కలిపి దర్శకుడు శేఖర్ ఈ కథ చెప్పారు. కథ వినగానే నాకు బాగా నచ్చింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు కండోమ్స్ వాడకం, ఎయిడ్స్ మీద అవగాహన కల్పించే క్రమంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఎలాంటి సంఘర్షణ ఎదుర్కొన్నాడు?, తన లక్ష్యాన్ని ఎలా చేరుకున్నాడు?, ఇందుకు అతనిలో ఉన్న మరో బలమైన కారణం ఏంటి అనేది ఈ సినిమా కథాంశం. ఈ కథలో ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్, మెసేజ్ అన్నీ ఉన్నాయి. అలాగే నా క్యారెక్టర్‌లో ఉద్యోగ ధర్మం, ప్రజల్ని చైతన్య చేయాలనే లక్ష్యం ఉంటాయి. అదే టైమ్‌లో నా ఉద్యోగం పట్ల నా మిత్రులు, నా భార్య ఎలా రియాక్ట్ అయ్యారు అనేది ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. మన సొసైటీలో ఒక టైమ్‌లో జరిగిన రియల్ ఇన్సిడెంట్స్‌కి ఫిక్షన్ కలిపి ఈ సినిమా చేశాం. ఇందులో నా క్యారెక్టర్‌లో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. దర్శకేంద్రుడి చేతుల మీదుగా నేను హీరోగా లాంచ్ అవడాన్ని నా లైఫ్ లో మర్చిపోలేను. టీజర్ లాంచ్‌లో అమ్మ కన్నీళ్లు పెట్టుకుంది. నేను రాఘవేంద్రరావు, తనికెళ్ల భరణి లాంటి పెద్ద వాళ్లతో కలిసి పనిచేస్తున్నాను అనే ఫీలింగ్ అమ్మకు, నాకు ఎంతో గర్వంగా అనిపించింది. నటుడిగా నిరూపించుకోవాలని ఉంది. ఇకపై కమర్షియల్ సినిమాల్లోనూ నటించాలని ఉంది'.

ఫ్యాన్స్‌కి సంక్రాంతి గిఫ్ట్



ప్రభాస్

రాబోయే సంక్రాంతి ప్రభాస్ ఫ్యాన్స్‌కు రెట్టింపు సంతోషాన్ని తీసుకు రాబోతోంది. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబినేషన్‌లో రూపొందుతున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఫస్ట్ లుక్, టైటిల్‌ను సంక్రాంతి పండుగ సందర్భంగా రిలీజ్ చేయబోతున్నారు.

ఈ సినిమాలో ప్రభాస్ ఇప్పటిదాకా చూడని ఒక కొత్త లుక్‌లో, క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. ప్రభాస్‌తో చేస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ గురించి నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అప్డేట్‌ను షేర్ చేసింది. డైనోసార్ డార్లింగ్‌గా ఎలా మారాడో తెలుసుకునేందుకు రెడీగా ఉండండి. సంక్రాంతి కానుకగా టైటిల్, ఫస్ట్‌లుక్‌ని రిలీజ్ చేస్తున్నాం అంటూ ఈ సంస్థ ట్వీట్ చేసింది. 'భలే భలే మగాడివోయ్, మహానుభావుడు, ప్రతి రోజు పండగే' వంటి బ్లాక్ బస్టర్ హిట్స్ ఇచ్చిన డైరెక్టర్ మారుతి ప్రభాస్‌ను సరికొత్తగా సిల్వర్ స్క్రీన్ పై ప్రెజెంట్ చేస్తాడనే నమ్మకం ప్రతి ఒక్కరిలోనూ ఉంది. పైగా ఇటీవల రిలీజైన 'సలార్' దేశ వ్యాప్తంగా సంచలన విజయం సాధించింది. రికార్డ్ స్థాయి కలెక్షన్లతో దూసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో రాబోతున్న ఈ సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగా ఈ సినిమా ఉంటుందనే ధీమాని చిత్ర బృందం వ్యక్తం చేస్తోంది.

ఈ సినిమాను టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. వివేక్ కూఛిబొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే రైట్



కౌశల్, లీషా ఎక్లైర్స్

మణి దీప్ ఎంటర్టైన్మెంట్ పతాకం పై కౌశల్ మంద, లీషా ఎక్లైర్స్ హీరో, హీరోయిన్లుగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ 'రైట్'. మలయాళంలో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో విడుదలై విజయవంతమైన 'మెమోరీస్' చిత్రాన్ని తెలుగులో నిర్మాతలు లుకలాపు మధు, మహంకాళి దివాకర్ సంయుక్తంగా రీమేక్ చేశారు. నేడు (శుక్రవారం) ఈ సినిమా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్, ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని ప్రసాద్ ల్యాబ్‌లో చిత్ర బృందం నిర్వహించింది.

ముఖ్య అతిథిగా హాజరైన మంచు మనోజ్ మాట్లాడుతూ, 'ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా తప్పకుండా హిట్ కొడుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. 'రీమేక్ రైట్స్ తీసుకున్న తరువాత మొదటి సిట్టింగ్‌లోనే ఈ సినిమా నాతోనే చేస్తానని దర్శకులు శంకర్ చెప్పారు. కరోనా సమయంలో ఎన్నో ఒడిదుడుకులను దాటుకుని షూటింగ్ పూర్తి చేశాం. ప్రతీ ఒక్కరికీ ఈ సినిమా నచ్చుతుంది' అని కౌశల్ అన్నారు. 'ఈ కథకు కౌశల్ మాత్రమే సరిపోతారని ఎంచుకున్నాం. ఈ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా కథను మరింత ఆసక్తికరంగా తయారు చేసి, పూర్తి చేశామని నిర్మాతలు మహంకాళీ దివాకర్, మధు తెలిపారు. 'అన్ని వర్గాల ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే చిత్రమిది. కచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని దర్శకుడు శంకర్ అన్నారు.

కొత్త ఎలిమెంట్‌తో ప్లాంట్ మ్యాన్



చంద్రశేఖర్, సోనాలి పాణిగ్రాహి

ఇటీవలి కాలంలో కుటుంబ కథా చిత్రాలు, కామెడీ ఎంటర్‌టైనర్స్ కరువై పోయాయి. ఆ లోటును భర్తీ చేస్తూ 'ప్లాంట్ మ్యాన్' అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేసేందుకు వస్తోంది.

'కాలింగ్ బెల్, రాక్షసి' వంటి హర్రర్ మూవీస్‌తో ఆడియన్స్‌ని థ్రిల్ చేసిన డైరెక్టర్ పన్నా రాయల్ ఇప్పుడు నిర్మాతగా డి.ఎం.యూనివర్సల్ స్టూడియోస్ అనే చిత్ర నిర్మాణ సంస్థను స్థాపించి కొత్త దర్శకులకు అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో కె.సంతోష్‌బాబును దర్శకుడిగా పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాకి పన్నా రాయల్ దర్శకత్వ పర్యవేక్షణ చేశారు.

తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. జనవరి 5న ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత పన్నా రాయల్ మాట్లాడుతూ, 'సినిమా చాలా బాగా వచ్చింది. కుటుంబ సమేతంగా చూసి ఎంజాయ్ చేసే విధంగా సినిమా ఉంటుంది. ఇప్పటివరకు ఏ సినిమాలో కనిపించని ఓ కొత్త ఎలిమెంట్ ఈ సినిమాలో ఉంది. అది సినిమా చూస్తేనే తెలుస్తుంది. జనవరి 5న ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నాం. ఈ సినిమా విజయం సాధించి, అందరికీ మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

చంద్రశేఖర్, సోనాలి పాణిగ్రాహి, అశోక్ వర్ధన్, యాదం రాజు, అప్పారావు, బేబీ ప్రేక్షిత, అక్కం బాలరాజు, చలపతిరావు, తడివేలు, బాలరాజ్, లక్ష్మీకిరణ్, శేఖర్, వీరభద్రం, శ్రీకుమారి, మురళీకృష్ణ, వాణిశ్రీ, బిందు, సరస్వతి, జగపతి నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: పి.ఎస్.మణికర్ణన్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్: వినోద్ యాజమాన్య, సంగీతం: ఆనంద బాలాజీ, ఎడిటింగ్: ఎస్.కె.చలం, మాటలు: సాయికృష్ణ వెలిశెట్టి, పన్నారాయల్, పాటలు: ఈశ్వర్ హేమకాంత్, సింగర్స్: కుమార వాగ్దేవి, రోహిత్ శ్రీనివాసన్.

14 డేస్ లవ్ రిలీజ్‌కి రెడీ



మనోజ్ పుట్టూర్, చాందిని భాగవని

హరిబాబు దాసరి నిర్మాతగా, అఖిల్ అండ్ నిఖిల్ సమర్పణలో సుప్రియ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగరాజు బోడెం దర్శకత్వంలో రూపొందిన యూత్ ఫుల్, కుటుంబ కథా చిత్రం '14 డేస్ లవ్'. మనోజ్ పుట్టూర్, చాందిని భాగవని హీరో, హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో రాజా రవీంద్ర, సనా సునూర్, అంజలి ఐడ్రీమ్, రాజా శ్రీధర్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. కుటుంబ విలువల్ని కాపాడే ప్రయత్నంలో ఓ ఇంటి వారసులు ఎదుర్కొన్న సమస్యలు ఏంటి?, వారి మధ్య చిగురించిన ప్రేమకు ఎలాంటి ముగింపు దొరికింది అనే కోణంలో దర్శకుడు నాగరాజు బోడెం అత్యంత ఆసక్తికరంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సంప్రదాయ విలువలున్న ఈ చిత్రం జనవరి 5న విడుదలకు సిద్ధంగా ఉంది అని చిత్ర బృందం తెలిపింది.

సింగిల్ క్యారెక్టర్.. సింగిల్ షాట్



హన్సిక

హన్సిక హీరోయిన్‌గా రాజు దుస్స దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం '105 మినిట్స్'. రుద్రాంశ్ సెల్యులాయిడ్స్, మాంక్ ఫిలిమ్స్ పతాకాలపై బొమ్మ కె శివ నిర్మిస్తున్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా సింగిల్ షాట్ సింగిల్ క్యారెక్టర్ మూవీగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్ర మోషన్ పోస్టర్ దర్శకుడు అజయ్ భూపతి రిలీజ్ చేశారు. ఈ మోషన్ పోస్టర్‌లో రక్తపు గాయాలతో కుర్చీలో కూర్చున్న హన్సిక ఒక ఇంటెన్సిఫైడ్ లుక్‌తో కనిపిస్తుంది. శ్యాం సి యస్ సంగీతాన్ని అందించారు. రిలీజ్ అయిన మోషన్ పోస్టర్ మూవీ పైన అంచనాలను పెంచేస్తోంది. హీరోయిన్ ఓరియంటెడ్ రోల్ అందులోనూ ఇలాంటి ఒక డిఫరెంట్ రోల్ చేయడం హన్సికకి ఇదే మొదటిసారి.

మాంక్, పనోరమ స్టూడియోస్ సంయుక్తంగా డిస్ట్రిబ్యూట్ చేస్తున్న ఈ సినిమా జనవరి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.